# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఆగస్టు 2024

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 17 సంచిక: 8

**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: **సాయినాథ్, రమేష్**

**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**

## లోపలి పేజీల్లో

| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| జప సమర్పణ ఆహ్వానము | 6 |
| గరుడ పంచమి | 8 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 12 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 23 |
| శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనము | 29 |
| యజ్ఞోపవీతం - పరమం పవిత్రమ్ | 31 |
| శుభప్రదం - మంగళప్రదం మంగళగరీ వ్రతం | 36 |
| రామాయణ రత్నాకరం | 39 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 43 |
| శ్రీకృష్ణ తత్వం | 48 |
| ముకుందమాల | 50 |
| శ్రీకృష్ణ జననము | 55 |
| తిరుమల సర్వస్వం | 58 |
| శ్రీకృష్ణ లీలలలోని వేదాంత తత్త్వాలు | 62 |
| కృష్ణ నామం | 63 |
| మీ ప్రశ్న మా సమాధానం | 62 |
| తొలి ఏకాదశి | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |



## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# విరాట్ రూపముతో అనుగ్రహించుట

శ్రీవేంకటేశం మహామంత్రపీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరునికి తేది **27–08–2024** గోకులాష్టమి నాడు **22**వ పర్యాయంగా **7** కోట్ల జపమును సమర్పిస్తున్నాము. ఇందుకోసం గత సంవత్సరం నుండి **70,000** జప పుస్తకములను భక్తులకు ఉచితంగా పంపిణీ చేసి వ్రాయించాము. సం॥ **2002** లో ప్రారంభమైన ఈ సేవ స్వామి కృపతో నేటికీ కొనసాగుచున్నది. ఈ జప యజ్ఞములో పాలు పంచుకున్న ప్రతి భక్తుణ్ణి అనుగ్రహించమని తిరుపతిలో ప్రత్యేక పూజలు నిర్వహించగలము. తేది **26–08–2024** నాడు స్వామివారి పాదాలకు ఇట్టి జపాన్ని సమర్పించగలము మరియు తేది **27–08–2024** నాడు ఎస్వీ డైరీఫాంలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపము వద్ద జప హోమాదులు నిర్వహించి జపము వ్రాసినవారి కోర్కెలు తీర్చమని ప్రార్థించి సమర్పించగలము.

కలియుగ మానవులు తరించాలంటే హరినామ స్మరణే ఉత్తమ మార్గము. దీనిని సాధించుటకు అంటే అందరిచేత శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ చేయించాలనే ఉద్దేశ్యముతో ఈ జపసమర్పణ కార్యక్రమము ప్రారంభించబడ్డది. స్వామివారి నామాన్ని ఒకసారి వ్రాయునప్పుడు దాదాపు ఆరేడుసార్లు స్మరణ జరుగును. కాబట్టి స్వామి స్మరణకు జపం వ్రాయుట అత్యుత్తమ సాధనము. తన జీవితము ఏడు రోజులలో ముగియునని భావించిన పరీక్షిత్తు మహారాజు శ్రీ మహాభాగవతమును విని, స్వామిని స్మరిస్తూ ముక్తిని సాధించాడు. కేవలం **2** ఘడియలే తన జీవితము మిగిలి ఉన్నదని తెలుసుకున్న ఖట్వాంగ మహారాజు ఆ రెండు ఘడియలలో స్వామివారిని స్మరించి ముక్తి పొందాడు. ఇలా ఎంతోమంది మహానుభావులు భగవంతుని స్మరణ మూలంగా జీవితమును సార్థకము చేసుకున్నారు. కలియుగములో భగవంతుని స్మరణకు ఉన్న ప్రాధాన్యత మరో దానికి లేదు. మానవ జీవితానికి ఉన్న నాలుగు ధర్మాలలో బ్రహ్మచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థము మరియు సన్యాసాశ్రమములలో గృహస్థాశ్రమము ప్రధానమైనది. ఇది మిగిలిన మూడు ఆశ్రమాలను పోషించేటువంటిది. ఇంతటి గొప్పదైన గృహస్థాశ్రమములో ఉన్న గృహస్థులు వారికి తగిన సమయములో శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ చేస్తూ, జపాన్ని వ్రాయుచు జీవితము గడిపినచో వారు ధన్యులుగా, స్వామి కృపకు పాత్రులుగా పరిగణించబడుదురు. పైగా ఈ జప సమర్పణ కార్యక్రమము సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే ప్రారంభించబడ్డది. తిరుమలలో జప సమర్పణ సమయాన ఈ జపము వ్రాసిన ప్రతి భక్తుణ్ణి స్వామివారు చక్కగా అనుగ్రహిస్తారు. ఇందుకు గాను జపానికి తిరుపతిలో పూజలు నిర్వహించే సమయాన ఆ జపపు కుప్ప పైన, ప్రతి పుస్తకము తమ పాదాలపై ఉండునట్లు విరాట్ రూపునిగా మారి జప కుప్ప పైన కుప్పకు సరిసమానమైన పాదములు కలిగి, ఈ జప కుప్పపై నిలుచుండును. ఇది ఈ **7** కోట్ల జపములో పాల్గొన్న ప్రతి భక్తుణ్ణి అనుగ్రహించునట్లు లెక్క. తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. మనలను ఉద్ధరించుటకే వైకుంఠమును వీడి తిరుమలలో స్థిర నివాసము ఏర్పరచుకున్నాడు. మనకు అత్యంత అందుబాటులో ఉన్నాడు. పిలిచిన పలికే దైవము. భక్తప్రియుడు, భక్తవత్సలుడు, గోరంత సేవకు కొండంత వరాన్నిచ్చే దైవము. ఆపద్బాంధవుడు. ఆయన నీడలో మనకు భయము లేదు. సదా స్వామివారి స్మరణతో జీవితాన్ని సాగిద్దాం! మనోనేత్రంతో దర్శిస్తూ, స్మరిస్తూ ఈ జీవితాన్ని సార్థకం చేసుకుందాము.

నమో వేంకటేశాయ

నమో వేంకటేశాయ
**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం|| | 500-00 |
| ☐ 4 సం|| | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్కు
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో ॥ కందర్ప దర్పహర సుందర దివ్యమూర్తే
కాంతా కుచాంబురుహ కుట్మల లోలదృష్టే
కళ్యాణ నిర్మల గుణాకర దివ్యకీర్తే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్

తాత్పర్యం – తానే సుందరుడనుకొను మన్మథుని గర్వమును నిర్మూలించునట్టి సుందరమైన, దివ్యమైన స్వరూపము గలవాడా, అతిలోక సుందరి యైన లక్ష్మీదేవి స్తనములనెడు తామర మొగ్గలపై ఆసక్తిగల దృష్టి గలవాడా, మంగళకరమైన, దోషరహితమైన కళ్యాణగుణములకు నిలయమైనవాడా! మంచి కీర్తి గలవాడా! ఓ వేంకటేశా! నీకు శుభోదయమగు గాక!

శ్లో ॥ మీనాకృతే కమఠకోల నృసింహ వర్ణిన్
స్వామిన్ పరశ్వథ తపోధన రామచంద్ర
శేషాంశరామ యదునందన కల్కిరూప
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతం

తాత్పర్యం – మీన, కూర్మ, వరాహ, నృసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, శ్రీకృష్ణ, కల్కి అవతారములను ధరించిన వేంకటాచలపతీ! నీకు శుభోదయమగు గాక!

– డా|| కె.వి. రాఘవాచార్యులు

# ముక్తిమార్గము



## ముఖారి

బ్రహ్మ గడిగిన – పాదము
బ్రహ్మము దానె నీ – పాదము ॥పల్లవి॥

1. చెలఁగి వసుధ గొలి – చిన నీ పాదము
బలితల మోపిన – పాదము
తలఁకక గగనము – దన్నిన పాదము
బలరిపుఁ గాచిన – పాదము ॥బ్రహ్మ॥

2. కామిని పాపము – గడిగిన పాదము
పాము తల నిడిన – పాదము
ప్రేమపు శ్రీసతి – పిసికెడి పాదము
పామిడి తురగపుఁ – బాదము ॥బ్రహ్మ॥

3. పరమ యోగులకుఁ – బరిపరి విధముల
పర మొసఁగెడి నీ – పాదము
తిరువేంకటగిరి – తిరమని చూపిన
పరమ పదము నీ – పాదము ॥బ్రహ్మ॥





భావము – శ్రీవేంకటేశ్వరా! నీ పాదము బ్రహ్మచే కడగబడినది. మరియు తానే బ్రహ్మమైనది. వేంకటేశ్వరుడే పరబ్రహ్మము గాన తదేక దేశమైన పాదము గూడ బ్రహ్మమే అని భావము.

నీ పాదము భూమిని గొలిచినది. బలిచక్రవర్తి తలపై మోపబడినది. జంకు గొంకు లేక ఆకసమును తన్నినది. ఇంద్రుని రక్షించినది. మరియు నీ పాదము కాముకురాలైన అహల్య పాపమును క్షాళనమొనర్చినది. కాళియుని పడగలపై నుంచబడినది. ప్రేమమూర్తి యగు శ్రీలక్ష్మీదేవిచే ఒత్తబడుచున్నది. అడ్డమాక లేక స్వచ్ఛందముగా ఉద్ధతమై సంచరించు తురగము నధిష్ఠించినది. మరియు శ్రేష్ఠులైన యోగులకు నానా విధముల నీ పాదము ముక్తి నిచ్చుచున్నది. శ్రీవేంకటాద్రియే శాశ్వతమైనదని భక్తులకు చూపుచున్నది. కాన నీ పాదమే మాకు పరమ పదము (కైవల్యము) అని భావము.

**భావానువాదం:**
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**

## PROGRAMME AT HYDERABAD

Date : **15-08-2024**
Venue : Namo Venkateshaya, Plot No. 9/3, M.Block, Road No. 1. & 2, (1-2-63/10/1), Kakatiya Nagar, Habsiguda, Hyderabad.
Time : 6.00 pm Onwards Vishnu Sahasra Nama Parayanam.

## PROGRAMME AT TIRUPATI

Date : **26-08-2024** Monday
Venue : Srivari Padala Mandapam, Near Alipiri, Tirupathi,
Time : 5.45 pm Starting of Pooja, Vishnu Sahashra Nama Parayanam, Submission of 21st Time 7 Crore Japam at Lotus Feet of Lord Sri Venkateshwara.

Date : **27-08-2024** Gokulashtami Day Tuesday
Venue : Tirumala Tirupathi Devasthanam Dairy Farm, Chandragiri Road, Tirupathi.
Time : 8.00 am Starting of Pooja, Sri Venkateashwara Maha Mantra Yagnam & Vishnu Sahasra Nama Parayanam.

11.30am: Yagna Purnahuti by E.O., T.T.D.
12.00pm: Submission of 22nd Time 7 Crore Japam in to Sri Venkateshwara Divya Maha Mantra Sthupam by Sri E.O., T.T.D, Tirupathi.
At 12.20 pm : Initiation of 23rd 'SAPTHA KOTI JAPA SANKALPAM' by Executive Office , T.T.D., Tirupathi.
Followed by Prasadam.

*Sri Venkateswara Pada Sevak*

**PULLAGURLA SAI REDDY**

**(GOVINDA DASU)**

*Founder and Organiser*


**Sri Venkateshwara Maha Mantra Peetham**

**93482 12354**

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

ద్వావింశతి (22వ) పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# ఆహ్వానము





## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇ.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ,
హైదరాబాద్-500 007.

040 - 27175050 | 93482 12354, 93488 11223



# నమో వేంకటేశాయ

తిరుమలశ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములు, దివ్యాశీస్సులు అందరికీ లభించాలనే ఉద్దేశంతో, శ్రీవారి నామస్మరణలోని ఆనందమును అందరూ అనుభవించి తరించాలనీ, దానికి మేము ఒక సాధనముగా ఉపయోగ పడాలనే తపనతో ఆయనకు తనవితీరా సేవ చేయాలని, ఆయన సేవే మా పరమధర్మంగా భావించి శ్రీవారికి కోట్ల జప సమర్పణ సంకల్పంలో భాగంగా తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి **ద్వావింశతి (22వ) పర్యాయంగా** 7 కోట్ల జప సమర్పణ కొరకై తేది **15-08-2024** రోజున మా ఆఫీస్ /ఇంటి నుండి 22వ పర్యాయంగా 7 కోట్ల జపము తిరుపతికి పంపుదుము. ఇట్టి జపమును టిటిడి వారి సౌజన్యంతో తేది **26-08-2024** నాడు తిరుపతిలో స్వామివారి పాదాలకు సమర్పించి స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సర శ్రావణ బహుళ అష్టమి మంగళవారం అనగా తేది **27-08-2024** గోకులాష్టమి రోజున ఎస్.వి.డైయిరీ ఫారం, తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర మహామంత్ర యజ్ఞం చేసి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహా మంత్ర స్థూపము'లో స్వామివారికి సమర్పించబడును.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

## తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి
## కోట్ల జప సమర్పణలోని సంకల్పము

1. శ్రీ వేంకటేశ్వరుని నామమును అందరికీ తెలుపుతూ, నిర్మలమైన మనస్సుతో స్మరింప, ధ్యానింప చేయుటకు ప్రయత్నించుట. వారందరినీ శ్రీవారి కరుణా కటాక్షములకు, దివ్యమైన ఆశీస్సులకు, అనుగ్రహానికి పాత్రులుగా చేయుట.
2. భక్తులు తమకోరికలను తీర్చుకొనుటకు ఒక సాధనముగా ఉపయోగపడుట. శ్రీవారి నామమును స్మరించుట వలన కలిగే ఆనందమును అందరికీ తెలియజేసి కృతార్థులమైనట్లు భావించుట.
3. భక్తులలో శ్రీ వేంకటేశ్వర స్వామిపట్ల భక్తిని పెంపొందించి ఆయనపై అమితమైన విశ్వాసము, సమర్పణ భావాన్ని కలిగించుటకు మరియు భక్తులకు శ్రీవారి సేవ చేయు భాగ్యమును కల్పించుట.
4. ప్రతిసారీ కనీసం 7 కోట్ల జపమును స్వామివారికి సమర్పించి కనీసం 70 వేల మంది భక్తుల కోరికలను తీర్చుమని శ్రీ వేంకటేశ్వరుని ప్రార్థించే భాగ్యమును పొందుట.
5. 2002 నుండి ప్రతి సంవత్సరము 7 కోట్ల జపమును శ్రీ వేంకటేశ్వర స్వామికి సమర్పించుచూ 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము'ను శ్రీవారి నామముతో నింపి శ్రీ వేంకటేశ్వరుడు మాపై పెట్టిన బాధ్యతను నెరవేర్చినామని సంతోషించుట.
6. శ్రీ వేంకటేశ్వరుని నామము \|/ విలువ అనంతము. దానికి విలువ కట్టుట మాకు ఈ జన్మకు సాధ్యము కాదు. కాని దాని విలువను \|/ కోట్ల జపమునకు సరిపెట్టుమని ప్రార్థించి, అంత జపమును సమర్పించి, ఫలితమాశింపక శ్రీవారి తిరునామములో \|/ బిందువులాగా ఇమిడిపోయి ఆ తిలక ధారణలోని ఆనందమును అనుభవించుట.
7. ఈ కార్యక్రమములో అందరు భక్తులు పాలుపంచుకునేలా ప్రోత్సహించి వారి శక్త్యానుసారం తమ సేవలందించుటకు అవకాశము కల్పించి, నిస్వార్థ సేవతో, ఫలితమాశించకుండా చివరిదాకా సేవచేయుచూ చిట్టచివరకు ఆ శ్రీ వేంకటేశ్వరుని పాదసేవకునిగా మిగిలి అమితానందమును అనుభవించుట.

శ్రీ వేంకటేశ్వర పాద సేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

(వ్యవస్థాపకులు శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)

# గరుడ పంచమి

- చిల్లర సీతారామారావు



ఆహ్లాదకరమైనది శ్రావణ మాసము. ఈ మాసము స్త్రీలకు చాలా ఇష్టమైన మాసము. స్త్రీలకు ఇష్టమైన శ్రావణ శుక్రవారము నందు వరలక్ష్మీ వ్రతము, శ్రావణ మంగళవారము నందు మంగళగౌరీ వ్రతము ఈ మాసము నందే వస్తాయి. అలాగే మరొక ఇష్టమైన వ్రతము గరుడ పంచమీ వ్రతము. రక్షాబంధన పర్వము సోదర సోదరీ ప్రేమకు చిహ్నమయితే, గరుడపంచమీ వ్రతము పుట్టినింటికీ, మెట్టినింటికీ సకల సౌభాగ్యాలను ప్రసాదించడమే కాకుండా, ఈ వ్రతమును ఆచరించిన ముత్తయిదువలను కలకాలం పసుపు కుంకుమలతో వర్ధిల్లేలా చేస్తుందనేది సుమంగళుల విశ్వాసము.

శ్రావణ శుక్లపంచమిని నాగపంచమి లేదా గరుడ పంచమి అని పిలుస్తారు. ఈరోజున ఆదిశేషుడిని పూజించడము ఒక విశేషము. గరుత్మంతుడు అమర లోకము నుండి అమృతమును తెచ్చినది పంచమి నాడే. కనుక ఈ పంచమిని గరుడ పంచమి అని పిలుస్తారు. తల్లికి దాస్య విముక్తిని కలిగించిన గరుడుడిని స్మరించుకుంటూ చేసుకొనే పర్వము గరుడ పంచమి. తోబుట్టువులు గల మహిళలు గరుడ పంచమీ వ్రతమును ఆచరిస్తారు. తోబుట్టువులు సుఖ సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, గరుత్మంతుడి లాగా బలవంతుడు అయిన తనయుడు కలగాలన్న అభిలాషతో ఈ వ్రతమును భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు.

గరుడ పంచమి రోజున మహిళలు వేకువ జాముననే లేస్తారు. స్నానాదికములు పూర్తి గావించుకుంటారు. ఇంటిని శుభ్రము చేసుకుంటారు. గుమ్మములకు తోరణములు కడతారు. గడపలకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెడతారు. పూజా మందిరములో ఒక మంటపమును ఏర్పాటు చేస్తారు. ఆ మంటపమును పూలు, పండ్లు, పత్రములతో అలంకరిస్తారు. మంటప మధ్యభాగమున ఒక పీటను వేస్తారు. ఆ పీటకు పసుపు రాస్తారు. పీట మధ్య భాగమున శక్త్యానుసారము బంగారముతో గాని, వెండి, రాగి, మట్టితో గాని చేయించిన దేవతా విగ్రహమును ఉంచుతారు. ఆ విగ్రహము ముందర పసుపుతో చేసిన గణపతిని ఉంచుతారు. తరువాత షోడశోపచారములతో పూజలు చేస్తారు. అష్టోత్తర నామములు చదువుతారు. బ్రాహ్మణునకు దక్షిణ, తాంబూలాదులు ఇచ్చి సత్కరిస్తారు. ముత్తయిదువలకు వాయినములు, తాంబూలములు ఇస్తారు. గరుడ పంచమీ

ప్రకారము ఎవరి మాట నెగ్గితే వారికి రెండవ వారు జీవితాంతం దాసిగా ఉండాలి.

కద్రువ ఇంటికి చేరగానే తనయులనందరినీ పిలిచింది. వారు వచ్చిన తర్వాత వారితో ఇలా అంది. నాయనలారా! మీరు కామరూపులు. మీరు ఏదయినా చేయగల సమర్థులు. నాదొక చిన్న కోరిక. మీరు తీర్చగలరు అని అనుకుంటున్నాను అని పలికిన తల్లితో తనయులు నీ కోరికను తెలియజేయుమని పలికారు. కద్రువ చెప్పసాగింది. సముద్ర తీర ప్రాంతమున తెల్లని గుర్రము తిరుగాడుచున్నది. దాని తెల్ల తోకను నలుపు చేయాలి. ఎందుకంటే ఆ తోక తెలుపు అని వినత, నలుపు అని నేను పందెము వేసుకున్నాము. ఓడిన వారు గెలిచినవారికి జీవితాంతం దాసిగా ఉండాలి. కనుక మీరు వెళ్ళి గుర్రపు తోకను నలుపు చేయండి. తల్లి మాటలు విన్న తనయులు తల్లి కోర్కె ధర్మవిరుద్ధముగాన తాము చేయము అని పలికారు. ఆగ్రహించిన కద్రువ, జనమేజయుడి సర్పయాగమున, సర్పములు మరణించు గాక అని తనయులను శపించింది. శాపమునకు భయపడిన కర్కోటకుడు తల్లి కోరికను నెరవేర్చడానికి సిద్ధపడ్డాడు.

మరుసటి రోజున కద్రువ, నేను సముద్ర తీరమునకు వెళ్ళి గుర్రపు తోకను చూడగా అది నలుపుగా కనిపించింది. దానితో నేను దాసిగా మారాను. ఈ శాపమునకు మూలకారణము అనూరుడు అని చెప్పి కుమారా! నీ వలన నాకు దాస్య విమోచనము కలుగునని అనూరుడు చెప్పిన మాటతో ఊరట చెందుతూ కాలము గడుపుచున్నాను. సమర్థులైన కుమారులు జన్మిస్తే తల్లితండ్రులు తమ కష్టాలన్నీ గడిచి గట్టెక్కడం సర్వత్రా ఉన్నదే గదా! అయిననూ నీవంటి సత్పుత్రుడు కలిగినా నాకు ఈ సవతి దగ్గర దాస్యం చేసే నైచ్యం పోలేదు అని పలుకుతూ కంట నీరు పెట్టుకుంది.

గరుత్మంతుడు తల్లిని దాస్యము నుండి విముక్తురాలిని చేయవలెనని సంకల్పించుకున్నాడు. ఒకనాడు కద్రువ తనయులతో – మీ మనస్సు ఏదయినా బలమైన కోర్కె ఉంటే తెలియజేయండి. మీరు ఏది కోరినా దానిని వెంటనే నెరవేరుస్తాను. మీ కోరిక తీరిన తరువాత నన్ను, నా తల్లిని దాస్యమునుండి విముక్తులను గావించండి. ఇది నా ప్రార్థన. నాగులందరూ కలిసి సంప్రదించుకున్నారు. తరువాత గరుత్మంతుడితో – నీవు మహాబలశాలివి. నీకు అసాధ్యము అనునది లేదు. నీవు అమర లోకమునకు వెళ్ళి, అమరులను జయించి, అమృతమును తీసుకొని వచ్చి మాకు అందించు. ఇలా చేస్తే మీకు దాస్య విముక్తి లభిస్తుంది అని పలికారు. సర్పముల పలుకులు మిక్కిలి ఆనందమును కలిగించినాయి. వెంటనే బయలుదేరి అమృతమును తెచ్చుటకు బయలుదేరాడు. ముందుగా తల్లి దగ్గరకు వచ్చాడు. తల్లికి ప్రణమిల్లాడు. సర్పముల పలుకులు వినిపించాడు. సర్పముల కోరిక ప్రకారము అమృతమును తేవడానికి బయలుదేరుతున్నాను. దానికి ఎంతో శక్తి కావాలి. ఆ శక్తి పుష్టికరమైన ఆహారము వలననే లభిస్తుంది. కనుక ఆహారము ఏర్పాటు చేయుము అని పలికాడు.

వినత గరుత్మంతుడితో సముద్ర మధ్యంలోని ద్వీపం నిండా నిశాచరులు ఉన్నారు. వారిని ఆరగించి నీ ఆకలి తీర్చుకో అని పలికింది. గరుత్మంతుడు తల్లికి నమస్కరించి నిషాదులు ఉన్నచోటికి బయలుదేరి వెళ్ళి వాళ్ళను ఒక్క గుక్కలో కబళించేశాడు. అక్కడినుండి బయలుదేరి వెళ్ళి గంధమాదన పర్వతం మీద తపము గావించుకుంటున్న తన తండ్రి కశ్యప మహర్షిని దర్శించుకున్నాడు. మాతృమూర్తి దాస్య వృత్తాంతమును, అమృతమును తేవడానికి బయలుదేరిన విషయమును వివరించి చెప్పాడు. నాకు ఆకలిగా ఉంది. ఆకలి తీరే మార్గం తెలపండి అని ప్రార్థించాడు. ఇక్కడికి సమీపములో పెద్ద సరోవరము ఉన్నది. దానిలో గజ కచ్ఛపాలు రెండున్నాయి. ఈ రెండూ గత జన్మలో సోదరులు. విరోధముతో ఒకరినొకరు శపించుకుని ఇలా అయ్యారు. ఆ రెండింటినీ ఆహారముగా గ్రహించి నీ ఆకలిని తీర్చుకో అని చెప్పాడు కశ్యప మహర్షి. గరుత్మంతుడు తండ్రి ఆదేశానుసారం గజ కచ్ఛపాలను పట్టుకొని భుజించటానికి ఒక మర్రిచెట్టు కొమ్మమీద కాలు పెట్టగా మర్రిచెట్టు కొమ్మ విరిగిపోయింది. ఆ కొమ్మకు పాదాల నుంచి తలక్రిందులుగా తపము గావించుకుంటున్న వాలఖిల్యులు అను మహర్షులను గమనించాడు. వారు క్రిందపడి మరణిస్తారేమోనన్న భయముతో కొమ్మను ముక్కుతో పట్టుకుని ఎగురుతూ తండ్రి దగ్గరకు వెళ్ళాడు. తనయుడి నోట చెట్టుకొమ్మ, కొమ్మకు వేలాడుతున్న వాలఖిల్య మహర్షులను గమనించి జరిగినదంతా గ్రహించాడు కశ్యప మహర్షి. ఆయన వాలఖిల్య మహర్షులను ప్రార్థించాడు. ఆయన ప్రార్థనను మన్నించి వాలఖిల్య మహర్షులు హిమవత్పర్వత ప్రాంతములకు వెళ్ళారు. తండ్రి ఆదేశానుసారము గరుత్మంతుడు చెట్టుకొమ్మను హిమవత్పర్వత ప్రాంత సమీపమున గల, నిష్పురుష పర్వత పరిసరములలో విడిచిపెట్టి గజ కచ్ఛపాలను తృప్తిగా ఆరగించాడు. దానితో అతనికి ఎనలేని జవసత్వాలు చేకూరాయి.

గరుత్మంతుడు తన రెక్కలను అల్లల్లాడిస్తూ స్వర్గలోకమున అడుగు పెట్టగానే మహోత్పాతాలు బయలుదేరాయి. వజ్రాయుధము యొక్క అంచులు మొక్కపోయాయి. దేవతలందరూ భయభ్రాంతులకు లోనయ్యారు. ఇంద్రుడు భయపడి బ్రహ్మను దర్శించుకుని ఈ పెను ప్రళయమునకు హేతువేమిటి? అని అడిగాడు. అమృతమును తీసుకొని పోవడానికి గరుత్మంతుడు వస్తున్నాడు. అతడు సర్వశక్తి సంపన్నుడు. ఇచ్ఛ వచ్చినట్లుగా సంచరించేవాడు. అతడిని నీవు ఏమీ చేయలేవు. నువ్వు వాలఖిల్యులను పరిహసించిన దానికి ఫలమిది అని బ్రహ్మ పలికాడు. దేవేంద్రుడు మరల ప్రశ్నించాడు. అతనికి అమృతము ఎందులకు? గరుత్మంతుడు తన జనని దాస్య

వ్రతము పూజ అయిన తరువాత వ్రత గాథను కుటుంబ పెద్ద చదివి వినిపిస్తాడు.

కృత యుగములో కశ్యప మహర్షి భార్యలైన కద్రువ, వినతలు సంతానార్థము కశ్యప మహర్షిని పెక్కు సంవత్సరములు సేవించారు. అంతకు పూర్వమే కశ్యప మహర్షి సంతానము కొరకు పుత్ర కామేష్టి యజ్ఞమును చేశాడు. అందువలన భార్యల సేవలకు కశ్యప మహర్షి సంతృప్తుడైనాడు. భార్యలతో వరములను కోరుకొనండి ప్రసాదిస్తాను అని పలికాడు. కద్రువ వెయ్యిమంది అగ్నివలె ప్రకాశించువారు, పొడవైన దేహములు గలవారు, ప్రసిద్ధి పొందిన బలం కలిగినవారు తనయులుగా ప్రసాదించుమని కోరింది. వినత, బలంలో గొప్పవారు, బాహుబలం గలవారు అయిన ఇద్దరు తనయులను ప్రసాదించవలసిందిగా కోరింది. కశ్యపుడు వారి కోరికలను మన్నించి – గర్భములను జాగ్రత్తగా కాపాడుకొమ్మని ఆదేశించాడు. కద్రువ, వినతలు అమితముగా ఆనందించారు. కొంతకాలానికి వారు గర్భవతులయ్యారు. వారి గర్భాలు కొంతకాలానికి అండములుగా మారిపోయాయి. వాటిని నేతి కుండలలో ఉంచి రక్షించసాగారు. అయిదు వందల సంవత్సరాలు గడిచిపోయినాయి. కద్రువ గర్భములోని అండములు ఒకదాని తర్వాత ఒకటి పగిలి సర్పశ్రేష్ఠులుగా అవతరించారు. వినత తన గర్భం నుండి పుట్టిన గ్రుడ్లు రెండింటినుండి ముద్దు గొల్పు కుమారులు వెలువడక పోయేసరికి సిగ్గుచేత క్రుంగిపోయి, ఒక గ్రుడ్డును బ్రద్దలు చేసింది. పగిలిన గ్రుడ్డు నుండి అవయవములు పూర్తిగా ఏర్పడని ఒక కుమారుడు ఉదయించాడు. అతడిపేరు అనూరుడు. అతడు తల్లిమీది కోపంతో ఇలా అన్నాడు. తల్లీ! నీవు నన్ను వికలాంగుడిని గావించావు. కనుక అయిదు వందల సంవత్సరములు నీవు నీ సవతికి దాసిగా ఉండుము అని శపించాడు. నీవు నీ రెండవ గ్రుడ్డు కొరకు తొందరపడకు. ఆ గ్రుడ్డు తనంతట తాను పగిలేవరకు ఉండనిమ్ము. ఆ గ్రుడ్డునుండి నీకు పుట్టబోయే తనయుడు అమిత బలసంపన్నుడు, మిక్కిలి పరాక్రమవంతుడు. అతడి వలన నీ దాసీతనము పోతుంది అని చెప్పి అనూరుడు సూర్యుడి రథసారథిగా వెళ్ళాడు. వినత తన రెండవ గ్రుడ్డును అతి జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చింది. అయిదు వందల సంవత్సరములు గడిచిపోయినాయి. ఒకనాడు ఆ గ్రుడ్డు పగిలి మహా సత్త్వశాలి అయిన తనయుడు జన్మించాడు. ఒక్కమారు తన రెక్కలల్లాడించి, ఆ ధాటితో మహార్ణవాలు, కులపర్వతాలు కూడా గిరగిరా త్రిప్పి వేయగల మహాసత్త్వశాలి అయిన గరుత్మంతుడు జన్మిస్తూనే తృటిలోనే పైకెగిరి ఆకాశమునకలంకారమై నిలిచాడు. వినత తన కుమారుడిని చూచింది. ఆనందముతో బాష్పధారలు ప్రవహించాయి. బడబాగ్నివలె రౌద్రాకారుడైన గరుత్మంతుడిని చూచి దేవతలు భయపడి అగ్నిని శరణు జొచ్చారు. భయపడిన దేవతలకు అగ్ని సాంత్వన నిస్తూ ఇలా అన్నాడు. దేవతలారా! భయపడకండి. ఇతడు గరుత్మంతుడు. నాతో సాటి అయినవాడు. మహాబలవంతుడు. కశ్యప మహర్షి తనయుడు. దేవతలకు హితమును గూర్చువాడు. అగ్ని దేవుడి మాటలకు దేవతలు శాంతి నొందారు.

గరుత్మంతుడు ఆకాశము నుండి దిగి వచ్చి మాతృమూర్తి వినతను దర్శించుకుని నమస్కరించాడు. తరువాత సవతి తల్లి కద్రువ దగ్గరకు వెళ్ళి ఆమెకు నమస్కరించాడు. కద్రువ గరుత్మంతుడితో నాయనా! మీ అమ్మవలె నువ్వు కూడా మాకు దాసుడవై ఉండాలి. ఈ రోజు నుండి నా పుత్రులను నీ మూపురం మీద ఎక్కించుకుని అన్ని చోట్లకూ తిప్పుతూ ఉండు అని పలికింది. కద్రువ మాటలకు అంగీకరించాడు గరుత్మంతుడు. సర్పములను మూపురము మీద ఎక్కించుకుని వారికి అడవులను, గొప్ప గొప్ప ద్వీపాలను, పర్వతాలను, అష్టదిక్పాలకుల నగరములు మున్నగువాటిని చూపించసాగాడు. ఒకసారి సర్పములను మూపురం మీద ఎక్కించుకుని గరుత్మంతుడు సూర్యమండలమునకు చేరుకున్నాడు. సూర్యుడి తీక్షణమైన కిరణముల వేడికి సర్పములన్నీ మాడి, జారి నేలమీదపడి మూర్ఛిల్లాయి. కొడుకుల అవస్థకు దురపిల్లిన కద్రువ గరుత్మంతుడిని నిందించింది. తనయులను రక్షించమని దేవేంద్రుడిని భక్తి శ్రద్ధలతో అర్థించింది. కద్రువ ప్రార్థనలనకు ప్రసన్నుడైన ఇంద్రుడు కుంభవృష్టి కురిపించాడు. దానితో నాగులు ఉపశమనమును పొందారు.

కద్రువ నిందావాక్యములు గరుత్మంతుడిని బాధించాయి. కద్రువకు, ఆమె తనయులకు దాస్యం చేయడం గరుత్మంతుడికి నచ్చడం లేదు. ఒకనాడు తల్లి దగ్గరకు పోయి – తల్లీ! మిక్కిలి పొడవైన నా ముక్కుతోను, రెక్కలతోను, కులపర్వతములను పగలగొట్టి చూర్ణము చేయగల మహాబలశాలిని. ఇంతటి శక్తిగల నాకు ఈ పాపజాతి భారం భరిస్తూ ఈవిధముగా నీచ దాస్యం చేయవలసిన దురదృష్టం పట్టడానికి కారణమేమిటి అని అడిగాడు. వినత సమాధానమిస్తూ – మనం దాస్యం చేయడానికి గల కారణమును వివరిస్తాను వినుము. ఒకనాడు నేను, కద్రువ సముద్ర తీరమునకు వాహ్యాళికి వెళ్ళాము. అక్కడ ఒక తెల్లని గుర్రము తిరుగాడుచున్నది. ఆ తెల్లని గుర్రమును చూసి కద్రువ, ఎంత అందముగా ఉన్నది అని పలికింది. అవును గుర్రము మహాత్ముని కీర్తివలె మిక్కిలి తెల్లగా ప్రకాశిస్తున్నది అని నేను సమాధానమిచ్చాను. కద్రువ మరల మాట్లాడుతూ – గుర్రము తెల్లగా మెరిసిపోతున్నది. కాని దాని తోక కళంకము లాగా నల్లగా ఉన్నది అని అంది. నేను, అదేం లేదు, గుర్రము తెల్లగానే ఉన్నది అని పలికాను. మాటా మాటా పెరిగింది. దగ్గరికెళ్ళి చూద్దామనుకున్నాము. కనుచీకటి పడుతూ ఉండటం వలన మరుసటిరోజు చూద్దాము అని పలికింది కద్రువ. నేను సరే అన్నాను. ఒక ఒప్పందము కూడా చేసుకున్నాము. దాని

విముక్తి కొరకు అమృతమును తీసుకొని వెళ్ళి, నాగులకు ఇద్దాము అని అనుకొని వస్తున్నడు అని సమాధానమిచ్చాడు బ్రహ్మ.

గరుత్మంతుడు తనతో తలపడిన దేవతలను పరాజితులను గావించాడు. అమృత కలశము దగ్గరకు రాగానే ఒక్కమారుగా అగ్ని జ్వాలలు రేగాయి. నదీ జలాలను నోటితో తెచ్చి అగ్నిజ్వాలలను చల్లార్చాడు. పిదప అమృత కలశము దగ్గరకు రాగానే, కలశం చుట్టూ పదునైన కత్తులతో పరిభ్రమిస్తూ ఒక చక్రము కనిపించింది. సూక్ష్మ శరీరమును ధరించి, చక్ర రంధ్రముల నుండి కలశము దగ్గరకు చేరుకున్నాడు. రెండు భయంకరమైన మహా సర్పములు అమృత కలశమునకు రక్షణగా కన్పించాయి. అవి బుసలు కొడుతుంటే అగ్నిజ్వాలలు రేగుతున్నాయి. గరుత్మంతుడు సర్పముల నేత్రముల లోనికి ధూళి విసిరాడు. నేత్రములలో ధూళి పడగానే సర్పములు ఒక్కసారిగా కళ్ళు మూసుకున్నాయి. వెంటనే తన నఖములతో వాటిని చీల్చి అమృత కలశమును తీసుకుని ఆకాశ వీధిలోనికి ప్రవేశించాడు.

మహావిష్ణువు గరుత్మంతునికి దర్శనమిచ్చాడు. గరుత్మంతునితో – నీ బలమునకు, నీ తెలివి తేటలకు నేను చాలా ఆనందించాను. నీకు ఏమి వరము కావాలో కోరుకొమ్ము అని పలికాడు. గరుత్మంతుడు విష్ణువుకు నమస్కరించి – దేవా! నన్ను మీ ధ్వజ లాంఛనముగా స్వీకరించండి. అమృత సేవనము లేకుండా అజామరుడిగా ఉండేటట్లు వరము నివ్వండి అని పలికాడు. గరుత్మంతుడిని తన వాహనముగా నుండమని అడిగాడు. తథాస్తు అని వరములనిచ్చి అంతర్ధానమయ్యాడు.

అమృత కలశమును తీసుకొని పోతున్న గరుత్మంతుడి మీద ఆగ్రహముతో దేవేంద్రుడు వజ్రాయుధమును ప్రయోగించాడు. అది గరుత్మంతుడిని అలవోకగా స్పృశించింది. గరుత్మంతుడు నవ్వుతూ దేవేంద్రా! నీవు ప్రయోగించిన వజ్రాయుధము ఒక మహర్షి వెన్నెముక వల్ల



జన్మించింది. దీనిని గౌరవించడము నా విధి. కనుకనే నా రెక్కలోని ఒక ముక్కను విడిచిపెట్టాను అని పలికాడు.

మిక్కిలి బలవంతుడైన గరుత్మంతుడితో వైరం కంటే సఖ్యమే మేలని భావించాడు దేవేంద్రుడు. వీరా! నీ శక్తి చాలా ఆశ్చర్యముగా ఉన్నది. నాతో సఖ్యముగా నుండుము. అమృతమును తీసుకొని వెళ్ళి నాగులకు సమర్పిస్తే, వాళ్ళు దీని సేవనముతో లోక కంటకులవుతారు అని పలికాడు. గరుత్మంతుడు సమాధానమిస్తూ – దేవేంద్రా! నేను అమృతమును తీసుకొని వెళ్ళుతున్నది నా తల్లిని దాస్యము నుండి విముక్తురాలను చేయడానికి. అందువలన అమృతమును నాగులకు అర్పించక తప్పదు. కనుక నేను తీసుకొని వెళ్ళి వారికి అందించగానే నీవు ఏదో విధముగా దానిని చేజిక్కించుకొని స్వర్గానికి తీసుకొని పోవచ్చు అని పలికాడు. ఆ పలుకులకు దేవేంద్రుడు పరమానంద భరితుడై – నీ సుహృద్భావానికి నాకెంతో ఆనందం కలిగింది. నీ అభీష్టమేదో కోరుకో అని పలికాడు. గరుత్మంతుడు ఆ పలుకులను విని సర్పజాతి తనకు, తన తల్లికి చేసిన అపకృతులను స్మరణకు తెచ్చుకున్నాడు. ఇకనుంచి సర్ప పాపజాతి తనకు ఆహారమయ్యేటట్లు వరము ఇవ్వవలసినదని అర్థించాడు. దేవేంద్రుడు గరుత్మంతుడికి ఆ వరమును ప్రసాదించాడు.

దేవేంద్రుడు నాగులకు అమృతమును దక్కనీయకూడదని నిశ్చయించుకున్నాడు. నాగులు అమృతమును కొంచెము కూడా చవి చూడకుండా, అమృత కలశమును అపహరించుకొని పోవలెనన్న నిర్ణయానికి వచ్చాడు. గరుత్మంతుడు అమృత కలశమును తీసుకొని నాగుల దగ్గరికి వచ్చాడు. దుర్లభమైన అమృత కలశమును చూచి నాగులు పరమానంద భరితులయ్యారు. గరుత్మంతుడు పవిత్రమైన దర్భల మీద అమృత కలశమును పెట్టాడు. గరుత్మంతుడు వారితో మీరు కోరిన ప్రకారము అమృతమును తెచ్చి దర్భల మీద పెట్టాను. మీరు స్నాన, సంధ్యాదులు ముగించుకుని వచ్చి అమృతమును సేవించవచ్చును. ఈ రోజు నుండి నాకు, నా జననికి దాస్యం తొలగిపోయింది అని వచించాడు. నాగులు ఆనందముతో స్నానాదులు పూర్తి గావించుకుని అమృత కలశము ఉన్న చోటికి వచ్చారు. అక్కడే అదృశ్య రూపములో ఉన్న దేవేంద్రుడు అమృత కలశమును తీసుకొని స్వర్గలోకమునకు వెళ్ళిపోయాడు. అందువలన నాగులకు అమృత కలశము కన్పించలేదు. అమృత కలశమునుంచిన దర్భలను తమ నాలుకలతో చవి చూచారు. అమృతము లభించలేదు గాని వారి నాలుకలు మాత్రము రెండుగా చీలిపోయాయి. అప్పటి నుండి నాగులకు 'ద్విజిహ్వులు' అను పేరు ఏర్పడింది. అమృతమును కొంచెం సేపు ఉంచడం వలన దర్భలు పవిత్రమైనవి అని ప్రసిద్ధిని పొందాయి.

★ ★ ★

17వ భాగము



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు

### తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**– గోవింద దాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

దిశ : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 17 వ భాగపు లీలల ప్రచురణ. (మే 2005 – డిసెంబర్ 2005)



### దుండగులు భూమిని కబళించుట

**భూ సమస్య :** రోజు రోజుకు దుండగుల దురాక్రమణ మితిమీరుతోంది. రెండుసార్లు నా భూమిలో కడీలు పాతారు. నేను వారిపైన కేసు పెట్టాను (FIR No.106/2005 dt.22-04-05 & 114/05 dt.20-04-05). దీనితో మరింత రెచ్చిపోయారు. నాపై ఎస్సీ యాక్ట్ పెడతామని భయపెట్టారు. దీనిని కట్టడి చేయాలనే ఉద్దేశ్యంతో నేను, నా భూమిని ఆక్రమించాలనే ఉద్దేశ్యంతో వారు ఒకరికి తెలియకుండా ఇంకొకరం వేర్వేరు కోర్టులను ఆశ్రయించాము. నాది ఎ.1-34 గుంటల భూమి కాబట్టి పెద్ద కోర్టును ఆశ్రయించగా వారు 4 ప్లాట్లు మొత్తం 1200 గజాలని చూపుచూ చిన్నకోర్టును ఆశ్రయించారు. ఇద్దరికి ''స్టేటస్ కో'' ఆర్డర్ ఇవ్వబడింది. ఒకరోజు స్వామివారు సూచించినట్లు ఈ దుండగులు ఆ ప్రాంతపు పోలీసులతో మాట్లాడుకున్నారు. 'స్టేటస్ కో' ఆర్డర్ ఉన్నప్పటికీ బలవంతాన గూండాలతో నా భూమి లోనికి జె.సి.పిని తెచ్చి, దౌర్జన్యంగా భూమిలోని గతంలో నరికిన టేకు చెట్ల మొదళ్ళను తీసివేసి అవి మళ్ళీ చిగురించకుండా వాటిపై ఆసిడ్ పోసి చదును చేశారు. నేను పోలీసుల వద్దకు వెళితే వారు నాకు ఎలాంటి సహాయమూ చేయలేదు. మరియు ''వాడు నేను వద్దంటే ఊరుకుంటాడా'' అంటూ వారికి సపోర్టుగా మాట్లాడారు. ఈ దుండగులు ఎస్సీ యాక్ట్ పెడతారని భయపడి నాకు తెలిసిన వారెవ్వరూ నాకు సపోర్టుగా రాలేదు. కాబట్టి నేను ఒంటరిగా ఏమి చేయలేని వానిగా ఉన్నాను. దుండగులు యథేచ్ఛగా నా భూమిని దాదాపు 3300 గజములు ఆక్రమించుకుని, దానిలో రూమ్ కట్టి నిర్భయంగా వారి స్వాధీనము లోనికి తెచ్చుకున్నారు. నాకు సహాయము చేయువారు ఎవ్వరూ లేరు. ఆ భగవంతుణ్ణే స్మరిస్తూ నేను పొందిన కలను



ఆత్రుతతో స్వామివారిని దర్శించుట

గుర్తుకు తెచ్చుకుంటూ ఇది ఆయన లీల అని భావించాను. కాని నా భయమునకు, ఆత్రుతకు హద్దులు లేవు. నా విలువైన ఆస్తిని లాక్కున్నారని, ఈ దుండగుల చేతిలో మోసపోయానని దిగులు చెందాను. స్వామివారిని రక్షించమని అత్యంత తీవ్రంగా స్మరించసాగాను. ఇప్పుడు ఈ భూమి వారి ఆధీనములోనే ఉన్నది. వారు ఆరు ప్లాట్స్ మొత్తం 1200 గజముల భూమి అని కేసువేసి, 3300 గజముల భూమిని ఆక్రమించారు. రాత్రింబవళ్ళు అక్కడే ఉండి కాపలా కాస్తున్నారు. విందులు, వినోదాలు చేసుకుంటున్నారు. నన్ను దాని దగ్గరకు రానివ్వడం లేదు. ఏకాకిగా ఉన్నాను. ఒకసారి నేను బలవంతాన వెళ్ళి వారి కడీలను తొలగించాను. అప్పుడు వారు నాపై కేసు పెట్టారు. (FIR No.114/05 dt. 30-04-05). దీనితో మరింత బాధ కలిగింది. స్వామివారిని మరింత వేడుకున్నాను. ఈ విషయం ఎలాగైనా అత్యంత త్వరగా స్వామివారికి తెలపాలని తపించిపోయాను. అనుకున్నట్లే స్వామివారు అనుగ్రహించారు. కాని నేను ఆ లీలను అర్థం చేసుకోలేదు. నేను ఆస్తి వ్యామోహంలో ఉన్నప్పుడు కాని, స్వామిపై కోపంతో ఉన్నప్పుడు కాని స్వామి లీలలు అర్థం అయ్యేవి కావు. అప్పుడు వారు అత్యంత విశ్లేషణాత్మకంగా ప్రయోగించేవారు. నా ఆస్తి హరించినప్పుడు పొందిన చాలా లీలలు అర్థం కాలేదు. 2021 సంవత్సరంలో నా పూర్తి లీలలను చదివినప్పుడు కూడా అర్థం కాలేదు. చివరికి ఈ భాగం వ్రాయునప్పుడు మాత్రమే అర్థం చేసుకున్నాను. స్వామి ప్రసాదించిన ఆ లీల ఈవిధంగా ఉంది.

**07-05-05 కల :** నేను స్వామివారి దర్శనార్థం ఒక ఆలయానికి వెళ్ళాను. అక్కడ దాదాపు ఒక ఇరవైమంది పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజ చేస్తున్నారు. ఈ పూజను చూచుటకు భక్తులు పూజారుల చుట్టూ గుమిగూడి ఉన్నారు. ఈ పూజను నిర్వహించుటకు తిరుపతి నుండి పూజారులు ప్రత్యేకంగా వచ్చారట. వేదమంత్రాలు పఠిస్తూ స్వామివారికి పూజ చేస్తున్నారు. నేను స్వామివారిని దర్శించుకోవాలనే ఉద్దేశ్యంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ ప్రభూ! ప్రభూ! అని అరుస్తూ, ఆపుకోలేని ఆవేశంతో, చాలా తొందరగా చూడాలనే తపనతో అక్కడికి చేరాను. అప్పుడు వారు స్వామివారి చుట్టూ గుమిగూడి అభిషేకము లాంటి సేవను చేస్తున్నారు. ఈ పూజ ఒక మర్రిచెట్టు క్రింద జరుగుతోంది. చెట్టుక్రింద దాని మొదలు చుట్టూ ఉన్న ఒక గద్దె లాంటి ప్రదేశంపై స్వామివారు ఉన్నారట. గుడి లేదు కాని ఆ గద్దె లాంటి ప్రదేశంపై పూజ జరుగుతోంది. తిరుపతి నుండి ప్రత్యేకంగా వచ్చిన వైష్ణవ బ్రాహ్మణులు ఈ పూజను నిర్వహిస్తున్నారు. దీనిని చూడటానికి ఆ ప్రాంతపు చాలామంది జనాలు వచ్చారు. నేను నా స్వామిని త్వరగా చూడాలనే ఆత్రుతతో ప్రభూ ప్రభూ అని గట్టిగా అరుస్తూ, ఏడుస్తూ పరుగెత్తుకు వెళ్ళాను. నా అరుపులను, నన్ను చూసిన చుట్టూ ఉన్న భక్తులు, పూజారులు ప్రక్కకు తప్పుకున్నారు. అప్పుడు స్వామివారు దర్శనమిచ్చారు. శ్రీవేంకటేశ్వరుడని భావించాను, కాని ఆయన రూపము కాదు, శివుడు. శివలింగం దర్శనమిచ్చింది. దాదాపు ఒకటిన్నర అడుగుల ఎత్తు కలిగి, ఆ లింగం నల్లని రంగుతో ఉన్నది. అప్పుడే అభిషేకం పూర్తిచేసినట్లున్నది. ఆ శివలింగమును చూసి, శ్రీవేంకటేశ్వరుడు కాదని ఒకింత నిరాశ పడ్డాను. ''ప్రభూ! నాకు ఈ రూపమును చూపెట్టారా''? అని అనుకున్నాను. ఆ తరువాత ఇది కూడా మీదే కదా అని నిభాయించుకుని మనస్ఫూర్తిగా మొక్కాను. పిదప ప్రక్కన ఒక గోయి లాంటి ప్రదేశం కనపడింది. ఆ గోయిలో స్వామివారు ఉన్నారని భావించి ఆత్రుతతో అందులోకి దిగాను. ఆ గోయి యొక్క గోడ దరిలో ఒక రంధ్రము, అందులో ఒక పుట్ట కనపడింది. ఆ పుట్టలో శ్రీవేంకటేశ్వరుడు ఉన్నాడట. ప్రక్కన కాశీదండలు, రుద్రాక్ష దండలు కట్టబడ్డాయి. సంవత్సరమునకు ఒకసారి తిరుపతి నుండి పూజారులు ఈ స్థలమునకు వచ్చి పూజ చేస్తారట. అప్పుడు తిరుపతి నుండి వచ్చిన వైష్ణవ స్వాములు స్వామివారికి పూజ చేస్తున్నారు. నేను మాత్రము ఆ పూజను చూస్తూ, ముఖ్యంగా నా ప్రభు శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆ దండల మధ్యనుండి గోడ రంధ్రము లోని పుట్టలోనికి చూస్తున్నాను. లోపల చిన్నసైజు నల్లని ఆకారముతో శ్రీవేంకటేశ్వరుడు కొలువై ఉన్నారట. కల చెదిరింది.

స్వామివారు ఈ లీలను లోతుగా ఆలోచిస్తే గాని అర్థం కానట్లు ప్రసాదించారు. ఈ లీలలో లోన శ్రీవేంకటేశ్వరుడు పైకి మాత్రం శివుడులా కనబడ్డాడు. అలాగే నాకు కలిగిన ఆపదలో

పైకి నొప్పిగా ఉండవచ్చు గాని దీని అంతరార్థం స్వామివారు ఆశించినట్లు సుఖమయమవుతుందని భావము.

ఈసంఘటనతరువాతప్రతిరోజు,ప్రతిక్షణంశ్రీవేంకటేశ్వరుణ్ణి ఆత్రుతతో స్మరించాను. దుండగులు నా భూమిని కబళించిన నాటినుండి వీరితో పోట్లాడుటకు నా శక్తి సరిపోదని భావించి ఎలాగైనా వీరిచే ఒప్పందము కుదుర్చుకోవాలని భావించాను. మా అవస్థను గమనించిన మా బంధువు ఒకరు తనకు తెలిసిన వారిచే ఒప్పందం కుదుర్చగలనన్నాడు. ఈ ఒప్పందం కుదిర్చేవారు కడప జిల్లావారు. ఆనాటి పాలకమండలికి దగ్గరివారమని చెప్పుకునేవారు. పంజగుట్టలోని ఒక హోటల్ లో వారిని కలిశాను. విషయం చెప్పాను. పరిష్కరించగలమని చెప్పారు. కాని ఈ మధ్యన మా ఇంటి గృహప్రవేశం మరియు 3వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ ఉంది కాబట్టి నా పూర్తి ధ్యాసను స్వామి సేవయందే గడుపుచు, నా భూసమస్య, వ్యాపారం ఏమైనప్పటికీ పట్టించుకోకూడదని దృఢ నిర్ణయం తీసుకున్నాను.

## స్వామి ప్రసాదించిన ఇంటిలోకి గృహప్రవేశం

**02-06-2005:** ఈరోజు గురువారం, స్వామివారు ప్రసాదించిన ఇంటిలో గృహప్రవేశం చేశాము. ఈ ఇంటిలో మీరు మెచ్చే విధంగా మరింత సేవ చేయాలని ప్రార్థించాను. పనులు ఇంకా మిగిలి ఉన్నప్పటికీ మంచి రోజులు లేవని భావించి ఏకాంతంగా గృహప్రవేశం చేశాము. మూడు రోజులు ఇంట్లో ఉన్నాము. ప్రతిరోజు ఇంట్లో స్వామి పారాయణం చేశాము. ఒక రెండు నెలల తర్వాత, తేది 07-08-2005 నాడు మూడవ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ కొరకు ప్రారంభించే రథయాత్ర సందర్భంలో, బంధు మిత్రుల సమక్షంలో ఈ గృహ ప్రవేశ ఉత్సవమును భారీగా చేద్దామనుకున్నాము. ఇదే ఇంటిలో రథం కోసం ప్రత్యేకంగా ఒక షెడ్డును కూడా నిర్మించాము. మరియు రథమునకై ప్రత్యేకంగా ఒక డి.సి.యం లారీని కొని రథాన్ని శాశ్వతంగా దానికి బిగించాము.

## రథయాత్ర నియమాలు

తేది 27-08-2005 గోకులాష్టమి నాడు తిరుపతిలో 3వ జపసమర్పణ ఉంది. దీనికై 'నమో వేంకటేశాయ' రథమును ఏయే ప్రాంతాలకు తీసుకెళ్ళాలని ఆలోచించాను. పైకి ఈ రథయాత్ర నేను జరిపినట్లు కనపడినప్పటికీ, మొత్తం స్వామివారి ఆదేశానుసారమే జరుగుతుంది. ప్రతి రథయాత్ర ప్రారంభంలో నాకు మొదట వచ్చిన ఆలోచన ప్రకారమే రథయాత్ర నిర్వహించాలి. లేనిచో స్వామివారు ఊరుకోరు. ఈ విషయాన్ని దృఢపర్చడానికి ఒక సంఘటన జరిగింది.

శ్రీవేంకటేశ్వరుని లీలలు చిత్ర విచిత్రంగా ఉంటాయి. వాటిని సరైన విధంగా విశ్లేషించుకుంటే మాధుర్యం లభిస్తుంది. ఇలాంటి ఒక లీల నా జీవితంలో జరిగింది. "భగవంతుడు స్వయంగా పిలిచి తన గదిలో చోటిస్తాను రమ్మంటే" ఆ భక్తుడి భాగ్యం వర్ణనాతీతం. ఈ లీలను సాధారణంగా చదివితే గొప్పదనము కనబడక పోవచ్చు, కాని భక్తిభావంతో చదివితే, ఒక భక్తునికి ఇంతకంటే కావలసింది మరొకటి ఉండదు. ఆ లీల ఈవిధంగా ఉంది.

మేము ఈసారి రథయాత్రను హైదరాబాద్ తరువాత కర్నూలు, అనంతపూర్, కడప మీదుగా ఐదు ఆరు ప్రాంతాలు తిరిగి తిరుపతి వెళ్ళాలని అనుకున్నాము. మా భూ సమస్యను పరిష్కరించుటకు వచ్చిన మధ్యవర్తులు మాత్రం మమ్మల్ని తప్పక కడపకు రమ్మన్నారు. మంచి ఏర్పాట్లు చేస్తామన్నారు. మేము మాత్రము వారిని పడుకోవటానికి స్థలము మరియు భోజనము మాత్రమే కోరాము. ఇది వారు చిన్నవిషయంగా భావించి పకపక నవ్వారు. తప్పక ఏర్పాటు చేస్తామన్నారు. ఒక ముగ్గురు నలుగురు ఆ ప్రాంతపు ఎమ్మెల్యేలు కూడా దీనిలో భాగస్వాములు కాగలరన్నారు. వారి ఉత్సాహం చూసి ముందు ఒప్పుకున్నాను. తరువాత ఎందుకో కొంత అనుమానం కలిగి, కడపకు పోవాలా వద్దా? అని సంశయించాను. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు మరచిపోలేని ఒక గుణపాఠం నేర్పాడు. ప్రతి రథయాత్ర సందర్భంగా మేము కొన్ని నియమాలు ఏర్పాటు చేసుకున్నాము. 1.రథయాత్ర సందర్భంగా నా మనస్సుకు వచ్చిన మొదటి ఆలోచన ప్రకారంగా ప్రాంతాలు నిర్ణయించబడతాయి. 2.ఆ ప్రాంతంలో మాకు ఎవరూ ఆశ్రయం ఇవ్వకున్నా ఫుట్ పాతే మా నివాసమనుకుని ముందుకెళ్ళాలి. ఎవ్వరైనా దయదలచి ఆశ్రయం కల్పించినట్లైతే భగవంతుని కృపగా స్వీకరించాలి. 3.వీలైనంత వరకు భక్తుల ఇంటివద్దనే భుజిస్తూ, స్వామి అనుగ్రహాన్ని వారికి లభించేటట్లు చేయాలి. అత్యంత సాధారణ భోజనమే ఉండాలి. రథయాత్ర సమయాన పత్రం, పుష్పం, ఫలం, తోయాలను సమర్పించి స్వామివారి పాదాలను స్పృశిస్తూ ప్రార్థింప చేసేవాళ్ళం. సమర్పణ క్రతువుపై స్వామి మహామంత్రాన్ని వ్రాయిస్తూ సమర్పింపచేసేవాళ్ళం. డబ్బులకు ఆశపడేవాళ్ళం కాదు. కాని ఎవరైనా ఇష్టపూర్వకంగా క్రతువుతో పాటు సమర్పిస్తే ఖర్చులకు వాడేవాళ్ళం. ముడుపులు సమర్పించినప్పుడు తప్పక వీటిని తిరుపతికి చేర్చాలి. ఈ నియమాలు పాటించాలి. ఈ నియమాలతో యాత్ర చేసేవాళ్ళం. కాని ఇక్కడ ముందు కడపకు పోవాలనుకున్నాను కాని తరువాత ఎందుకో వద్దనిపించింది. దీనికి స్వామి లీల ఈవిధంగా ఉంది.

## తన గదిలో చోటిస్తానన్న స్వామివారు

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నా జీవితంలో కొన్ని

ఆణిముత్యాలను ప్రసాదించాడు. అందులో ఇది ఒకటి. "భగవంతుడు స్వయంగా ఒక భక్తుని పిలిచి తన గదిలో చోటిస్తాను" రమ్మంటే ఆ భక్తుని అదృష్టం దేనితో పోల్చగలం? నా జీవితంలో ఇది జరిగింది. జీవితాంతం ఈ ఘటనను నెమరేసుకోసాగాను.

14-07-2005 కల : ఈ కలలో టిటిడి ఎక్స్ ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు నాకు ఫోన్ చేశారు. వారు వారి ఇంటిలో నుండి మాట్లాడుటను నేను స్పష్టంగా మా ఇంటిలో ఉండి చూశాను. ఆయన ప్రక్కన ఆయన భార్య ఉన్నది. ఎవరితో మాట్లాడుతున్నావనే ఆయన భార్య ప్రశ్నకు సాయిరెడ్డితో మాట్లాడుతున్నానని జవాబిచ్చాడు. ఆ తరువాత ఆయన నాతో ఇలా అన్నారు. "ఏం సాయిరెడ్డీ! ఈసారి రథం కడపకు పోవట్లేదా?" అన్నాడు. అందుకు నేను "ఏమో సార్ అక్కడ రూమ్ దొరుకుతుందో లేదో" అని అన్నాను. దీనికి ఆయన నొచ్చుకుంటూ వ్యంగ్యంగా ఇలా అన్నారు. "నేనొస్తే నాకు దొరుకుతుందా?" అని అన్నారు. అప్పుడు నేను "మీరు పెద్దవారు, మీకు తప్పక దొరుకుతుందన్నాను". అప్పుడు ఆయన సరే అయితే "నా రూంని షేర్ చేసుకుందాం" కడపకు రమ్మన్నారు. ఇంతే కల. కాని ఈ కలలో స్వామివారు వ్యంగ్యంగా మాట్లాడటంతో నాకు బాధేసింది. నా కారణంగా స్వామివారు నొచ్చుకున్నారని బాధేసింది. సుఖపడటానికి రథయాత్ర చేయటం లేదు. ఎలాంటి సుఖాలకు ఆశ పడకూడదని భావించాను. మరోప్రక్క స్వామివారి ఈ మాట నన్నెంతో ఆనందపరిచింది. స్వామివారు స్వయంగా తన గదిలో స్థానమిస్తాను రమ్మంటే... ఈ అదృష్టం ఏ భక్తునికి లభిస్తుంది? దీనితో కడపకు తప్పక వెళ్ళాలనుకున్నాను. స్వామి లీల చూడాలనుకున్నాను. అయితే స్వామివారు తన రూంలో ఏవిధంగా చోటిచ్చారనే విషయాన్ని 24-08-2005 నాడు కడపకు వెళ్ళినప్పుడు తెలుసుకుందాం.

## 3వ జప సమర్పణ సందర్భంగా 'నమో వేంకటేశాయ' రథయాత్రను ప్రారంభించుట :

తేది 02-06-2005 నాడు మంచిరోజులు లేవని ఏకాంతంగా మా ఇంటి గృహప్రవేశం చేశాము. తేది 07-08-2005 నాడు ఇదే ఇంటి నుండి ప్రారంభమగు రథయాత్ర సందర్భంగా బంధుమిత్రులను పిలిచాము. మరియు మా ఆహ్వానం మేరకు త్రిదండి శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారు కూడా విచ్చేశారు. స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణ మరియు మంగళా శాసనములతో ఏడుకోట్ల జపానికి పూజ మరియు రథయాత్ర ప్రారంభోత్సవము చక్కగా జరిగింది. ఎక్స్ ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు కూడా వచ్చారు. అప్పటి మినిస్టర్ దేవేందర్ గౌడ్, ఎమ్మెల్యే శ్రీ లక్ష్మణ్ మొదలగు వారు వచ్చారు. భజనలు, అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములు జరిగాయి. మొత్తం మీద కార్యక్రమము చక్కగా జరిగింది. కాని...

నాకు అత్యంత ఆత్మీయుడు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు. ఈయనను మా గృహ ప్రవేశానికి రమ్మని, మా ఆతిథ్యమును స్వీకరించమని గత కొన్ని రోజుల నుండి పదే పదే వేడుకున్నాను. ఆ మధ్యన ఒక కలలో నా బదులు శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారు వస్తారని చెప్పినట్లు భావించాను. కాని మీరే రావాలని నేను పదే పదే వేడుకున్నాను, కాబట్టి స్వామివారు తప్పక అనుగ్రహిస్తారని బలంగా నమ్మాను. మరియు ఆ ఉత్సవములో స్వామివారి గురించి ఎంతో వేచి చూశాను, చివరికి రాలేదు. దీనితో నా మనస్సు చాలా బాధ పడింది, దుఃఖించాను, ఒకరకంగా స్వామివారు నాతో ఎడబాటు చెందినంత బాధ కలిగింది. ఈ బాధతో జ్వరం వచ్చింది. కాని ఆరోజు రాత్రి ఈ విధంగా కల వచ్చింది.

**08-08-2005 కల :** ఈ కలలో తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడు ధరించే పచ్చకర్పూరపు తిరునామం, దాని మధ్యన కస్తూరి తిలకం ప్రకాశవంతంగా కనబడింది. ఇంతే కల. ఈ కల అర్థం అప్పుడు నేను గ్రహించలేదు. బహుశా నేను నిన్ను గమనిస్తున్నాను అని కావచ్చని అనుకున్నాను. కాని నేను మాత్రం దీనికి తృప్తి చెందలేదు. మొత్తం మీద స్వామి వారు నా నుండి దూరమయ్యారనే బాధ కలిగింది. దుఃఖించసాగాను. ఒక అత్యంత ఆత్మీయుడు మన ఇంటి ఫంక్షన్ కు రానప్పుడు కలిగే బాధ వర్ణనాతీతం. కాని ఈ భాగం వ్రాయునప్పుడు ఈ కలలోని నిజమైన అర్థమును ఇలా గ్రహించాను. కలలో ఆయన నామంలో 111 కనబడ్డాయి. నీవు 111 కోట్ల జపమును సమర్పించి, బొట్టు పెట్టినప్పుడు తప్పక వస్తానన్నారు. ఇది దీని నిజమైన భావం.



**స్వామి తిరునామాన్ని దర్శించుట**

## పంచ సంస్కారాలు

తెల్లవారి శ్రీశ్రీశ్రీ జీయరు స్వామివారు ముందు నిర్ణయించినట్లు నాకు పంచ సంస్కారాలు చేయుటకు సిద్ధమైనారు. అన్ని ఏర్పాట్లు జరిగాయి. స్వామివారు తన గదినుండి బయటకు వచ్చారు. నేను కూడా సిద్ధమైనాను. ఇంతలో నా భార్య దీనికి అడ్డు చెప్పింది. ఫలితంగా పంచసంస్కారాలను చేయించుకోలేదు.

కొన్ని రోజుల తరువాత మరో సందర్భంలో కూడా నేను పంచ సంస్కారాలను చేసుకోవాలని నిర్ణయించినప్పుడు కూడా కొన్ని కారణాల వల్ల చేసుకోలేకపోయాను. ఆ సమయాలలో పరిస్థితులు నాకు వ్యతిరేకంగా మారేవి. దీన్ని గమనించి స్వామివారికి నేను పంచ సంస్కారాలు చేసుకోవటం ఇష్టం లేదని భావించి

మళ్ళీ ప్రయత్నించలేదు. నేను అజ్ఞానిగా ఉంటేనే స్వామివారు వారి లీలల ద్వారా దిశా నిర్దేశం చేస్తారని భావించాను. ఒకవేళ నేను జ్ఞానవంతుణ్ణి అయితే స్వామివారి లీలలను చూడనేమో అని భయపడడం కూడా పంచసంస్కారాల పట్ల మొగ్గు చూపకపోవటానికి మరో కారణం. మరియు ప్రస్తుతము నేను పరాన్నజీవిని. స్వామివారు స్వయంగా ఆజ్ఞాపిస్తే తప్ప మళ్ళీ పంచ సంస్కారాలకు ప్రయత్నించకూడదనుకున్నాను. భగవంతుడే నా ముందు ఉన్నప్పుడు పంచ సంస్కారాల అవసరమేమిటని కూడా భావించాను.

## స్వామివారు తన గదిలో చోటిచ్చుట

తేది 07-08-2005 నుండి రథయాత్రను హైదరాబాదులో త్రిప్పిన తరువాత వివిధ ప్రాంతాలు త్రిప్పుచు చివరికి తేది 24-08-2005 నాడు కడపకు చేరాము. దేవుని కడపలోని శ్రీవేంకటేశ్వరుని ఆలయం వద్ద సాయంత్రం 5 గంటలకు ఈ రథ ప్రారంభోత్సవమునకు చక్కని ఏర్పాట్లు చేశారు. అప్పటి టిటిడి బోర్డు మెంబర్ శ్రీ నవనీశ్వర్ రెడ్డి, ఆ ప్రాంతపు ఇద్దరు ఎమ్మెల్యేలు మరియు చంద్రశేఖరరెడ్డి మొదలగు వారు ప్రారంభించారు. ప్రెస్ వారు చక్కగా కవర్ చేశారు. చివరికి అక్కడివారు మేము ఉండటానికి రూములు చూపెట్టి వెళ్ళిపోయారు. రాత్రి 9.30 కి రథయాత్ర ముగించిన తరువాత చూసేసరికి ఆ రూములు చాలా




స్వామివారు తన పాదాలతో ప్రతి భక్తున్ని అనుగ్రహించుట

మురికిగా ఉన్నాయి. ఉండలేకపోయాము, ప్రైవేట్ రూములు లేవు. మేము చాలా ఇబ్బంది పడ్డాము. రథముతో వచ్చిన స్వామి సేవకులు ఫుట్ పాత్ పైన పడుకున్నారు. చివరికి ఆ ఆలయ ఈ.ఓ నన్ను తన ఆఫీసులో పడుకోమన్నారు. ఇది వినగానే 14-07-2005 నాటి స్వామివారి కల గుర్తుకు వచ్చింది. దానిలో స్వామివారు తన గదిని షేర్ చేసుకుందామన్నారు. వెంటనే నేను ఒప్పుకున్నాను. చివరికి కొంత సమయం తరువాత ఈ.ఓ తన గది తాళం చేతులు ఇవ్వకుండా మరిచిపోయి వెళ్ళిపోయారు. అప్పటికి రాత్రి 9.30 దాటిపోయింది. ఏం చేయాలో తెలియలేదు. చివరికి నేను ఆలయం లోపలే పడుకోవటానికి నిర్ణయించుకున్నాను. ఆ రోజు రాత్రి ఆలయ వాచ్ మన్ రాలేదు. అతనికి సంబంధించిన చినిగిపోయిన చాప కనపడింది. ఆ చాపపైన ఆ రాత్రి ఆలయంలో పడుకున్నాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నేను మీ సేవకుడను, ఒక సేవకుడిగా, వాచ్ మన్ గా మీ చెంత నిద్రిస్తున్నానని ప్రార్థిస్తూ ఆ రాత్రి గడిపాను. రాత్రంతా నేను సేవకుడిననే భావంతో ఎంతో ఆనందించాను. తెల్లవారి తిరుపతికి వెళ్ళాము. ఈవిధంగా స్వామివారు తన గదిలో చోటిచ్చారు. నన్ను ఆనందభరితుణ్ణి చేశారు. గుడిలో పడుకోవడం సాధారణ విషయం కావచ్చు. కాని స్వామివారు స్వయంగా తన గదిలో చోటిస్తాను రమ్మని పిలవటం ముగ్ధుణ్ణి చేసింది.

## 3వ పర్యాయపు 7 కోట్ల జపమును స్వామి పాదాలకు సమర్పించుట

తేది 26-08-2005 నాడు సాయంత్రం, తిరుపతిలోని అలిపిరి స్వామివారి పాదాల మండపము వద్ద ఈ జపమును స్వామివారి పాదాలకు సమర్పించి పూజించాము. జపము వ్రాసినవారి కోరికలు తీర్చమని స్వామివారిని వేడుకున్నాము. ఈ సందర్భంగా స్వామివారి అభిషేక సమయాన ఉండే మూలమూర్తి దర్శనమిచ్చారు. ఆ పాదాలనే నేను అభిషేకించి పూజించాను. పూజ తరువాత పెద్ద వర్షం వచ్చింది.

తేది 27-08-2005 గోకులాష్టమి రోజు, తిరుపతిలో ఎస్.వి.డైరీఫాం లోని శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపమును టిటిడి వారు పూలతో చక్కగా అలంకరించారు. మేము ఏడుకోట్ల జపమునకు శ్రీవేంకటేశ్వర మహామంత్రమును అనుసంధానించుచు, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణము మరియు యజ్ఞం చేశాము. అప్పటి టిటిడి ఈ.ఓ శ్రీమాన్ ఎ.పి. వి.ఎన్.శర్మ గారు విచ్చేసి, యజ్ఞ పూర్ణాహుతి చేశారు. జపం వ్రాసినవారి కోరికలు తీర్చమని ప్రార్థించారు. జపమును స్థూపములో సమర్పించారు. ఆ తరువాత అధికారులు, భక్తులు తలాకొంత సమర్పించారు. చివరికి ఈ.ఓ గారు 4వ పర్యాయంగా 7 కోట్ల జపమును ప్రారంభించి వెళ్ళిపోయారు.

స్వామివారు ఇక్కడ మరో చమత్కారమును చూపారు.

మేము 7 కోట్ల జపమును స్థూపము ముందు ఒక 6'X5' సైజు గల కుప్పలాగా పేర్చి పూలతో అలంకరించి పూజించాము. ఈ 6'X5' సైజు గల జపపు కుప్పపైన తన రెండు పాదములను పెట్టి ఆ పాదాల సైజుకు సరియగు ఎత్తున్న విరాట్ రూపునిగా స్వామివారు ఆకాశంలో నిలబడినట్లు అనుభూతి చెందాను. నేను ఆయన రెండు నల్లని పాదాలను, ఆ పాదాలపైన ఆయన ధరించిన ధోవతి అంచును స్పష్టంగా చూశాను. ఎంతో ఆనందించాను. ఈ విధంగా జపం వ్రాసిన ప్రతి భక్తుణ్ణి అనుగ్రహించారు.

ఆ తరువాత తేది 28-08-2005 నాడు కొండపై స్వామివారిని దర్శించుకుని తేది 29-08-2005 నాడు హైదరాబాదుకు వచ్చాము.

నిజానికి నేను 'నమో వేంకటేశాయ' రథయాత్రలో చెందినంత తృప్తి మరే సేవలోనూ చెందలేదు. ఈ రథం తయారు చేసినప్పుడు ప్రతి సంవత్సరం కేవలం 11 రోజులు మాత్రమే రథయాత్ర చేయాలనుకున్నాను. కాని ఒక సంవత్సరం చేసిన తరువాత రెండవ పర్యాయం నుండి దీనిని 21 రోజులకు పొడిగించాను. మొత్తం ఈ 21 రోజులు నా మానసిక స్థితి భిన్నంగా ఉండేది. ఏ చిన్న తప్పు జరిగినా సహించేవాణ్ణి కాదు. వీలైనంత ఎక్కువ మంది భక్తులు స్వామివారిని సేవించుకోవాలనే బలమైన భావంతో ఉండేవాణ్ణి. మొత్తం 21 రోజుల తర్వాత తిరుపతి చేరేవరకు నేను ఎంతో పరివర్తన చెందేవాణ్ణి. సంపూర్ణ శరణాగతుణ్ణయేవాణ్ణి. నా యావదాస్తిని దొంగిలించుకుపోతున్నారని తెలిసినా చలించని స్థితి కలిగేది. స్వామి భక్తుడిగా పరవశించిపోయేవాణ్ణి. హైదరాబాద్ లో కంటే బయటి ప్రాంతాలలో తిరిగినప్పుడు ఈ ఆనందం మరింత ఎక్కువగా లభించేది. ఈ సేవలో నేను ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా అలసిపోయేవాడిని. మొత్తం మీద ఈ రథయాత్ర సేవ నాకు ఒక వరంలాగ లభించింది.

## మధ్యవర్తిని ప్రసాదించుట

హైదరాబాద్ వచ్చాక స్వామివారిని దీనంగా ప్రార్థించాను. ప్రభూ! గత 3 నెలలు మీ సేవ ఉందని నా భూ సమస్యను పట్టించుకోలేదు. ఇప్పుడు తిరిగి దీని గురించి ఆలోచించాలి. దుండగులు బలవంతులు, దయచేసి నాకు ఒక మధ్యవర్తిని ప్రసాదించి ఈ సమస్యను పరిష్కరించగలరని ప్రార్థించాను. అనుకున్నట్లే స్వామివారు మధ్యవర్తిని ఏర్పాటు చేస్తున్నానని ఈ విధముగా చెప్పారు.

**తేది 30-08-2005 కల :** ఈ కలలో ఒక యుద్ధ సన్నివేశం కనిపించింది. ఇరుపక్షాల వారు రామ రావణ యుద్ధానికి సంసిద్ధులై యున్నారు. యుద్ధ పరికరాలను తయారు చేసుకుంటున్నారు. చాలా బలమైన యుద్ధమట. ఇంతలో ఆకాశము నుండి ఒక స్వరము వినబడింది. "ఈ వ్యక్తి నీకు తోడుగా ఉండును. ఇతడు చాలా బలమైనవాడు, రామ రావణ యుద్ధములో, రాముడు లేనప్పుడు, రావణుడు ప్రయోగించిన బలమైన అస్త్రమును ఈ వ్యక్తి తట్టుకున్నాడు. సైన్యమును కాపాడాడు" అని మాటలు వినబడ్డాయి. కల చెదిరింది. అంటే స్వామివారు ఒక మధ్యవర్తిని నా గురించి పంపిస్తున్నారని, ఆయన నా పక్షాన ఉంటారని భావించాను. ఇంతకుముందు నా వద్దకు వచ్చిన మధ్యవర్తులు వీరేనని భావించాను. ఇది ఈవిధంగా ఉండగా, గత 25 రోజులు రథయాత్ర చేసి తిరుపతికి వెళ్ళి వచ్చాము కాబట్టి చాలా అలసిపోయాను. శరీరం సహకరించుట లేదు. కాని స్వామి సేవలో లోపం రాకూడదని మా ఆఫీస్ తెరిచి భక్తులకు జప పుస్తక పంపిణీ ప్రారంభించాము. ఈ విషయాన్ని స్వామివారు ఒక కల ద్వారా ఈ విధంగా నా మనోవాంఛను తెలిపారు. మరియు స్వామి సేవలో నా అంతరంగం ఏవిధంగా ఉన్నది అనే దానిని వివరిస్తూ ఒక్కొక్క విషయాన్ని చెప్పసాగారు.

## స్వామిసేవలో అలసటను పట్టించుకోకపోవుట

**తేది 03-09-2005 కల :** ఈ కలలో నేను, తిరుపతిలో యజ్ఞం మరియు పూజ నిమిత్తమై, హైదరాబాద్ నుండి భక్తులను తీసుకొని పోవుటకు ప్రయత్నిస్తున్నాను. ఆ ప్రయత్నంలో నేను శారీరకంగా చాలా అలసిపోయాను. కాని అప్పుడప్పుడు భక్తులు ఫోన్ చేసి వివరాలు అడిగుతున్నారు. మా ఆఫీసులో ఉన్న శ్రీ పాండురంగారావు మొదలగు వారు, భక్తులు ఫోన్ చేసినా మాట్లాడకూడదు. మీరు రెస్ట్ తీసుకోండి, మేము మాట్లాడతామన్నారు. కాని ఎక్కడో దూర ప్రాంతము నుండి ఫోన్ వచ్చింది, ఆ భక్తులను తృప్తి పరచాలనే ఉద్దేశ్యంతో నేనే ఆ ఫోనును మాట్లాడాను. వారు ఎప్పుడు రావాలి? ఎక్కడకు రావాలి? అనే వివరాలను అడిగారు. నేను చెప్పాను. ఇంతే కల. అంటే నేను అలసటను లక్ష్యపెట్టకుండా స్వామివారి సేవ చేస్తున్నట్లు నా మనసులోని భావాన్ని చూపెట్టారు.

## ఆర్భాటాలు లేని సేవ

స్వామివారి సేవను నేనే నిర్వహిస్తూ చేయిస్తున్నప్పటికీ ఏనాడూ నేను ఆ సేవలో లేదా సభలలో ఆధిపత్యం కోరటం గాని, నన్ను అందరూ గౌరవించాలని గాని భావించలేదు. నేను ఒక స్వామి సేవకుడిగా, అందరిలో ఒకడిగా మాత్రమే నన్ను నేను భావించుకునేవాడిని. ఈ నా భావాన్ని కూడా స్వామివారు ఈ క్రింది లీలలో చక్కగా చూపారు.

**తేది 04-09-2005 కల :** ఈ కలలో నేను స్వామివారి గురించి ఒక పెద్ద సభను ఏర్పాటు చేశాము. హరినామ స్మరణ చేయాలన్నది ఉద్దేశ్యమట. చాలామంది భక్తులు భజన నిమిత్తమై వచ్చారు. అందులో ఇద్దరు భక్తులు ధోవతి కట్టుకుని, చేతుల బనియన్ల (మార్వాడీస్ లాగా)తో హరినామ స్మరణ నిమిత్తమై

ప్రత్యేకంగా వచ్చారు. ఈ కార్యక్రమము నేనే చేయిస్తున్నానట. కాని నేను అందులో ఒక భక్తునిగా మాత్రమే ఉన్నాను. నిర్వాహకుడి మాదిరిగా నన్ను అందరూ చూడాలని, నా మాట నెగ్గాలనే భావంతో లేను. ఇంతే కల. ఈ కలలో నేను ఎలాంటి ఆర్భాటం లేకుండా సాధారణ భక్తుని లాగా జీవిస్తున్నావంటూ స్వామివారు తెలిపారు.

శ్రీవేంకటేశ్వరుడు మా కుటుంబాన్ని, వంశాన్ని నిశితంగా గమనిస్తూ ఉండేవారు. భవిష్యత్తులో జరిగే సంఘటనలను తెలియజేసేవారు, అలాంటి ఒక సంఘటన జరిగింది. అది ఇలా ఉంది.

**తేది 08-09-2005 కల :** ఈ ఉదయం వచ్చిన కలలో నా పెద్ద కుమారుడు చి॥ వేదాంత్ కనబడ్డాడు. వాడు ఎవరో మాకు సంబంధించిన వారు చనిపోతే తల గుండు చేయించుకుని, స్నానం చేసి కనబడ్డాడు. ఇంతే కల. దీనర్థం మా వంశంలో ఎవరో ఒకరు చనిపోతారని భావించాను. స్వామిని స్మరించాను. అనుకున్నట్లే తేది 07-09-2005 నాడు మా ఊరిలో మా వంశము వారొకరు చనిపోయారు.

**పత్రిక గురించి :** గతంలో స్వామివారు మమ్మల్ని ఒక తెలుగు మాసపత్రికను ప్రారంభించమన్నారు. 'నమో వేంకటేశాయ' అనే టైటిల్స్ ను పొంది, డిక్లరేషన్ కూడా ఇచ్చి ప్రింట్ చేయుటకు పేపర్ వర్క్ పూర్తి చేసి సిద్ధంగా ఉన్నాము. కాని మాసపత్రిక ప్రారంభించటం ఇష్టం లేక స్వామివారికి రకరకాల కారణాలను చెప్పాము. ఇందులో ఒకటి, మూడవ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ తరువాత అని, మా గృహప్రవేశం తరువాత అని చెప్పాము. చివరికి ప్రారంభ తేదీని మీరు స్వయంగా చెప్పినప్పుడు చేస్తామన్నాము. దీనికి ప్రతిగా వెంటనే ప్రారంభించమని స్వామివారు గతంలో చెప్పారు. పత్రిక కోసం చాలా కష్టపడ్డాను. రచయితల అడ్రసులను, కొన్ని ఆర్టికల్స్ ను కూడా సేకరించాను. కాని మళ్ళీ మేము ఈ పత్రిక చేయలేమని భావించి పక్కకు పెట్టాము. ఇప్పుడు 3వ పర్యాయంగా 7 కోట్ల జపసమర్పణ మరియు మా గృహప్రవేశం కూడా జరిగాయి. కాని పత్రిక విషయం మాత్రం మరిచిపోయాము. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం మరువలేదు. నిజానికి ధన నష్టంతో పాటు వ్యాపారం చేయుటకు సమయం దొరకదని పత్రికను పక్కన పెట్టాము. దీనిని గమనించిన స్వామివారు ఒక పాఠం నేర్పారు. ధన నష్టంతో పాటు అసలు వ్యాపారమే లేకుండా చేశారు. కఠిన పరిస్థితులు ఎదుర్కొన్నాము. ఇది అంచెలంచెలుగా జరిగింది. చివరికి మేమే పత్రిక ప్రారంభించుటకు ముందుకు వెళ్ళే విధంగా చేశారు. అందులో మొదట నా మానసిక స్థితిని మెరుగు పరచుటకు స్వామివారు నన్ను ఒక ఆధ్యాత్మిక బ్యాచిలర్ డిగ్రీలో చేర్పించి ఒక యతీశ్వరుల మాదిరి శిక్షణ ఇవ్వదలచారు. స్వామివారు అత్యంత కఠినంగా మారారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

## ఆధ్యాత్మిక బ్యాచిలర్ డిగ్రీలో చేర్పించుట

నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకున్నాను. అప్పుడు నేను ఆ కళాశాల హాస్టల్ లో ఉంటూ విద్యనభ్యసించేవాణ్ణి.

**తేది 09-09-2005 కల :** ఈ కలలో కూడా నేను ఇంజనీరింగ్ చదువుతున్నాను. హాస్టల్ లో నలుగురు మిత్రులతో కలిసి ఉన్నాను. పరీక్షలు దగ్గర పడుతున్నాయి. అందరం ప్రిపేర్ అవుతున్నాము. ఇంతలో కొన్ని ముఖ్య విషయాలను మా కళాశాల తరగతి గదిలో మా ప్రొఫెసర్ బోధిస్తున్నారట. దానికి నేను వెళ్ళాను. అక్కడ ఒక చిత్రాన్ని చూశాను. నాతోపాటు చదివే ప్రతి విద్యార్థి ముస్లిం లేడీస్ కప్పుకున్నట్లు బురఖా కప్పుకుని ఉన్నారు తరగతి గది నిండా విద్యార్థులున్నప్పటికీ అందరూ బురఖా కప్పుకున్నారు. వారికి ప్రొఫెసర్ బోధిస్తున్నారు. ఈ బురఖా కప్పుకుని ఉన్నవారు మామూలు వారు కారు. అందులో ఒకరు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి, విశాఖపట్నం శారదాపీఠం అధిపతి. మరియు ఒక బురఖా వేసుకున్నాయన తన బురఖాను తీయగా ఆయన నల్లగా, ఆఫ్రికన్ లేదా అమెరికన్ బ్లాక్ గా, ముఖముపై చిన్న చిన్న మచ్చలతో ఉన్నారు. వారు దేవుని గురించి ఎక్కువ విషయాలు నేర్చుకొంటున్నారు. నేను కూడా అదే గురువు వద్ద వీరితో పాటు చదువుతున్నాను. కల చెదిరింది.



యతీశ్వరులతో విధ్యాభ్యాసం చేయుట

దీనర్థం నేను భగవంతుని గురించి మరిన్ని ఎక్కువ విషయాలు తెలుసుకోవలసి ఉందని అర్థం. నా క్లాస్ మేట్స్ వివిధ మతాలకు చెందిన యతీశ్వరులను చూపారు. కాబట్టి నేను కూడా ఒక యతీశ్వరుని స్థాయికి తగిన విద్యను అభ్యసించవలసి ఉందని దీనర్థం. నాకు తెలియకుండానే ఇప్పటినుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించాడు. ఒక రకంగా నన్ను ఆధ్యాత్మిక బ్యాచిలర్ డిగ్రీలో చేర్పించారు.

నేను ప్రతిరోజు ప్రతిక్షణం స్వామివారిని తిలకిస్తూ మరియు నా సేవ గురించి మాత్రమే ఆలోచించేవాడిని. ఈ కలలో ఇదే భావాన్ని చూపారు.

**తేది 10-09-2005 కల:** ఈ కలలో నేను హైదరాబాద్ నుండి

తిరుపతికి రథయాత్ర చేస్తూ, 'నమో వేంకటేశాయ' రథమును త్రిప్పుచున్నాను. తిరుపతికి వెళ్ళేదారిలో ఒక ఊరిలో ఉన్నాము. ఈ రథం గురించి ఎవ్వరితోనో ఏదో మాట్లాడుచున్నాను. ఈ రథమును కలలో చూశాను. కల చెదిరింది. స్వామి సేవను అత్యంత ఇష్టంగా చేస్తున్నానని దీని భావం కావచ్చును.

స్వామివారు మరికొన్ని లీలలను ఈ క్రింది విధంగా ప్రసాదించారు.

**తేది 16-09-2005 కల :** ఈరోజు రెండు కలలు కన్నాము. ఒకటి నాకు, మరోటి సురేఖకు వచ్చినవి. నా కలలో పూజ దుస్తులతో ఉన్న నేను నా భార్యతో కలిసి కమ్యూనిస్టులతో కలిసినట్లు కల కన్నాను. వారు మాకు మంచి గౌరవమిచ్చారు. ఆ తరువాత ఏదో పనిమీద తిరుపతికి ఒక ప్రైవేటు బస్సులో వెళ్ళాను. అక్కడ ఒక ఆలయాన్ని చూశాను. అందులో శ్రీశ్రీశ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు చాతుర్మాస దీక్ష కొనసాగిస్తున్నారట. ఆ గుడి కాంపౌండ్ వాల్ పైన 3 తలలు ఉన్న బ్రహ్మదేవుని విగ్రహమును చూశాను. ఇంతే కల.

దీనర్థం నేను ఆధ్యాత్మిక విద్యను అభ్యసించవలసి ఉన్నదని, పై తరగతులకు వెళ్ళవలసి ఉన్నదని అనుకున్నాను.

ఇక సురేఖకు వచ్చిన కల ఈ విధంగా ఉంది. ప్రతి శ్రవణా నక్షత్రం రోజు సాయంత్రం మా ఆఫీసులోని ముందు గదిలో భక్తులందరితో కలిసి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం స్వామివారి మహామంత్రాన్ని అనుసంధానిస్తూ పూజ చేయడం ఆనవాయితీ. తేది 15-09-2005 నాడు శ్రవణా నక్షత్రం కాబట్టి ఆఫీసులో పూజ జరిగింది. నేను ఏదో పని పైన బయటకు వెళ్ళాను. సురేఖ పూజకు వచ్చింది. చాలామంది భక్తులు వచ్చారు. పూజ చేశారు. కాని లోపల నా గదిలో ఉన్న స్వామి ముందు దీపం వెలిగించడం మరిచారు. సురేఖ ఈ విషయం మా ఆఫీస్ బాయ్ తో చెప్పినప్పటికీ, అతను ఎందుకు మేడమ్ పూజ వద్ద దీపమున్నది కదా అని అన్నాడట. ఇది నిన్న జరిగింది. అయితే ఈనాటి కల ఈ విధంగా ఉంది.

కల : సురేఖ ఆఫీసుకు పూజకై వచ్చిందట. నేను నా గదిలో స్వామివారి ముందు దీపం వెలిగిస్తున్నానట. ఎందుకు ముందు పూజ దగ్గర దీపం ఉంది కదా అని నన్ను ఆమె ప్రశ్నించిందట. అందుకు నేను ఇదే ముఖ్యము కదా అని చెప్తూ దీపం వెలిగిస్తున్నానట. కల చెదిరింది.

బహుశా మాకు ప్రసాదించిన సేవలో నన్ను ప్రధాన వ్యక్తిగా నిర్ణయించాడని తెలుపుటకు సంకేతం కావచ్చు. లేదా తప్పులు గుర్తించుట కావచ్చు. ఇంతే అర్థం చేసుకున్నాను.

భూ సమస్య : రోజు రోజుకు దుండగులు రెచ్చిపోతున్నారు. నేను ఏకాకినని, సహాయకులెవ్వరూ లేరని గ్రహించారు. కాబట్టి కోర్టు కేసులు ఉన్నప్పటికీ యధేచ్ఛగా తమ భూమేనంటూ ప్రవర్తిస్తున్నారు. మేము గతంలో కోర్టు కమిషనర్ ను వేయించాము. వారు ఈ భూమిని పరిశీలించారు. ఈ భూమి సాయిరెడ్డికి సంబంధించిందని, టేకు చెట్లు ఉన్నాయని, వ్యవసాయం చేస్తున్నారని, ఇందులో ఎలాంటి ప్లాట్లు లేవని కూడా వ్రాశారు. అయినప్పటికీ ఈ దుండగులు ఈ భూమిలో ఫెన్సింగ్ వేసి వారి బోర్డు పెట్టుకుని, స్వామివారు సూచించినట్లు వికటాట్టహాసం చేస్తూ భూమిలో విందులు చేసుకుంటున్నారు. మరోప్రక్క శ్రీవేంకటేశ్వరుడు నన్ను తన మాయలో బంధించి వేశాడు. ఎన్నోసార్లు ఆ దుండగులకు ఎంతో కొంత ఇచ్చి కాంప్రమైజ్ కావాలనుకున్నాను. కాని కొద్ది క్షణంలోనే మార్పు వచ్చేది. అన్యాయంగా ఈ దుండగులకు ఎందుకు ఇవ్వాలని, అన్యాయాన్ని ప్రోత్సహించాలా? అని మరియు అన్నింటికంటే ముఖ్యం నా స్వామివారు నన్ను కాపాడగలరనే విశ్వాసంతో కాంప్రమైజ్ కాలేదు. కాని కాలం గడిచినకొద్దీ దుండగులు బలపడ్డారు. నన్ను పిచ్చివాడిగా జమకట్టారు. చివరికి ఒకరోజు జె.సి.బిని తెచ్చి టేకుచెట్ల మొదళ్ళను పెరికివేశారు. మరియు నా భూమిలో రూమ్ కట్టుకుని దాదాపు ఒక ఎకరం భూమిలో ఫెన్సింగ్ వేసుకుని యధేచ్ఛగా ఉన్నారు. ఈ విధంగా భూ సమస్య రోజు రోజుకు పెరిగింది. చివరికి కడప ప్రాంతపు వ్యక్తులు ఈ సమస్య తీరుస్తామని ప్రవేశించారు.

## చెడు భావాన్ని చెరిపివేయుట

ఈ మధ్యవర్తులు హైదరాబాద్ పంజగుట్ట ప్రాంతంలో ఒక హోటల్ లో ఉండేవారు. అత్యంత విలాసవంతమైన జీవనం గడిపేవారు. వీరికి లేని అలవాటు లేదు. మహా మొరటు గాళ్ళు. వారి మొత్తం ఖర్చును నేనే భరించవలసి వచ్చేది. మా భూమి గురించి అన్ని విషయాలు తెలుసుకున్న తరువాత ఒకరకంగా నన్ను వారి గుప్పిట్లో బంధించివేశారు. డబ్బులు ఇవ్వమని బలవంతపెట్టేవారు. త్రాగడం, తినడం, వ్యభిచారం ఇలా లోకంలోని అన్ని దురలవాట్లు వారికున్నాయి. ఒకరకంగా వారు జీవితాన్ని ఎంజాయ్ చేయటానికి హైదరాబాద్ కు వచ్చారని భావించాను. వారు మహా సంతోషంగా ఉండేవారు. కాని నేను దుఃఖంతో ఉండేవాణ్ణి. పైగా వారు నన్ను నానా మాటలతో ఎత్తి పొడిచేవారు. ఈ సన్నివేశాన్ని చూసి ఒకసారి నా మనస్సు చలించింది. ఎందుకు వారిలాగా సంతోషంగా జీవించక, ఏమీ తినకుండా, త్రాగకుండా జీవిస్తే లాభమేమిటనిపించింది. అదే రోజు సాయంత్రం స్వామివారిని మా ఆఫీసులో ప్రార్థించాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నేను ఏమీ తినకుండా, త్రాగకుండా ఎంతో నిష్ఠతో జీవిస్తున్నాను. అలాంటిది నాకు కష్టాలను కల్పించావు. కాని ఆ మధ్యవర్తులు త్రాగుతూ, తింటూ, వ్యభిచరిస్తూ ఆనందంగా ఉన్నారు అనే విషయమై ప్రార్థిస్తూ అసలు ఒక వ్యక్తి ఆ విధంగా జీవిస్తే తప్పేంటనే భావం నా మనస్సుకు వచ్చింది. మనస్సులో దీనికి జవాబు చెప్పమని




**నాపై జనాలు విరగబడి నవ్వుట**

ప్రార్థించాను. స్వామివారు నా మనస్సులోని ఈ భావాన్ని అత్యంత సీరియస్ గా తీసుకున్నారు. నా మనస్సులో వచ్చే చెడు భావాలను వెంటనే చెరిపివేసేవారు. ఈ భావాన్ని కూడా 12 గంటల లోపలే ఈవిధంగా చెరిపివేశాడు.

కల : అది మా గ్రామము (చిన్నగుండవెల్లి కాదు). ఆ గ్రామ ప్రజలు బయటకు వెళ్ళుటకు ఒకే దారి ఉంది. ఆ దారి ప్రక్కన దాదాపు ఒక ఎకరం వైశాల్యంలో ఒక వెడల్పాటి పాడుబడిన దిగుడు బావి ఒకటుంది. ఈ ఊరి ప్రజలు వారి రోజువారీ చెత్తను ఆ బావిలో పడేస్తూ ఉంటారు. మరియు ఆ బావి కట్టపైనుండి ఊరివారు ప్రతిరోజు నడిచే దారి ఉంది. ఆ రోజు బాగా త్రాగి ఇష్టమున్నట్లు తిరిగి నేను ఈ బావిలోని చెత్తకుప్ప మధ్యలో ఒళ్ళు తెలియకుండా పడుకున్నాను. తెల్లవారి మేలుకునేసరికి ఊరులోని చెత్త ఏరుకునే వ్యక్తులు వచ్చి, బావి గడ్డపై నిలబడి, నన్ను చూసి విరగబడి నవ్వుతున్నారు. వారి చేతులను నా వైపు చూపిస్తూ, నడ్డి విరుచుకుంటూ కట్టపై నుండి ఆహా... హ్హా... హా అంటూ విరగబడి నవ్వుతున్నారు. వారి నవ్వును చూసి మరికొంతమంది ఊరివారు జమకూడి అందరూ నన్ను చూసి పకపక నవ్వారు. కల చెదిరింది.

దీనర్థం, అలాంటి సంఘ వ్యతిరేక భావాలను నా మనస్సులో రానీయకుండా ఉండమని సూచించారు. ఒకవేళ వస్తే, సంఘంలోని అల్పులు కూడా నీపై విరగబడి నవ్వుతారని సూచించారు. దీనితో నాలోని "వారే గొప్ప అదృష్టవంతులు" అనే భావం చెదిరిపోయింది.

భూ సమస్య : నా ఆస్తి కాపాడుటకు వచ్చిన మధ్యవర్తులు, దుండగులతో మాట్లాడారు, వారిని భయపెట్టారు. కాని నా భూమిని కాపాడలేదు. ఆ పూర్తిభూమిని అమ్మి, కొంత వాటా తీసుకొని మిగిలిన దానిని దుండగులకు కొంత, నాకు కొంత ఇవ్వచూపారు. ఈ పరిణామానికి చింతించాను. కాని ఏం చేయలేక స్వామివారిని ప్రార్థించాను. ఆజ్ఞ ఇవ్వమన్నాను. స్వామివారు కూడా ఈ కాంప్రమైజ్ అగ్రిమెంట్ ను ఒప్పుకొమ్మన్నారు. ఆ లీల ఇలా ఉంది.

**తేది 06-10-2005 కల :** ఈ కలలో నేను పంజగుట్టలో ఉన్న మధ్యవర్తుల హోటల్ గదికి వెళ్ళాను. ఈ మధ్యవర్తులు అప్పటికే దుండగులతో మరియు ఈ భూమిని కొనడానికి వచ్చిన వారితో కలిసి ఉన్నారు. మరియు ఈ మధ్యవర్తులు ఏదో చెప్తున్నారు. నేను వింటున్నాను. నువ్వు తప్పకుండా వినాలని అన్నారు. నేను విన్నాను. ఇంతే కల.

చివరికి తేది 25-10-2005 నాడు ఈ భూమిని అమ్మటానికి అగ్రిమెంట్ చేసుకున్నాము. నాకు ఈ భూమి కావాలని, రక్షించమని ప్రార్థించినా కూడా మరో లీలలో భూమిని వారు చెప్పినట్లు అమ్మమని సూచించాడు. దీనితో నా అత్యంత ఇష్టమైన ఆస్తి పోయిందని, స్వామివారు కాపాడలేదని తీవ్రమైన ఆవేదన కలిగింది. మళ్ళీ తిరిగి భూమిని సంపాదించాలని భావించాను. ఈ మధ్యవర్తుల ప్రభావం నాపై పడింది. నేను అమ్మగా వచ్చిన అడ్వాన్స్ డబ్బును, ఈ మధ్యవర్తులు సూచించిన భూమిపై పెట్టాను. ఫలితంగా ఈ డబ్బును కూడా పోగొట్టుకున్నాను.

ఈ భూ సమస్యను అత్యంత క్లుప్తంగా చెప్పాను. నిజానికి ఈ సమస్య నన్ను చాలా బాధించింది, నలిగిపోయాను మరియు అప్పుడు శ్రీవేంకటేశ్వరునిపై చాలా కోపం కలిగింది. స్వామివారి కారణంగా నా భూమిని కోల్పోయానని భావిస్తూ ఈ క్రింది విషయాలను నా డైరీలో వ్రాసుకున్నాను.

నా ఆస్తిని పణంగా పెట్టి మీ లీలలు అనుభవిస్తే మధురంగా ఉంటుందని సమస్యలను కోరుకున్నాను. నా ఆస్తిని కాపాడమని ప్రత్యేకంగా చెప్పాను. కాని స్వామివారు నమ్మించి మోసం చేశారు. మరియు –

1. నీకు భవిష్యత్తులో ఏమి జరుగునో తెలియదు, కాని నాకు తెలుసు. "నీవు ఎల్లప్పుడు నన్నే స్మరిస్తూ ఉండు, నేను నిన్ను కాపాడతాను" అని చెప్పారు.
2. ఒకసారి "నీవు ఒంటరివి కావు, నీ వెనుకా ముందు నేనున్నానన్నారు".
3. ఎన్నోసార్లు భయపడకుండా ముందుకెళ్ళమని చెప్పారు.
4. నా భూమిని కాపాడమని స్వామివద్ద లాకర్ లో పెట్టినట్లు భద్రపరిచాను.
5. నేను నా భార్యభయంతో ఉన్నప్పుడు మాకు ఆయన దర్శనమిచ్చి సంతోషపరచి నేనున్నాను భయపడకుమన్నారు.
6. నా భూమిలో కడీలు పాతి ఆక్రమించుకున్నప్పుడు చాలా బాధపడ్డాను. ప్రభూ ఈ బాధ నుండి రక్షించండి, సంతోషపరచండని ప్రార్థించాను. అప్పుడు నన్ను యవ్వనవంతుణ్ణి చేసి, ఒక సుందరాంగిచే నాట్యం చేయించి సంతోషపరిచారు.
7. స్వామివారు నా మియాపూర్ భూమిని, నన్ను కాపాడుతానని, నానుండి దుండగులు ఆశించిన ధనాన్ని వారికి అందకుండా కాపాడుతానని చెప్పారు.

ఇలా ఇంకా ఎన్నో చేశారు. వీటన్నిటి ప్రభావంతో మీరు

నన్ను కాపాడతారని విశ్వసించాను. కాని చివరకు నన్ను రక్షించలేదు. ఈ భూమి విషయంలోనే కాక, శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం పెట్టినప్పటి నుంచి వ్యాపార రీత్యా ఆర్థికంగా చాలా దిగజారిపోయాను. సంఘములో నా తర్వాత బిల్డర్లుగా వచ్చినవారు ఎదిగారు. కాని నేను మాత్రం దినదినం కృశించిపోయానని చింతించాను. ఈ భూ సమస్య స్వామివారు తీరుస్తారని భ్రమించి ఇన్ని రోజులు మిన్నకున్నాను. లేనట్లైతే ఎప్పుడో ఈ దుండగులకు ఎంతో కొంత ఇచ్చి కాంప్రమైజ్ చేసుకునేవాడిని. దీనికంతటికీ కారణం శ్రీవేంకటేశ్వరుడే అనే భావం నా మనస్సులో బలపడింది. నేను ఎవ్వరినీ మోసం చేయనప్పటికీ, లీగల్ గా బలంగా ఉన్నప్పటికీ, నలుగురి దగ్గరికి వెళ్ళేసరికి నేను మోసగాడినని, నాకు లీగల్ రైట్స్ లేవని, నన్ను ఒక పిచ్చివాడిగా జమకట్టారు. మధ్యవర్తులు కూడా నా డబ్బే తింటూ నన్ను హేళన చేశారు. బయట తలెత్తుకుని తిరగలేకపోయాను. వీరందరు ఒంటరిగా కలిసినప్పుడు నేనే కరెక్టని, వారు మోసం చేస్తున్నారని ఒప్పుకుంటారు. కాని అందరిముందు హేళన చేస్తారు. ఈ విధంగా స్వామివారు నాతో ఎందుకు ఆడుతున్నారు? నా కష్టం ఆయనకు ఆనందం కలిగిస్తోందనుకున్నాను. చివరికి స్వామిపట్ల భక్తి, విశ్వాసము తగ్గిపోయాయి, కోపమేర్పడింది. మరోప్రక్క మా గృహప్రవేశమప్పుడు మా ఇంటికి రాలేదు కాబట్టి నేనంటే ఆయనకు ఇష్టం లేదనే భావమేర్పడింది. ఈ భూమిని నేటి ధరలో చాలా తక్కువ ధరకు అమ్మాను. పైగా ఇందులో కొంత ఈ మధ్యవర్తులకు ఇవ్వవలసి ఉంది కాబట్టి నాకు మరింత తక్కువ వస్తుందని బాధేసింది. ఈ మొత్తానికి స్వామివారే కారణమని భావించాను. ఒక సందర్భంలో స్వామివారిపై కోపముతో ఇలా వ్రాసుకున్నాను. స్వామివారు కావాలని నాకు ఈ స్థితి కల్పించారు. నా అనుభూతులను ఎప్పుడో ఒకరోజు ప్రచురిస్తాను, అప్పుడు శ్రీవేంకటేశ్వరుడు నన్ను కాపాడలేదనే అపవాదు స్వామికి రాదా? అని కూడా వ్రాసుకున్నాను. మొత్తం మీద నేనంటే స్వామివారికి ఇష్టం లేదనే బలమైన భావం ఏర్పడింది.

నేను స్వామివారికై ప్రతి సంవత్సరం చాలా ఖర్చు చేస్తున్నాను. నమో వేంకటేశాయ రథమును తీసుకొని ఇల్లిల్లు తిరుగుచు స్వామివారిని స్మరింపచేస్తున్నాను. స్వామిని స్మరిస్తే శుభం కలుగునని, మీ కోరికలు తీరుతాయని చెప్తూ వ్రాయించేవాడిని. ఇదంతా కూడా నా తృప్తి కోసం, స్వామి ఋణం తీర్చుకోవడం కోసం మాత్రమే చేశాను. ఇంతటి కష్టంలో ఏ ఒక్కరోజూ నా సేవకు ప్రతిగా నా సమస్యను తీర్చమని ప్రార్థించలేదు. నా సేవ వేరు, ఈ సమస్య వేరని నమ్మాను. ఒక సాధారణ భక్తునిగా ప్రార్థించాను తప్ప సేవతో ముడిపెట్టలేదు. కాని నాకు అన్యాయం జరిగిందని బాధపడ్డాను. నమో వేంకటేశాయ రథయాత్ర సందర్భంగా కాని, జప పుస్తక పంపిణీ అప్పుడు కాని భక్తులు ''స్వామివారు నీ సమస్యనే తీర్చలేదు, ఇక మా సమస్యలు ఎలా తీరుస్తాడని'' అడిగితే ఏమని సమాధానం చెప్పాలి? అని అనుకున్నాను.

ఇక్కడ మరో ముఖ్య విషయం : ఆస్తి గొడవల విషయంలో ఎన్నోసార్లు భయపడ్డాను. అప్పుడు నాలో నేను ఇలా అనుకున్నాను. ప్రభూ శ్రీవేంకటేశ్వరా! మీ సరైన భక్తుడు కష్టాలకు భయపడడు, కాని నేను భయపడ్డాను. నేను మీ భక్తునిగా చెప్పుకొనుటకు యోగ్యత లేనివాణ్ణని ఎన్నోసార్లు భావించాను. నాలో మార్పుకు ప్రయత్నించాను. కాని వీలు పడలేదు. నా శక్తి సరిపోలేదు. మొత్తం మీద గత కొన్ని నెలల నుండి స్వామివారి పైన అలక ఏర్పడింది.

ఈ రకమైన నా మానసిక స్థితిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు ఎంతగానో నొచ్చుకున్నాడు. మా తండ్రిని నా వద్దకు పంపి హితబోధ చేయించాడు. ఆ సమయాన నేను స్వామివారిపై కోపంగా ఉన్నాను కాబట్టి ఈ లీలను ఏమాత్రం అర్థం చేసుకోలేదు. ఆ లీల ఈవిధంగా ఉంది.

## మా తండ్రి హితబోధ చేయుట

పుష్యమాసం శుద్ధ పంచమి మా తండ్రి గారి వర్ధంతి దినం. ఈ కార్యక్రమం జరుపుటకు ఆ రోజు మా స్వగ్రామానికి వెళ్ళాను. మా తండ్రిగారిని చూడక చాలా రోజులైంది. ఒకసారి చూడాలనిపించింది. దీనికి నా ప్రభువును అడగాలా? అనిపించి, విచారించి చివరికి, ప్రభూ నా తండ్రిని చూపమన్నాను. మీకు నాపై ప్రేమ ఉంటే చూపించమన్నాను. ఆ పరిస్థితులు ఏమైనా సరే కాని చూపించండి అని వేడుకున్నాను. స్వామివారు మా తండ్రిని చూపించారు. మరియు ఒక దెబ్బకు రెండు పిట్టలు లాగా ఆయనతో హితబోధ చేయించారు. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 24-12-2005 కల :** ఈనాటి కలలో మా ఇల్లు అడవిలో బావి దగ్గర ఉన్నదట. బహుశా చిన్నగుండవెల్లి లోని మా తోట బావి వద్ద ఉన్నదనిపించింది. ఎవరో ఇంటినుండి కొన్ని కాయలు మొదలైనవి దొంగిలించుకుపోతున్నారట. దీనిని గమనించిన నేను ఒక కర్రతో ఇంటిలోనుండి బయటకు వారికి తగిలేవిధంగా విసిరాను. తరువాత బయటికి వచ్చి చూశాను. అయితే అక్కడ మా నాన్న నిలబడి ఉన్నాడు. ఆయన తెల్లని బట్టలు ధరించాడు. చనిపోవటానికి 20 సంవత్సరాల ముందటి రూపంతో ఉన్నాడు. నన్నే తీక్షణంగా, విచార వదనంతో చూస్తున్నాడు. మరియు ఒక పాము ఏదో దెబ్బకు బహుశా నేను విసిరిన కట్టె తాకి రెండు ముక్కలై పడి వున్నది. దాని నుండి రక్తం ధారగా చాలా మొత్తంలో కారుతోంది. అప్పుడు దానిని చూసి ఇది మంచి శకునమా? కాదా? అని అనుకున్నాను. కలలోనే శ్రీవారిని స్మరించాను. ఒకవేళ చెడు శకునమైనచో మీరే మాకు రక్ష ప్రభూ అని వేడుకున్నాను. ఇంతే కల.

దీని నిజమైన అర్థం – నా యొక్క ప్రవర్తన వలన శ్రీవేంకటేశ్వరుని హృదయం ముక్కలైంది. నా ఆస్తి కోల్పోవుట వలన కలిగిన కోపము స్వామివారిని గాయపరిచింది. ఆవిధంగా ప్రవర్తించవద్దని, స్వామిని అనుసరించమని మా తండ్రి నాతో

చెప్పటానికి వచ్చాడు. మరియు నా ప్రవర్తన వలన బాధపడ్డాడు. దీనితో పాటు నేను కోరినట్లు తన దర్శనాన్ని కూడా ఇవ్వటానికి వచ్చాడు. కాని ఆ సమయాన నేను దీనిని అర్థం చేసుకోలేదు.

నా దశ : స్వామి కృపతో కొత్త ఇల్లు గృహప్రవేశం చేశాము. రథం కొరకు షెడ్డు నిర్మించాము. స్వామివారి గదిలో చోటు లభించింది. స్వామి విరాట్ రూపును దర్శించాను. ఆధ్యాత్మిక బ్యాచిలర్ డిగ్రీలో చేర్పించారు. చెడు భావాలు త్యజించమన్నారు. ఆస్తిని కోల్పోవుట వలన స్వామిపై కోపము వద్దని మా తండ్రి హితబోధ చేశాడు.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,
హైదరాబాద్. ఫోన్: 040-27175050


తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
# దిశానిర్దేశము




స్వామివారి 700 దివ్యలీలలు
మొదటి సంపుటము
తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.
12 భాగాలు కల
పుస్తకము ధర : 250/-

ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.
ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)
website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com

పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 150/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 400/- ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్

# రచనలకు శ్రీ వేంకటేశం  ఆహ్వానం

'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

– డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

## మరుత్తుడు

**గత సంచిక తరువాయి**

వేదికపై ఉన్న ఆసనాన్ని అలంకరించిన సూతమహర్షి మునులందరివైపూ వాత్సల్యపూర్వకంగా చూశాడు. అందరూ ఆయన ఈరోజు ఏం చెబుతాడో అని ఆలోచించసాగారు. ''మునులారా! హిమవంత పర్వత ఉత్తర భాగంలో ఉన్న 'ముంజవంత' పర్వతంలో శివుని సన్నిధానంలోని సువర్ణాన్ని ఆ పరమేశ్వరుని కరుణతో మరుత్తుడు తన నగరానికి తీసుకొని వచ్చి యజ్ఞ నిర్వహణకు పూనుకొన్నాడని, నిన్న చెప్పాను గదా! తన తమ్ముడైన సంవర్తుడా యజ్ఞం చేయించడానికి ఉపద్రష్టగా వ్యవహరించటానికి అంగీకరించాడని, మరుత్తుని ఇంద్రునికన్నా గొప్ప ధనవంతుని చేశాడని, యజ్ఞానికి కావలసిన కుండలు మొదలైన సమస్త పరికరాలను స్వర్ణమయంగా చేయించాడని విన్న బృహస్పతి కుతకుత లాడిపోయాడు. అవమాన భారంతో కుంచించుకుపోయాడు. దిగులుతో ఉన్న దేవగురువును (బృహస్పతిని) చూసిన ఇంద్రుడు గురువు యొక్క బాధ ఏమిటో తెలుసుకోగోరాడు.

''ఆచార్యవర్యా! నీ మనస్సు ప్రశాంతంగా ఉంది గదా! దేవతల యజ్ఞదీక్షలో వారికి శ్రేయస్సు చేకూర్చే కార్యాలను సమగ్రంగా నిర్వహిస్తున్నారు గదా! దేవతలు కూడా మీ సేవలో నిమగ్నులై మీరు చెప్పిన విధంగా ప్రవర్తిస్తున్నారు గదా! అంతా సక్రమంగా జరుగుతుంటే మీకీ దుఃఖం ఎందుకు? మీ మొగం వాడిపోయి ఉన్నందుకు గల కారణం ఏమిటి?'' అని అడిగిన ఇంద్రుని చూసి – ''అదేమీ లేదు నాయనా! అంతా సుసంపన్నంగా, సమగ్రంగానే ఉంది'' అని అన్న బృహస్పతిని పరిశీలనగా చూశాడు ఇంద్రుడు.

**"నీ యొడలు డస్సి వెలువెల**
**నైయున్నది; నీకు నిట్టి యధికపు వగపుం**
**జేయగ వెఱవని నీచుల**
**చేయుదు దండితులఁ గాగఁ జెప్పుము వారిన్"**

**–68 ప – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''గురుదేవా! మీరు అంతా బాగానే ఉందని చెబుతున్నారు. కార్యనిర్వహణ అంతా సక్రమంగా జరుగుతోందని చెప్పారు. కాని మీ శరీరమంతా బాగా అలసిపోయి, వెలవెల బోతున్నట్లు కనిపిస్తోంది. నీకింత కష్టాన్ని, దుఃఖాన్ని కలుగజేయటానికి

ఏమాత్రం భయపడని నీచులెవరో చెప్పు. అటువంటి వారిని తప్పక శిక్షిస్తాను. వాళ్ళ పేర్లు చెప్పి నాకు ఊరట కలిగించు'' అని వినయంగా అడిగాడు ఇంద్రుడు.

''మహేంద్రా! అటువంటిదేమీ లేదు. మహారాజైన మరుత్తుడు గొప్ప యజ్ఞం చేయటానికి తలపెట్టాడు. దానికి నాకత్యంత విరోధి అయిన సంవర్తుడు ఉపద్రష్టట! ఈ విషయం నాకింతకు ముందే తెలిసింది. నా బాధకు అదే కారణం. ఆ మరుత్తుని యజ్ఞానికి సంవర్తుడు యాజకుడు కాకుండా చేయాలి. అంతే. ఆ విధంగా చేయి'' అన్న బృహస్పతి మాటలు విన్న ఇంద్రుడు పక్కనే ఉన్న అగ్నిదేవుని చూశాడు.

''అగ్నిదేవా! మరుత్తుడనే రాజు యజ్ఞం చేయటానికి ఉత్సాహపడుతున్నాడని విన్నావు గదా! ఆయన వద్దకు వెళ్ళు. ఆ యజ్ఞానికి బృహస్పతి ఉపద్రష్టగా వర్తించేటట్లు చేయి'' అని ఇంద్రుడు చెప్పగానే –

''ఆవిధంగానే చేస్తాన''ని చెప్పి అగ్నిదేవుడు తన తేజస్సు మరింత ప్రజ్వలించే విధంగా రూపు దిద్దుకుని మరుత్తు వద్దకు వెళ్ళాడు. తనముందు దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ప్రత్యక్షమైన అగ్నిదేవుని చూసి ఆశ్చర్యంతో ఆ దిక్పాలకునికి ప్రణమిల్లాడు మరుత్తు. వెంటనే సంవర్తుని పిలిచాడు. సంవర్తుడు చెబుతుండగా అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి, ఆసనము సమర్పించి ప్రక్కనే వినయం ఉట్టిపడుతుండగా నిలబడ్డాడు. వెంటనే అగ్నిదేవుడు రాజును చూసి ''రాజా! నేను నీవద్దకు ఇంద్రుని దూతగా వచ్చాను'' అని అనగానే మరుత్తు సంస్కారం శోభిల్లుతుండగా అగ్నితో మాటలాడసాగాడు.

''అగ్నిదేవా! దేవేంద్రుడు సుఖంగా ఉన్నాడా? దేవతాగణమంతా ఆ త్రిలోకాధిపతికి ఇష్టపూర్వకంగా, భక్తితో



సేవలందిస్తున్నారు కదా! అది సరే. మహేంద్రుడికి నా పట్ల కరుణా దృష్టి ఉంది కదా!'' అని కుశల ప్రశ్నలు వేశాడు. దానికి సమాధానంగా ''మహారాజా! దేవతలందరూ కొలుస్తుండగా దేవేంద్రుడు క్షేమంగానే ఉన్నాడు. నీ పట్ల ఇంద్రుడికి వాత్సల్యం, ప్రేమ మిక్కుటంగా ఉన్నాయి. ఇంద్రుడు నీతో చెప్పమన్న విషయం దూతగా వచ్చిన నేను వివరిస్తాను. సావధానంగా విని, తదనుగుణంగా వర్తించు.

**"నీ జన్మమునకు ధిషణుడు**
**యాజకుడై మర్త్య, నిన్ను నమరత్వ దశా**
**భ్రాజిష్ణు చేయు నమ్మెయి**
**రాజితముగ నాచరింపు క్రతు కార్యంబున్" అని**

**–ప. 74 – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''రాజా! నీవు చేయబోతున్న ఈ యజ్ఞానికి దేవగురువైన బృహస్పతి యాజకుడిగా (ఉపద్రష్టగా) వర్తించి, మానవుడివైన నిన్ను దైవత్వాన్ని పొంది ప్రకాశించేవాడిగా చేస్తాడు. యజ్ఞ కార్యాన్ని బృహస్పతి చెప్పేవిధంగా చేయి అని దేవేంద్రుడు నీతో చెప్పమని నన్ను నియోగించాడు అది చెప్పటానికే నేను నీ వద్దకు వచ్చాను'' అన్న అగ్నిదేవుని పలుకులు విన్న మరుత్తుడు ''మహాత్మా! నీవు దేవతలలో అగ్రగణ్యుడవు. ఆచార్య వర్యుడైన బృహస్పతికి నేను అనేకానేక నమస్కారాలు చేస్తున్నానని చెప్పు. నేనాయనను ఉపద్రష్టగా రమ్మని ప్రార్థించినప్పుడు ఆయన నన్ను అవమానించి, దయాహీనుడై నా మనవిని తిరస్కరించాడు. అటువంటప్పుడు నేను మళ్ళీ వెళ్ళి ఆయనను యాజకుడిగా రమ్మని ఎలా ఆహ్వానించగలను? అసలాయన ఎందుకంగీకరిస్తాడిప్పుడు? అదీగాక, ఆయన తిరస్కరించిన వెంటనే నేను మరోదారి చూసుకున్నాను. బృహస్పతి తమ్ముడైన సంవర్తుని ఆశ్రయించాను. ఈ మహర్షి అన్నకు తగ్గ తమ్ముడు. మహా తపస్సంపన్నుడు. శాపానుగ్రహ సమర్థుడు. అటువంటి సంవర్త మునిని భక్తితో ప్రార్థించి నేను చేయబోతున్న యజ్ఞానికి ఉపద్రష్టగా అంగీకరింపచేసి తీసుకొని వచ్చాను. ఈ మహానుభావుడు నా చేత యజ్ఞ నిర్వహణను చేయించగల సమర్థుడైన యోగీశ్వరుడు. కనుక నేనిప్పుడు అమరగురుని దర్శించటమెందుకు దేవా!'' అన్న మరుత్తు మాటలు విని అగ్నిదేవుడు ఆ రాజును ఇంద్రుని యానతిని సమ్మతింప చేయటానికి మరింత కృషి చేశాడు. ''రాజా! నా మాట కూడా విను. బృహస్పతి ఉపద్రష్టగా నీచేత యజ్ఞాన్ని చేయిస్తే – అది నీకు ఎంత మేలు చేకూరుస్తుందో ఆలోచించు. తన గురువు చేయించిన యజ్ఞమని దేవేంద్రుడు నీకు అన్ని పుణ్యలోకాలను ప్రసాదిస్తాడు. అంతకంటె నీకు మాత్రం ఇంకేం కావాలి చెప్పు'' అని అనగానే అగ్నిదేవుని చూసి సంవర్తుడు మిక్కిలి కోపంతో తన తపశ్శక్తిని ప్రదర్శించాడు.

''అగ్నిదేవా! నీవీ విధంగానే ఇంకా మాట్లాడితే – భయంకరమైన నా దృష్టి నీమీద నిలిపి నిన్ను దహించి వేస్తాను. కనుక ఈ విషయం గురించి ఎక్కువగా ప్రసంగించక తిరిగి నీవు వచ్చిన చోటికి వెళ్ళిపో'' అని అనగానే భయగ్రస్తుడైన అగ్నిదేవుడు వెంటనే సంవర్తుని కెదురు తిరగక ఇంద్రుని దగ్గరకు వెళ్ళిపోయాడు.

''దేవేంద్రా! నీ యానతి ప్రకారం నేను మరుత్తుడి దగ్గరకు వెళ్ళాను. అతని చేత అతిథి సత్కారాలనన్నిటినీ పొంది 'మహారాజా! నీవు చేయబోతున్న ఈ అశ్వమేధ యజ్ఞానికి దేవగురువైన బృహస్పతిని ఉపద్రష్టగా ఆహ్వానించు. ఇది ఇంద్రుని మాట' అని కూడా చెప్పాను. కాని, నా మాటలు మరుత్తు చెవికెక్కలేదు. 'అగ్నిదేవా! బృహస్పతికి నేను చాలా భయపడతాను. అందుకని యజ్ఞనిర్వహణకాతని తమ్ముడైన సంవర్తుని కోరి, ప్రార్థించి తీసుకొని వచ్చాను. ఈ మహాత్ముడే యాగాన్ని నిర్వహింపచేస్తాడు' అని నిక్కచ్చిగా చెప్పాడు. అప్పటికీ నేను, ఇంద్రుని మాట ప్రకారం చేస్తే ఆ దేవవిభుడు నీకు అనేక పుణ్యలోక నివాసాన్ని అనుగ్రహింప చేస్తాడని చెప్పాను. నా మాట కతడు ఒప్పుకోలేదు సరికదా! సంవర్తుడు నామీద ఆగ్రహించాడు'' అని దిగులుగా చెప్పిన అగ్నిదేవుని చూసి ఇంద్రుడు దౌత్యభారాన్ని ఆతనిపైన మరింతగా పెంచాడు.

''అగ్నీ! నేను చెప్పేది కూడా విను. మరొక్కసారి నీవు మరుత్తు దగ్గరకు వెళ్ళు. ఆతనితో నా మాటగా ఈవిధంగా చెప్పు. 'రాజా! త్రిలోకాధిపతి మాట వినక నీవు తిరస్కరిస్తే మహేంద్రుడు నీపైన వజ్రాయుధాన్ని ప్రయోగిస్తాడు. అప్పుడు నీవు యముని పాలికి వెళ్ళక తప్పదు. నా ఆజ్ఞ నతడు నెరవేర్చడానికి అతనికంత నిర్లక్ష్యమా? నన్ను కాదన్నవాడి కథోగతే ప్రాప్తిస్తుందని కూడా చెప్పు'' అని అన్న ఇంద్రుని మాటలలోని తీవ్రతను గమనించాడు అగ్నిదేవుడు. తన మనోభావాన్ని వెంటనే వ్యక్తం చేశాడు.

''మహేంద్రా! అక్కడ ఏం జరిగిందో విపులంగా చెబుతాను విను. ఆ తరువాత నేను మళ్ళీ వెళ్ళడమో, లేదో ఆలోచిద్దాం.

**"ఇంక వచ్చిన దారుణేక్షణ దగ్ధుగా**
**వింతు జుమ్మీ! యని విపుల కోప**
**మూర్తియై పలికె సంవర్తుండు గావున**
**వెఱతు నేనటవోవ వేఱొకండు**
**పోవుగా" కనవుడు దేవేంద్రు డన్యుల**
**నీవు దహింతు గాకే విధమున**
**నొరులు నిన్ను దహింతురో! పేద మాటయి**
**ట్లాడుదే?" యనుటయు నగ్ని పలుకు**
**'మూడు లోకములును వాడి మగంటిమి**
**నేలుచున్న వాని నెట్లు వృత్రు**
**డాక్రమించె నిన్ను? నదియును గాక ప**
**ర్జన్య! మఱియు వినుము బ్రహ్మ బలము"**



**–ప. 84 – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''మహేంద్రా! సంవర్తుడు నన్ను చూసి మహా క్రోధంతో 'అగ్నీ! ఇంకొకసారి నీవు గనుక ఇక్కడకు వచ్చావంటే నా క్రోధ దృష్టికి నిన్ను బలి చేసి దగ్ధుని చేస్తాను. అటువంటి కోపమూర్తిని నేనింతవరకు ఎప్పుడూ, ఎక్కడా చూడలేదు. నాకు నిజంగానే భయం వేసి, వెంటనే నీ వద్దకు వచ్చాను. కనుక మళ్ళీ నేనక్కడకు వెళ్ళను. ఇంకెవరినైనా పంపించు'' అని అగ్నిదేవుడు చెప్పగానే ఇంద్రుడు –

''అదేమిటి అగ్నిహోత్రా! నీవలా చేతకాని వానిలా మాట్లాడుతున్నావు? ఇతరులను నీవు దహిస్తావు గాని, నిన్ను ఇతరులు ఏవిధంగా దహించగలుగుతారు? నిస్సహాయుడిలాగా ఇలా మాట్లాడతావేమిటి?'' అని అనగానే అగ్ని ఇంద్రునితో తర్కంలోకి దిగుతాడు.

''దేవేంద్రా! నీవు త్రిలోకాధిపతివే! మహాపరాక్రమశాలిగా పరిపాలిస్తున్న వాడివే! అటువంటి గొప్పవాడివైన నిన్ను వృత్రాసురుడు ఎట్లా ఆక్రమించగలిగాడు? అంతేకాదు. బ్రహ్మజ్ఞాన సంపన్నులైన మహర్షుల బలం ఎంత గొప్పదో గుర్తు చేస్తాను విను. యోగశక్తితో ఆ మహర్షులు ఎంతటి ఘనకార్యమైనా చేయగలరు! దేనినైనా సాధించగలరు. నీ గురించే చెబుతాను. మహర్షుల మంత్రశక్తి ముందు నీవు తల దించుకోలేదా?

“సయ్యాతి క్రతువున నయ్యాశ్వినుల సోమ
పానంబు నీకొడబాటు గాక
పాయంగబెట్టిన భార్గవచ్యవనుండు
వారికిగా సురవర్గ సహిత
ముగ నిన్ను బాధితుండుగఁ జేసె నిజమంత్ర
బలమున; దానికీ వలిగి వజ్ర
మేద్తెఱఁగొని యమ్ము నీశ్వరు సాధింప
కడగిన నగుచు బెట్టడచెఁ గాదె!
అతడు పుడిసెడు నీరన యప్పడతని
తెలచి సోమ మాశ్వినులకు కలుగజేసి
తరయనెందుకు బ్రహ్మ బలాతిశయము
కడచినట్టి బలంబులు గలవె యనఘ!

**–85 ప – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

“మహేంద్రా! సయ్యాతి యజ్ఞం చేస్తుండగా సోమపానం కొఱకు అశ్వనీ దేవతలు వచ్చారు. వారికి సోమరసం అందించటం నీకిష్టం లేకపోయింది. వారిని సోమపానానికి అర్హులు కారని దూరంగా ఉంచావు. నీ చర్య నచ్చక వారు చ్యవన మహర్షిని ఆశ్రయించారు. చ్యవన మహర్షి వారి కోరిక తీర్చడానికి, తన మంత్రశక్తితో నిన్ను, దేవతలను కష్టాలపాలు చేయలేదా? దానికి నీవు చ్యవనుడి మీద అలిగి ఆ మహర్షి మీద వజ్రాయుధాన్ని ప్రయోగించావు. గుర్తుందా అప్పుడేం జరిగిందో? ఆ మహనీయుడు ఇంద్రుని చూసి నవ్వుతూ వజ్రాయుధ శక్తిని తన మంత్రబలంతో ఉపసంహరించి, నీ గర్వాన్ని అణిచివేశాడు గదా! వర్షానికి అధిదేవుడవైన నిన్ను పుడిసెడు నీరడిగినప్పుడు ఇవ్వలేదు సరికదా, భృగుమహర్షి పుత్రుడైన చ్యవనుని లక్ష్యపెట్టలేదు. అందుకు ఆయన నీ శక్తిని తన తపశ్శక్తితో క్రిందు పరచి నిన్ను అహంకార రహితుని చేశాడు. అప్పుడు ఇంద్రా! ఆ బ్రహ్మర్షిని స్తుతించి ప్రసన్నుని చేసికొని అశ్వినీ దేవతలకు సోమరసాన్ని ఆనందంతో ఇచ్చావు. ఇదంతా ఎందుకు చెప్పానంటే బ్రహ్మజ్ఞాన సంపన్నుల బలం ముందు ఏ ఇతర బలాలు పని చేయలేవు సరికదా! అవి ఓడిపోవలసిందే సుమా! అందుకే ఇంద్రా! నీవా మహర్షి పాదాల మీద పడి క్షమించమని వేడుకొన్నావు. నేను మాత్రం తిరిగి మరుత్తుని వద్దకు వెళ్ళి నీ ఆజ్ఞను మన్నించమని అడగలేను. నన్ను వదిలివేయి” అన్న అగ్నిహోత్రుని మాటలను అంగీకరిస్తూనే “మరుత్తుని వద్దకు వేరొకరిని పంపుతానులే” అన్నాడు ఇంద్రుడు.

“బ్రహ్మజ్ఞానుల తపోబలము చాలా గొప్పదని నాకు తెలుసు. గంధర్వలోకపతి అయిన ధృతరాష్ట్రుని – మరుత్తుని వద్దకు నా దూతగా పంపుతాను. నీవు వెళ్ళు అగ్నీ!” అని అగ్నిదేవుని పంపివేసి ధృతరాష్ట్రుని పిలిపించాడు దేవేంద్రుడు.

“ధృతరాష్ట్రా! నీవు మరుత్తుని వద్దకు పోయి ‘రాజా! బృహస్పతిని నీకు యాజకుడిగా గ్రహించమని చెప్పు. నీవల చేయకపోతే ఇంద్రుడు క్రోధంతో నీ మీదకు వజ్రాయుధాన్ని ప్రయోగిస్తాడని చెప్పు. అదీ సంవర్తుని చెంతనే ఉన్న మరుత్తునితో చెప్పు” అని ఇంద్రుడు గంధర్వ రాజుని పంపివేశాడు. ఇంద్రానుమతితో గంధర్వ రాజు ధృతరాష్ట్రుడు – మరుత్తు వద్దకు వెళ్ళాడు. సంవర్తుడు మరుత్తు పక్కనే ఉండటం గమనించాడు. మరుత్తుని వైపు చైసి – తాను గంధర్వ రాజైన ధృతరాష్ట్రుడనని – దేవేంద్రుని ఆజ్ఞ ననుసరించి తాను వచ్చితిననియు, ముందుగా తనను తాను పరిచయం చేసుకొన్నాడు. అగ్నిదేవుడు చెప్పినట్లే ధృతరాష్ట్రుడు కూడా ఇంద్రుని పంపును మరుత్తుకు సాకల్యంగా వివరించి చెప్పాడు. అయినా సమ్మతించని మరుత్తుని చూసి “రాజా! నీవు గనుక దేవేంద్రుని ఆజ్ఞను పాటించకపోతే ఆ దేవపతి నీమీద తన వజ్రాయుధాన్ని ప్రయోగించి నిన్ను శక్తిహీనుణ్ణి చేస్తాడు.

“అనిన మరుత్తుఁ ‘డయ్యమర గురుండు నా
యాగంబు నడపుట కాత్మ రోసి
రాకున్న సంవర్తు ప్రార్థించి తెచ్చితి!
నింక నట్టులు సేయకెట్లు వచ్చు
ననఘ! మిత్రద్రోహ మధిక పాపము గాదె?
యిది నీవెఱుంగు దయ్యింద్రుడెఱుగు
సిద్ధ సాధ్యాది ప్రసిద్ధులు నెఱుగుదు
రిమ్మాట గురునకు నియ్యకోల’
యనుడు గంధర్వుడ దె విన నయ్యె వజ్ర
ఘోర నాదంబు నీకోర్వగలది యగు నొ
కాదొ నీవయెఱెంగుదు మేదినీశ!
యనుటయును నృపుడాలించి విని భయమున”

> **“మహాత్మా! సంవర్తమునీంద్రా! అదిగో వజ్రాయుధం నామీదకు వచ్చేస్తున్నట్లున్నది. ఆ ఘోరమైన ధ్వని విన్నావా? నా మనస్సు భయంతో కొట్టుమిట్టాడుతున్నది. ఏం చేయాలో, ఎలా తప్పించుకోవాలో తెలియటం లేదు. సభ్యులందరూ భయంతో వణికిపోతున్నారు. నీవు తప్ప మాకు శరణు ఇంకెవరున్నారు చెప్పు! నీవే మామీద దయతో మమ్మల్నందర్నీ రక్షించాలి. నీవు రక్షించకపోతే మేమేమైపోతామో! వేగంగా వస్తున్న వజ్రాయుధాన్ని నిలువరించు”**

**–91 ప – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

"గంధర్వ సార్వభౌమా! ఇంద్రుని ఆనతే కాదు, నా మనోగతం కూడా విను. బృహస్పతి నేను చేసే యాగాన్ని నడిపించటానికి అసహ్యించుకొని, నేను పిలిచినా, ఆయన దానికి ఒప్పుకొని రాలేదు. అప్పుడు సంవర్త మునిని ప్రార్థించి ఆయనను యాజకునిగా అంగీకరింపచేసి తీసుకొని వచ్చాను. అటువంటి పరిస్థితిలో ఆయనను కాదని బృహస్పతిని ఎట్లా పిలువగలను? మైత్రి చేసి, సంవర్తుని పట్ల ఏవిధంగా మిత్రద్రోహం చేయగలను? మిత్రద్రోహికి కలిగే పాపం అంతా ఇంతా కాదు. న్యాయం నీకు తెలుసు, ఆ త్రిలోకాధిపతికీ తెలుసు. సిద్ధులు, సాధ్యులు మొదలైన దేవతాప్రముఖులకూ తెలుసు. ఈమాట దేవగురువైన బృహస్పతికీ తెలుసు కదా!" అని మరుత్తుడు చెప్పుండగా గంధర్వుడు "రాజా! ఘోరమైన, వజ్రాయుధం ఇక్కడకు వస్తున్న ధ్వని వినవస్తోంది. వజ్రాయుధం దెబ్బను తట్టుకోగల శక్తి నీకున్నదో, లేదో అన్న విషయం నీకే తెలుసు" అని అనగానే మరుత్తుడు ఒక్కసారిగా ఆ మహాధ్వనిని విని, భయాందోళనములకు గురయినాడు. వెంటనే సంవర్తుని వైపు చూశాడు.

"మహాత్మా! సంవర్తమునీంద్రా! అదిగో వజ్రాయుధం నామీదకు వచ్చేస్తున్నట్లున్నది. ఆ ఘోరమైన ధ్వని విన్నావా? నా మనస్సు భయంతో కొట్టుమిట్టాడుతున్నది. ఏం చేయాలో, ఎలా తప్పించుకోవాలో తెలియటం లేదు. సభ్యులందరూ భయంతో వణికిపోతున్నారు. నీవు తప్ప మాకు శరణు ఇంకెవరున్నారు చెప్పు! నీవే మామీద దయతో మమ్మల్నందర్నీ రక్షించాలి. నీవు రక్షించకపోతే మేమేమైపోతామో! వేగంగా వస్తున్న వజ్రాయుధాన్ని నిలువరించు" అని ప్రాధేయపడుతున్న మరుత్తుని, యోగీశ్వరకుడైన సంవర్తుడు చక్కని మాటలతో ఓదార్చాడు.

**"ఇంద్రుని దెస భయంబించుకేనియు వల**
**దతడు నన్నెఱుగదే యధిప! వినుము**
**సంస్తంభ విద్యా ప్రశస్త వైభవమున**
**వజ్రంబు నడతు నవ్వాసవాది**
**దైవతంబుల యాయుధంబులు నాచేత**
**ప్రతిహతంబొందు; దుష్పవన చండ**
**వృష్టి ప్రముఖ మహావికృతుల బాధింతు**
**ననుడ మ్రోయుచు నిదె యరుగుదెంచె**
**భిదుర మెవ్విధమున భీతి దొఱంగుదు**
**ననియె నృపతి; యాతడల్ల నగుచు**
**దాని సరకు గొనకు తగు వరమడుగు నా**
**తపము పేర్మి నిత్తు ధరణినాథ!"**

**–95 ప – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

"మహారాజా! ఇంద్రుడంటే నీవేమాత్రం భయపడ వలసిన పనిలేదు. ఎందుకంటే – నేనంటే ఎవరో, ఏమిటో ఆ దేవపతికి తెలియదా? నేను ఇంద్రుని వజ్రాయుధాన్ని – సంస్తంభ విద్యతో, తన్మంత్రాన్ని ప్రయోగించి నీ మీదకు రాకుండా (గమనాన్ని స్తంభింపచేసి – ఆపివేసి) చేస్తాను. అంతేకాదు, దేవతలందరి ఆయుధాలను పని చేయకుండా నిలిపివేస్తాను. సుడిగాలులతో నిండిన భయంకరమైన వర్ష సముదాయంతో దేవతా సమూహాన్ని అష్టకష్టాల పాలు చేస్తాను. నీవు ఇంద్రుని గురించి కొంచెం కూడా భయపడకు. నేనున్నాను కదా!" అని సంవర్తుడంటున్న క్షణంలో "అదిగో! చాలా పెద్దగా మ్రోగుతూ వజ్రాయుధం వచ్చేస్తోంది. భయపడకుండా ఎలా ఉండగలను?" అని మరుత్తుడు అనేసరికి సంవర్తుడు మెల్లగా నవ్వాడు. నవ్వి 'ఓ మహారాజా! వజ్రాయుధం గురించి లక్ష్యపెట్టకు. నీకు ఏ వరం కావాలో దానిని కోరుకో. నా తపః ప్రభావంతో నీకు ఆ వరం ఇస్తాను" అని కరుణాళువైనాడు సంవర్తుడు.

సంవర్తుని మాటలతో మరుత్తుడిలో భయం పోయింది. "మహాత్మా! నీవు చెప్పావు గనుక నా మనస్సులోని కోరికను నీకు వెల్లడిస్తాను. అది వరంగా భావించి నాకు ప్రసాదించు. మునీంద్రా! దేవేంద్రుడు నా పట్ల విరోధాన్ని వీడి, యజ్ఞానికి వచ్చి, తన పాలి హవ్యభాగాన్ని స్వీకరించేటట్లు మీరు సంకల్పించండి. కరుణానిధీ! సంవర్త తపోనిధీ! తక్కిన దేవతలందరూ కూడా తమ తమ హవిర్భాగాలను ఇక్కడకు వచ్చి పరిగ్రహించే విధంగా అనుగ్రహించండి. అప్పుడు మన యజ్ఞం సక్రమంగా, బహు సుందరంగా నిర్వహింబడినదిగా అఖండ కీర్తిని పొందుతుంది. ఈవిధంగా మీరు చేయవలసిందిగా కోరుతున్నాను" అని ఎప్పుడైతే మరుత్తుడు వేడుకోగానే సంవర్తుడు సంతోషంతో "మహారాజా! నీ కోరిక తప్పకుండా నెరవేరుతుంది. నా ఆహ్వానం చేరగానే ఇంద్రుడు సోమపానం నిమిత్తం నీ యజ్ఞం వద్దకు వస్తాడు. ఇక యజ్ఞ కార్యక్రమం ప్రారంభించు" అని చెప్పి దూరంగా ఉండగానే వజ్రాయుధాన్ని తమ వద్దకు రాకుండా నిలిపివేశాడు. గంధర్వుని పంపివేశాడు. యోగీంద్రుడైన సంవర్తుడు తన మంత్రబలం చేత, దేవేంద్రుని, తక్కిన దేవతలను సోమపానం చేయవలసిందిగా యజ్ఞవాటికకు రమ్మనమని పిలిచాడు.

మహాత్ముడైన సంవర్తుని మంత్రశక్తికి ఆహ్వానింపబడిన దేవేంద్రుడు, దేవతలు ప్రేమతో మరుత్తుని యజ్ఞశాలకు వేంచేయడంతో ఆ ఉపద్రష్ట అనుమతితో మరుత్తు వాళ్ళను ఎదుర్కొని, అర్ఘ్య పాద్యాదులిచ్చి పూజించాడు. దేవేంద్రునికి ప్రణమిల్లి, "ఓ దేవా! నీవు వచ్చి నా జన్మ సఫలం చేశావు. నీ దయతో నేను కృతార్థుడనయినాను. నా మీద కోపం వదలి నన్ను చల్లగా చూడవలసిందిగా ప్రార్థిస్తున్నాను. దేవతాధిపా! ఈ సంవర్తముని – బృహస్పతి స్వరూపమే. అందుకే యజ్ఞానికి ఆ

మహానుభావుని యాజకునిగా ఆహ్వానించాను'' అని విన్నవించిన మరుత్తుని చూసి ''రాజా! నీవలన చాలా సంతోషం కలిగింది. సంవర్తముని బృహస్పతి తమ్ముడే గదా! బృహస్పతి వంటివాడే. అంత తపోమహిమ గలవాడే'' అని దేవేంద్రుడు – వారిని చూసి సంతృప్తిని కనబఱిచాడు. ప్రసన్నుడైన ఇంద్రుని ఆత్మీయంగా భావిస్తూ సంవర్తుడు ''మహేంద్రా! నీవు అఖిల లోకాలకు పరిపాలకుడవు. ఆదరంతో మా యజ్ఞానికి వచ్చి సఫలీకృతం చేశావు. నీ రాక నా తపః ఫలము కదా! మరుత్తు క్రతువు పుణ్యానికి నిలయమైంది. నీ కరుణతో ఈ రాజు పవిత్రుడైనాడు.

**"సకల విధాన దక్షుడవు సర్వము నారసిచేయఁ బంపు నీ**
**సకృప విలోకనంబులను సార్థములై క్రతు మంత్ర తంత్రముల్**
**వికలతలేక చెల్లు జనవిశ్రుతుఁడీ నృపుడున్ భవద్దయన్**
**సుకృతులలోన పెంపుగని చూడగనుం దగపుణ్య లోకముల్"**

**–101 ప – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

దేవేంద్రా! నీవు సకల ధర్మాలను నడిపించటంలో దక్షుడవు. సర్వ విషయాలను చక్కగా పరిశీలించి చేసే విధంగా ఆజ్ఞాపించేవాడివి. క్రతు (యజ్ఞ) మంత్ర తంత్రాలన్నీ ఏ లోపం లేకుండా సార్థకమయ్యే విధంగా నీ కృప వల్లనే నిర్వహింపబడుతుంటాయి. ఈ రాజు కూడా నీ దయా విశేషం వల్లనే పుణ్యాత్ములలో గొప్పవాడై పుణ్యలోక నివాసి అవుతాడు'' అని వినయంతో ఇంద్రుని మహిమను కొనియాడాడు. మహేంద్రుడు మరుత్తు యొక్క, సంవర్తుని యొక్క ప్రవర్తనకు ఎంతగానో సంతోషించాడు. దేవతలను యజ్ఞవాటికను బహు సుందరంగా, పవిత్రంగా తీర్చి దిద్దమని ఆదేశించాడు. అప్సరః కాంతలను నృత్యం చేయమని, గంధర్వులను తమ గాన వైభవంతో అందరినీ అలరింప చేయమని నిర్దేశించాడు. ఆ విధమైన నృత్త గీతాలతో యజ్ఞ మంటపం మనోజ్ఞమైంది. యజ్ఞకార్య నిర్వహణలో కూడా దేవతలు సహాయం చేస్తుండటంతో యజ్ఞం మహోజ్జ్వలంగా ప్రారంభమైంది. మహాతపస్వి, యోగీంద్రుడు అయిన సంవర్తుడు మరొక అగ్ని? అన్నట్లు ప్రకాశిస్తూ యజ్ఞకార్యాన్ని నడిపించగా మరుత్తు చేసిన యజ్ఞం సర్వుల ప్రశంసలను అందుకొంది. యాజకుడైన సంవర్త మహాముని దేవేంద్రాది దేవతలనందరినీ పేరు పేరునా పిలిచి, ప్రతి ఒక్కరికీ స్వయంగా సోమరసాన్ని అందించి వారిని సంతృప్తి పఱిచాడు. ఇంద్రాది సురలు మరుత్తుని, సంవర్తుని అభినందించి తమ తమ నివాసాలకు వెళ్ళిపోగానే వారు దానక్రియలో మునిగిపోయారు. మరుత్తు తన రాజధానీ నగరం నుంచి చేయించి, తెప్పించిన సమస్త సువర్ణమయ యజ్ఞ పరికరాలను హిమగిరి ప్రాంతంలో చేసిన యజ్ఞంలో ఉపయోగించటమే కాక, యజ్ఞం పరిసమాప్తి పొందిన నాడు వేద వేదాంగ విదులైన విప్రోత్తములకు ధనరాశులతో పాటు స్వర్ణ సామగ్రిని కూడా దక్షిణలుగా సమర్పించాడు. మరుత్తులోని భక్తి తత్పరతకు, వినయ విధేయతలకు మిక్కిలిగా సంతృప్తి చెందిన బ్రాహ్మణోత్తము లాతనిని అనేకానేకమైన ఆశీస్సులతో ముంచెత్తారు. యజ్ఞమంటపంలోని కుండలు మొదలగు యాగ పరికరాలు, శయ్యలు, ఆసనాలు – ఒకటేమిటి? అన్నీ బంగారంతో చేయబడినవే. అన్నిటినీ దానం ఇచ్చి, తృప్తితో సంవర్తముని చేత అనుజ్ఞ పొందిన వాడై మరుత్తుడు రాజధానీ నగరానికి వచ్చి, ధర్మబద్ధంగా రాజ్యపాలన చేసి పుణ్యుడైనాడు. దానగ్రహీతలైన విప్రోత్తములందరూ తాము మోయగలిగినన్ని బంగారు రాశులను స్వీకరించి, మిగిలిన బంగారాన్నంతటినీ అక్కడ (హిమాలయ ప్రాంతంలో) నిధిగా నిక్షేపించి పెట్టారు. తరువాతి కాలంలో ఎవరు దానిని చూస్తారో – ఆ నిధి వారిదేనని చెప్పారు'' అని సూత మహర్షి చెప్పటం ఆ నాటికి ముగించాడు.

''శౌనకాది మహామునులారా! విన్నారు కదా! మరుత్త రాట్చరిత్ర – ఎంత మహత్తరమైనదో!? తపో మహిమ ఎంతటి ఘనకార్యాన్నైనా ఎలా సాధించగలదో!? సంవర్తముని తన మంత్రశక్తితో ఇంద్రునే రప్పించగలిగాడు! బంగారు రాశుల్ని మరుత్తుకు అందించాడు'' అని అనడంతో ''అవును స్వామీ!'' అంటూ మునులందరూ తమ హర్షాన్ని వెలిబుచ్చి ఆశ్రమోన్ముఖులై సూతుని అనుసరించారు.

ఈ మరుత్త రాట్చరిత్ర – ధర్మరాజు అశ్వమేధ యజ్ఞం చేయటానికి ప్రోద్బలకమై, ధనరాశుల్ని ఎక్కడ నుంచి తెచ్చుకోవాలో నిర్దేశిస్తూ, ధర్మరాజు శోకాన్ని ఉపశమింపచేస్తూ ప్రధాన కథకు మహోపాఖ్యానంగా విరాజిల్లింది.

**(సశేషం)**

''శౌనకాది మహామునులారా! విన్నారు కదా! మరుత రాట్చరిత్ర – ఎంత మహత్తరమైనదో!? తపో మహిమ ఎంతటి ఘనకార్యాన్నైనా ఎలా సాధించగలదో!? సంవర్తముని తన మంత్రశక్తితో ఇంద్రునే రప్పించగలిగాడు! బంగారు రాశుల్ని మరుత్తుకు అందించాడు''

# శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనము

కౌతా నిర్మల

విశ్వం అనగా ప్రపంచం అని అర్థం. విశ్వరూప ప్రదర్శనము అంటే, ఆ విశ్వాన్నంతటినీ తనలో చూపించటమే విశ్వరూప ప్రదర్శనము. శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాలలో ఎనిమిదవ రూపం శ్రీకృష్ణుడు. ఈయన మధుర పట్టణంలో, శ్రీముఖ నామ సంవత్సరం, శ్రావణ బహుళ అష్టమి, అర్ధరాత్రి సమయాన రోహిణీ నక్షత్రంలో, వృషభ లగ్నంలో జన్మించాడు. శ్రీకృష్ణుడు ద్వాపరయుగంలో జన్మించాడు. ఆయన అవతారం ముగిసిన తర్వాత నుంచి కలియుగం ఆరంభమైంది. శ్రీకృష్ణుడు తన లీలలను, మహత్యాన్ని శైశవ దశ నుంచే ప్రదర్శించాడు. శైశవంలో పూతన అనే రక్కసిని అంతమొందించాడు. బాలుడిగా ఉన్నప్పుడు శకటాసురుడిని, తృణావర్తుడనే రాక్షసులను హతమార్చాడు. శాపవశాన మద్దిచెట్లగా ఉన్న గంధర్వులకు శాపవిమోచనం కలిగించాడు బాల కృష్ణుడు.



శ్రీకృష్ణుడు ఆరుసార్లు తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. మొదటి విశ్వరూపము తల్లి ఒడిలో పరుండినప్పుడు, శైశవదశలో నిద్ర వస్తున్నట్లుగా ఆవలించాడు. అప్పుడు కృష్ణుడి నోరు యశోదకు ఒక కొండగుహలా కనిపించింది. గుహలో సముద్రాలు, నాలుగు దిక్కులు, సూర్యచంద్రులు, అగ్ని, ఆకాశము, త్రిలోకాలు, సమస్త జీవరాశులను చూసిందావిడ. ఆ తర్వాత ఆమెను మాయ ఆవరించి, ఆ విషయాన్ని మరిచిపోయేలా చేసింది. ఇది శ్రీకృష్ణభగవానుని మొదటి విశ్వరూప ప్రదర్శనము.

బాల్యదశలో తోటి పిల్లలతో తన సోదరుడు బలరాముడితో ఆడుకుంటున్నప్పుడు మట్టిని తిన్నాడు. ఆ విషయాన్ని బలరాముడు, తోటిపిల్లలు యశోద వద్దకు వచ్చి ఫిర్యాదు చేశారు. ఆ తల్లి తన కుమారునిపై కోపగించగా, నేను మన్ను తినలేదని, వారి మాటలు అబద్ధమనీ బుకాయించాడు బాలకృష్ణుడు. నువ్వు మన్ను తిన్నావో లేదో నీ నోరు తెరచి చూపించు అని నిగ్గదీసింది యశోద. అప్పుడు కృష్ణుడు నోరు తెరవగా ఆ నోటిలో ప్రపంచమంతటినీ చూసిందామె. త్రిలోకాలు, పర్వతాలు, నదులు, సముద్రాలు, 14 భువనాలు, సకల జీవరాశులు, సూర్యచంద్రులు కనిపించాయామెకు. యశోద వింత అనుభూతి చెందుతూ అబ్బురంగా అలాగే చూస్తుండిపోయింది. తల్లి స్థితిని గ్రహించిన బాలకృష్ణుడు వెంటనే ఆమె ఆ స్మృతిని కోల్పోయేటట్లు చేశాడు. ఇది శ్రీకృష్ణుని రెండవ విశ్వరూప ప్రదర్శనము.

శ్రీకృష్ణుని మేనమామ కంసుడు తాను చేసే ధనుర్యాగానికి బలరామ కృష్ణులను తీసుకొని రమ్మని అక్రూరుడిని బృందావనానికి పంపాడు. ఆ అన్నదమ్ములను రథమెక్కించి, వారి వెంట అక్రూరుడు మధురకు బయల్దేరాడు. మార్గమధ్యంలో బలరామకృష్ణులు రథాన్ని దిగి యమునా నదిలో దోసెడు నీళ్ళ

తాగి, తిరిగి రథం ఎక్కారు. కొంతసేపైన తర్వాత అక్రూరుడు రథం దిగి, యమునా నదిలోకి ప్రవేశించి స్నానం చేసి, శుచిగా వేదమంత్రాలను పఠించాడు. నీటిలో మునిగి లేచేసరికి బలరామకృష్ణులు ఆ నీటిలో కనిపించారు. తిరిగి రెండోసారి నీటిలో మునిగి లేచేసరికి బలరామ కృష్ణులు రథంలో కూర్చుని ఉండటం చూశాడు. మూడవసారి నీటిలో మునిగి పైకి లేచిన అక్రూరునికి ఆ నీటిలో ఆదిశేషుడు, ఆ ఆదిశేషునిపై శయనించిన విష్ణుమూర్తి దర్శనమిచ్చారు. అయితే ఆయనలో శ్రీకృష్ణుడు కనిపించినాడతనికి. ఆయన వదనంలో సూర్యచంద్రులు, నదులు, సముద్రాలు, పర్వతాలు, గుహలు, వృక్షాలు, ఆకాశాన్ని, భూమిని, సమస్త జీవరాశులను, జలచరాలను చూసి దిగ్భ్రాంతి చెందాడు. శ్రీకృష్ణుడు సామాన్య మానవుడు కాడనీ, సాక్షాత్తు ఆ విష్ణుమూర్తి స్వరూపమేనని గ్రహించి ఆయనకు నమస్కరించి స్తుతించాడు. తను దర్శించిన స్వామి రూపాన్ని తన మనస్సులోనే భద్రపరచుకున్నాడు అక్రూరుడు. ఇది శ్రీకృష్ణపరమాత్ముని మూడవ విశ్వరూప ప్రదర్శన.

శోభకృతు సంవత్సరంలో, కార్తీక శుద్ధ ద్వాదశి నాడు శ్రీకృష్ణుడు కౌరవుల వద్దకు రాయబారానికి వెళ్ళాడు. దుర్యోధనుడు ఆ రాయబారాన్ని తిరస్కరించి, సంధిని నిరాకరించాడు. అంతేకాకుండా దుర్యోధనాదులు శ్రీకృష్ణుని బంధించే ప్రయత్నం చేశారు. ఆ రాజసభలో శ్రీకృష్ణుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శించి, అంధుడయిన ధృతరాష్ట్రునికి చూపును ప్రసాదించి తన విశ్వరూపాన్ని ఆయన దర్శించగలిగేలా చేశాడు. ఇది శ్రీకృష్ణుని నాలుగవ విశ్వరూప ప్రదర్శనం.

పాండవులు, కౌరవుల మధ్య యుద్ధం తప్పనిసరి అయింది.



కురుక్షేత్రంలో యుద్ధం జరగవలసి ఉంది. కౌరవులు, పాండవులు చెరోవైపు యుద్ధానికి సన్నద్ధులై ఉన్నారు. అర్జునుడు తాను యుద్ధం చేయబోయే వారివైపు తన చూపును ప్రసరించాడు. వారు శత్రువులు కారనీ, శత్రుపక్షం వారంతా తనవారేననీ, తన సోదరులు, బంధువులు, గురువులు, ఆచార్యులు కనిపించారు. వారితో తాను యుద్ధం చేయడం అధర్మ మని భావించి, యుద్ధం చేయటానికి నిరాకరిస్తూ వారిని ఎదుర్కోవడం, వారితో తలపడటం పట్ల విముఖత చూపాడు. అప్పుడు శ్రీకృష్ణుడు కురుక్షేత్రంలో అర్జునుని ఎదుట తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. అటు పిమ్మట అర్జునునికి గీతోపదేశం చేశాడు. ఇది శ్రీకృష్ణుని అయిదవ విశ్వరూపం.

ధర్మరాజు నిర్వహించే అశ్వమేధ యాగానికి హాజరైన శ్రీకృష్ణుడు కొద్దిరోజుల తర్వాత ద్వారకకు తిరుగు ప్రయాణమయ్యాడు. అప్పుడు ఆయన ఉదంక మహాముని ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ మహర్షి శ్రీకృష్ణుని కౌరవులు, పాండవుల క్షేమసమాచారాలను గురించి అడుగగా, ఆయనకు కౌరవులు, పాండవుల మధ్య జరిగిన కురుక్షేత్ర సమరం గురించి చెప్పి, ఆ యుద్ధంలో కౌరవులందరూ మృతి చెందారని, భీష్మ ద్రోణాదులందరూ కూడా మరణించారన్న విషాద వార్తను తెలిపాడు. ఆ మాటలు విన్న ఉద్దాలక మహర్షి శ్రీకృష్ణుని మీద కోపించి, ''నువ్వు సమర్థుడివి, ధర్మం తెలిసిన వాడివి, విజ్ఞత కలిగినవాడవు, నువ్వు తలచుకుంటే యుద్ధాన్ని ఆపగలిగేవాడివి. నువ్వలా ఎందుకు చేయలేదు'' అని శ్రీకృష్ణుని మీద మండిపడ్డాడు.

శ్రీకృష్ణుడు తాను సంధి ప్రయత్నం చేశానని, రాయబారానికి నేనే వెళ్ళి, కౌరవుల చేత యుద్ధాన్ని విరమింప చేయాలని చూశానని, కానీ దుర్యోధనుడు తన మాటలను పెడచెవిన పెట్టి నిర్లక్ష్యం చేశాడని, తానెంత వారించినా కౌరవులెవ్వరూ తన మాటలను వారి చెవులకెక్కించుకోలేదని, ఈ యుద్ధం వలన కురువంశం నశిస్తుందని చెప్పినా వారు తన మాటలను లక్ష్యపెట్టలేదని, అందువలన తాను అశక్తుడనై యుద్ధాన్ని ఆపలేకపోయానని బాధగా చెప్పాడు.

''నేనే సత్త్వ తమో రజో గుణాలనీ, నేనే నాలుగు దిక్కులు, నాలుగు వేదాలనీ, నేనే నాలుగు వర్ణాలు (కులాలు), నేనే ఓంకారం, నేనే ఇహం, పరం, నేనే మోక్షం, ఈ సృష్టికి మూలం నేనే'' అని చెప్పాడు ఉదంకమునికి. అప్పుడా మహాముని శ్రీకృష్ణుడు భగవంతుని అవతారమని, తాను ఆయనను తప్పుగా అర్థం చేసుకున్నానని బాధపడ్డాడు. శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని చూపించమని వేడుకున్నాడు. ఆ మహర్షి అభ్యర్థనపై శ్రీకృష్ణ భగవానుడు తన విశ్వరూపాన్ని ఆయన ఎదుట ప్రదర్శించాడు. ఇది ఆయన ఆరవ విశ్వరూపం.

ఈవిధంగా శ్రీకృష్ణ భగవానుడు ఆరు పర్యాయములు తన విశ్వరూపాన్ని ప్రదర్శించినట్లుగా భారత, భాగవత పురాణములు తెలిపాయి.





# యజ్ఞోపవీతం - పరమం పవిత్రమ్

: చింతలపాటి శివశంకర శాస్త్రి

శ్లో || "ముక్తా విద్రుమ హేమనీల ధవళచ్ఛాయై ర్ముఖైస్త్రీక్షణైః
యుక్తా మిందు నిబద్ధ రత్న మకుటాం తత్త్వార్థ వర్ణాత్మికాం
గాయత్రీం వరదాభయాఙ్కు శకశాః శుభ్రం కపాలం గదాం
శంఖం చక్ర మధారవింద యుగళం హస్తైర్వహన్తీం భజే"

ముత్యపు వర్ణము, పగడపు వర్ణము, బంగారు వర్ణము, నల్లని వర్ణము, తెల్లని వర్ణములు గల అయిదు ముఖములు కలిగినట్టియు, మూడు నేత్రములు కలదియు, కిరీటము నందు చంద్రకళ కలిగినదియు, బ్రహ్మ పదార్థమనే ఆత్మ కలదియు, వరప్రదానము, అభయము, అంకుశం, కొరడాను, తెల్లని బ్రహ్మ కపాలమును, గదను, శంఖమును, చక్రమును, రెండు పద్మములను ధరించిన గాయత్రీదేవిని సేవించుచున్నాను.

మాసాలలోకెల్లా పరమ పవిత్రమైంది శ్రావణం. శ్రవణా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం శ్రావణమాసం. శ్రవణా నక్షత్రం శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం. అందువల్ల మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైంది. ఈ మాసం శివకేశవుల ఆరాధనకు ఉపయుక్తమైనది. శివకేశవులకు భేదం లేదనే మాటను నిజం చేస్తూ ఈ నెలలోని సోమవారాలలో శివునికి, శనివారాలలో విష్ణుసంబంధమైన పూజలు, అభిషేకాలు చేస్తారు.

భారతదేశంలో వేదకాలం నుండి ఆసేతు హిమాచల పర్యంతం ఉపాస్యదైవం శ్రీ గాయత్రీ పరదేవత. ఈమె వేదాలకు తల్లి కనుక వేద మాత అని, జగదంబిక అని, సర్వజగాలకు సృష్టి, స్థితి, సంహారకర్తలైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు గాయత్రీ మాతకు అవయవాలుగా వర్ణించారు ఋషులు. శ్రుతి గాయత్రీ మాత స్వరూపాన్ని "అగ్నిర్ముఖం బ్రహ్మశిరః విష్ణు హృదయం రుద్రశిఖాః" అని చిత్రించింది. ఇట్టి మహిమాన్వితమైన, సర్వోత్కృష్టమైన దైవతమును బ్రహ్మాది దేవతా శ్రేష్ఠులు, వేదాధిష్ఠాన దేవతలైన పురుషులును ఆమెను త్రికాల సంధ్యలలో భక్తితో ఉపాసిస్తుంటారని దేవీభాగవతం చెబుతోంది. దేవతా బృందంలో బ్రహ్మాదులు గొప్పవారనే విషయం నిర్వివాదమైన అంశం. అట్టి బ్రహ్మచే ఉపాసింపబడు ఆ పరదేవత వారిచే జపింపబడు దివ్య మంత్ర మహాత్మ్యము అనిర్వచనీయం. శ్రుతులు ఆ దేవిని ఓజస్సులలో ఓజస్సని, బుద్ధిమంతులలో బుద్ధియేయని, తేజస్వంతులలో తేజస్సేనని, చైతన్యవంతులలో చైతన్యమే అని, తుదకు నామరూపాత్మకమగు ఈ సర్వ ప్రపంచానికి ఆమే ఆత్మ అని వర్ణిస్తోంది. బ్రహ్మ ఆమె స్థూలదేహమని, స్థితికర్త విష్ణువు సూక్ష్మదేహమని, సంహారకర్త ఈశ్వరుడు కారణదేహమని గుణత్రయ సామ్యావస్తు స్వరూపిణి అయిన మాయా తురీయ రూపిణియైన తనకు ఉపాధియే యని, రూపగుణ అవస్థా వివర్జితయైన పరబ్రహ్మ తత్త్వం తురీయాతీతమైన ఆమె నిజస్వరూపమని విశదీకరించింది.

ఆమెకు మాయా సంబంధంతో కూడిన సగుణ స్వరూపమొకటి. మాయా సంబంధం లేని నిర్గుణ స్వరూపమొకటి. ఇలా రూపద్వయముందని, ఆమే సర్వ జగాలను సృష్టించి పిపీలికాది బ్రహ్మ పర్యంతం ఆయా రూపాలలో ప్రవేశించి వారికి జ్ఞాన కర్మాది విశేషాలను ఆపాదించి సాత్త్విక, రాజస, తామసాది కర్మలలో ప్రవర్తింపచేయు సచ్చిదానంద మూర్తి యని చెప్పబడింది. ఇలా శ్రుతి, స్మృతి, పురాణాదులలో శ్రీ గాయత్రీ పరదేవతా మాహాత్మ్యము వర్ణింపబడింది.

సంవిన్మయీ రూపిణి, సూర్యమండలాంతవర్తిని, అంతర్యామిని అయిన ఆ పరదేవత సగుణ స్వరూపాన్ని అందరూ ధ్యానించడానికి, పూజించడానికి వీలుగా పంచముఖాలు గలదై, వరుసగా ముత్తెము, పగడము, బంగారము, నీలము, తెల్లని రంగుల ముఖములు గలదై ప్రతి ముఖములో మూడు నేత్రాలు, ప్రతి శిరస్సులో చంద్రవంక గల రత్నకిరీటము, పది చేతులలో వరుసగా కుడినుండి ఎడమ వరకు ఒక చేయి వరమిచ్చెడి ముద్ర, మరొకటి అభయమిచ్చెడి ముద్ర, అలాగే అంకుశం, కొరడా, కపాలం, గద, శంఖం, చక్రం, మిగిలిన రెండు చేతులలో కమలాలను ధరించి మహా వాక్యాది తత్త్వబోధక వర్ణములే తన స్వరూపంగా తన మూర్తిని ప్రసాదించింది.

గాయత్రీ మంత్రం అన్ని మంత్రాలలో కెల్లా ఉత్తమమైన మంత్రం. గాయత్రీ మంత్రం కన్నా గొప్ప మంత్రం ఋక్ – యజుః సామ వేదాలలో ఎక్కడా కానరాదు. ''గాయంతం త్రాయతే ఇతి గాయత్రి'' అనగా జపించే వారిని రక్షించేది కనుకనే గాయత్రి అని కొలువబడుతున్నది. మనకు బుద్ధిని, ధర్మాదులను గోచరింపచేసే బ్రహ్మ తేజః పుంజః స్వరూపమే గాయత్రి. ఉపాసకులకు త్వక్, చక్షుః, శ్రోత్ర, జిహ్వ, ఘ్రాణములచే జ్ఞానశక్తిని ప్రసాదించేది, శత్రు నాశన శక్తిని, దేహ, మనోబలాన్ని, తేజస్సును, వర్చస్సును ప్రసాదించి రక్షించే తల్లి శ్రీ గాయత్రీమాత.

'ద్వి' యనగా రెండు అని, 'జ' అనగా జన్మించడం అని అర్థము. తల్లి గర్భము నుండి భూమాత ఒడికి చేరడం ఒక జన్మ కాగా, 'ఉపనయనం'తో సంస్కృతుడై నియమబద్ధం, వైదిక కర్మ బద్ధమైన జీవన విధానానికి తెరతీసి, మరో జన్మనెత్తినవానిగా మనుగడ సాగిస్తాడు జీవి. వీరిని ద్విజులు అని పేర్కొందురు. 'ఉపనయనం' – ఉప + నయనం. 'ఉప' యనగా సమీపం అని అర్థము. 'నయనం' అనగా కన్ను అని అర్థము. అనగా వేదాధ్యయనానికి సమీపములో 'నయనం' ఉండటం. వేదాధ్యయనం చేసేందుకు ముందు ఉపనయనాన్ని చేసి యజ్ఞోపవీతాన్ని ధరింపచేయడం ఆచారంగా ఉండేది. 'యజ్ఞోపవీతం' అనే పదం యజ్ఞ – ఉపవీతం. అనే రెండు పదాల సమ్మేళనం. యజ్ఞం అంటే యాగం. ఉపవీతం అనగా దారము (లేక) నూలుపోగు యని అర్థము. దీనిని బట్టి యజ్ఞోపవీతం అంటే యాగకర్మ చేత పునీతమైన దారం అని అర్థం. వేదమాత గాయత్రీ మంత్రోపదేశంతో యజ్ఞోపవీతం గాయత్రీ మంత్రానికి ప్రతిరూపంగా భాసిల్లుతోంది. ఆనాటి నుండి సాధకుడు తన వంటి మీదున్న యజ్ఞోపవీతాన్ని పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తాడు. కాలక్రమంలో ''యదక్షరం పరబ్రహ్మ తత్సూత్ర మితి ధారయేత్'' యజ్ఞోపవీతాన్ని నాశరహితమైన పరబ్రహ్మ తత్వంగా భావించాలి. వేదాధ్యయనంతో విప్రునిగాను, బ్రహ్మజ్ఞానంతో బ్రహ్మతత్వాన్ని, సత్యాన్ని బ్రహ్మ నిత్యత్వాన్ని అనుభూతి లోకి తెచ్చుకుంటాడు.

పూర్వకాలంలో సాధారణంగా ఎనిమిది సంవత్సరాల వయస్సులో బాలురకు ఉపనయనం చేసి యజ్ఞోపవీతాన్ని ధరింపచేస్తారు. ఉపనయనం అయిన తర్వాత వేదాధ్యయనం ప్రారంభమవుతుంది. గురువు శిష్యునికి విద్య బోధించి జ్ఞాననేత్రం తెరుచుకునేలా చేస్తాడు. వైదిక సంస్కారాలలో పరిచయం ఉన్న ప్రతివారికీ సుపరిచితమైనది యజ్ఞోపవీతం. దీనినే తెలుగులో ''జంధ్యం'' అంటాం. ఇది చాలామంది (ద్విజుల) మెడలో వేలాడుతూ ఉంటుంది. కానీ అది అలా ఎందుకు వేలాడుతుందో తెలియదు. ఇలా మెడలో యజ్ఞోపవీతాలను వేసుకున్నవారు నిష్ఠతోను, కొందరు ఆచారం మీద మక్కువతోను, కొందరు ఇతరుల ముందు ప్రదర్శన కోసం, మరికొందరు అవసరార్థం ఉపయోగించే వారు కనబడతారు. యజ్ఞోపవీతాన్ని బ్రహ్మసూత్రం అని కూడా అంటారు. దాన్ని ఎందుకోసం ధరించాలో ధర్మశాస్త్రాలు ఇలా బోధిస్తున్నాయి.

**"సూచనాత్ బ్రహ్మతత్వ వేదతత్వ సూచనాత్**
**తత్సూత్ర ముపవీతత్వాత్ బ్రహ్మ సూత్ర మితి స్మృతమ్"**

బ్రహ్మ తత్వాన్ని సూచించడానికి, వేదతత్వాన్ని సూచించడానికి బ్రహ్మసూత్రాన్ని ధరించాలి.

**"యజ్ఞోపవీతం పరమం పవిత్రం ప్రజాపతేర్యత్సహజం పురస్తాత్**
**ఆయుష్యమగ్ర్యం ప్రతిముఞ్చ శుభ్రం యజ్ఞోపవీతం బలమస్తు తేజః"**

యజ్ఞోపవీతం పరమ పవిత్రమైంది. అది ప్రజాపతి యైన బ్రహ్మతో కలిసి పుట్టిందని పై మంత్రం ద్వారా విదితమవుతుంది. యజ్ఞోపవీతాన్ని నవతంతువులతో (దారపు పోగులతో) నిర్మించాలి. ఒక్కొక్క తంతువుకు ఒక్కొక్క దేవత ఉంటాడని శ్రుతుల కథనం. మొదటి తంతులో ఓంకారం, రెండవ తంతులో అగ్నిదేవుడు, మూడోతంతులో నాగదేవత, నాలుగవ తంతులో సోమదేవత, అయిదవ తంతులో పితృదేవతలు, ఆరవ తంతులో బ్రహ్మదేవుడు, ఏడవ తంతులో వాయుదేవుడు, ఎనిమిదవ తంతులో సూర్యుడు, తొమ్మిదో తంతులో మిగిలిన దేవతలందరూ ఉంటారు.

యజ్ఞోపవీతం కేవలం తుంతు సముదాయము మాత్రమే కాదని, అది తొంభై ఆరు విషయాలకు ప్రతీక అని తెలియుచున్నది. తిథులు 15, కాలాలు 3, మాసాలు 12 మొత్తం 96. అనగా యజ్ఞోపవీతాన్ని ధరించిన వారికి తిథులలోను, వారాలలోను, నక్షత్రలాలలోను, తత్వాలలోను, వేదాలలోను, గుణాలలోను,

కాలాలలోను, మాసాలలోను పవిత్రత ఏర్పడి అవన్నీ ధరించిన వారికి శుభ ఫలాలను కలిగిస్తాయని భావం. బ్రహ్మచారి ఒక యజ్ఞోపవీతాన్ని (ఒక ముడి) ధరించాలి. యజ్ఞోపవీతాన్ని ధరించే సమయంలో నిర్దిష్ట మంత్రాలను పఠించాలి.

యజ్ఞోపవీతాన్ని ధరించిన ప్రతి ఒక్కరూ సంధ్యావందనం చేయాలి. సంధ్యావందనం – 'సంధ్య' అనగా సంధిలో చేయదానికి యోగ్యమైనది సంధ్య. సంధ్యాకాలం అంటే పగలు – రాత్రి కలిసే కాలం. ఆ కాలంలో చేయబడే కర్మను సంధ్య అంటారు. సంధ్యాకాలములు మూడు. ప్రాతః సంధ్య, మాధ్యాహ్నిక సంధ్య, సాయం సంధ్య. బ్రాహ్మీ ముహూర్తంలో నక్షత్రాలుండగానే ప్రారంభించి సూర్యోదయంలో అర్ఘ్యమివ్వాలి. చక్కగా ఆసనం వేసుకుని, దాని మీద కూర్చుని నడుం, వీపు, కంఠం, శిరస్సు సమంగా ఉంచి, వంపు లేకుండా నిటారుగా కూర్చుని ఆచమనం చేయాలి. నిలబడి కాని, వంగి కాని ఆచమనం చేయకూడదు. గాయత్రీమంత్రాన్ని జపిస్తూ మూడు సార్లు అర్ఘ్యమివ్వాలి. అదేవిధంగా మాధ్యాహ్న సంధ్య , సాయంసంధ్య లొనరించాలి. అర్ఘ్యమివ్వాలి. సమయం మించిపోకుండా సరియైన సమయంలో సంధ్య వార్చాలి. సమయం దాటితే 108 పర్యాయములు గాయత్రీ జపం చేయాలి. సంధ్యావందనం బ్రాహ్మణులకు వంశపారంపర్యంగా సంపాదించి ఇచ్చిన నిక్షేపం. గాయత్రీ జపం ద్వారానే నిస్సంశయముగా ముక్తి నొందుతాడు. సర్వవేదాలను అధ్యయనం చేస్తే ఏ ఫలితం కలుగుతుందో, సూర్యభగవానుని స్తుతిస్తే, అర్ఘ్యమిస్తే అంతటి ఫలితం కలుగుతుంది. మంత్రంపై భక్తి, మంత్రాధిదేవతపై విశ్వాసం, మంత్రార్థంపై ఆసక్తి ఉండాలి. నిర్లక్ష్యము, అలక్ష్యము, అశ్రద్ధ, ఆదమరపు ఉండకూడదు. శుచిగా వేదమాత గాయత్రిని, ఆ తల్లి దివ్యశక్తిని సేవిస్తే సర్వఫలితాలు పొందుతారు.

**"సర్వేజనా సుఖినోభవంతు"**

# మీ ప్రశ్న – మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. శ్రీవేంకటేశ్వరస్వామికి ఏ పుష్పాలంటే ఇష్టం? ఇష్టసిద్ధికై మనం ఆయనను ఏ పూలతో పూజించాలి? – వంగల సరయు – బెంగుళూరు**

**జవాబు** – మంచి ప్రశ్న. శ్రీవేంకటేశ్వరునికైనా, మరే దేవునికైనా, దేవతకైనా వారికే చెందిన ప్రకృతిలో లభించే వాటికన్నా భక్తునికే చెందిన పూలంటేనే ఇష్టం. అలాంటివి 8 ఉన్నాయి.

**"అహింసా ప్రథమం పుష్పం పుష్ప మింద్రియ నిగ్రహః**
**సర్వభూత దయాపుష్పం, క్షమాపుష్పం విశేషతః**
**శాంతి పుష్పం తపః పుష్పం ధ్యాన పుష్పం తథైవచ**
**సత్య మష్ట పదం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్"**

అంటే ఏ దైవమైనా మననుండి కానుకగా ఆశించేది మనవైన వస్తువులే. పై శ్లోకంలో ఉన్న ఎనిమిది (8) పూలే ఆయనకిష్టమైన పుష్పాలు. అనగా అహింస, ఇంద్రియ నిగ్రహం, సర్వప్రాణుల పట్ల దయ, క్షమ (ఓర్పు), శాంతి, తపస్సు, ధ్యానం, సత్యనిష్ఠ – ఇవి దైవం మననుండి ఆశించేవి.

**2. సుందరకాండకి వాల్మీకి మహర్షి ఆ పేరెందుకు పెట్టడం జరిగింది? – సుభద్ర, నాచారం.**

జవాబు –వాల్మీకి మహర్షి రామాయణంలోని అన్ని కాండలకు ఆయా కాండలలోని విశేషాల ఆధారంగా నామకరణం చేశాడు. అయితే, ఒక్క సుందరకాండకి మాత్రం అలాకాక సుందరకాండ అని ఈ క్రింది కారణాల వల్ల నామకరణం చేశాడు.

**సుందరే "సుందరో" రామః సుందరే సుందరీ "కథా"**
**సుందరే సుందరీ "సీతా" సుందరే సుందరం "వనం"**
**సుందరే సుందరం "కావ్యం" సుందరే సుందరః "కపిః"**
**సుందరే సుందరం "మంత్రం" సుందరే కింన సుందరమ్?**

ఈ కాండలో ఉన్న రాముడు, కథ, సీతమ్మ, అశోకవనం, కావ్యం, కపి, మంత్రం అన్నీ అందమైనవే అయినందున ఈ కాండకి ఆ పేరు వచ్చింది.

**3. కృష్ణతత్వం వివరిస్తారా గురువుగారూ? – ఎం.శ్రీను–మెహిదీపట్నం, వి.కిషోర్ – ఆదిభట్ల**


జవాబు – తప్పకుండా. 1. అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లుండటం. 2. వినయం. 3. బురదలో తామరలా ఉండడం. 4. ధర్మపాలనం 5. తల్లిదండ్రుల సేవ 6. సామాన్య వ్యక్తులను, బాల్య మిత్రులను గౌరవించడం 7. నమ్మినవారికి సహాయ పడడం 8. కష్టాలలో ధీరత్వం 9. ఆధ్యాత్మికత 10. సాధారణ జీవనం 11. మానవ విలువల ఆచరణ 12. దుష్టశిక్షణ – శిష్టరక్షణ 13. జ్ఞాన గరిమ 14. అధికారానికి దూరం 15. అందరినీ ప్రేమించడం 16. గురుజన, సుజన, జ్ఞాన వృద్ధుల సేవ.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

## 315. దావాగ్ని బల సంహారిణే నమః

– దావాగ్నిని మ్రింగి గోవులను గోపబాలురను రక్షించినవాడు కృష్ణుడు.

ఈ నామము యొక్క వివరములకై "గో సంఘ రక్షకాయ నమః" అను 299 నామమును తెలిపిన వివరములను పరిశీలించుడు.

దావాగ్నిని (కార్చిచ్చును) మ్రింగి దానిని శమింప చేసిన గోవులను, గోపబాలురను రక్షించిన కృష్ణునిగా జన్మించిన విష్ణు దేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 316. ఫలాహారిణే నమః

– అడవిలో ఆవులను మేపుచు అచట దొరికిన పండ్లను కోసి భుజించిన వాడు కృష్ణుడు.

ఫలములను ఆహారముగ స్వీకరించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 317. గదాగ్రజాయ నమః

– రోహిణీ వసుదేవులకు జన్మించిన గదునకు అన్నయైన వాడు కృష్ణుడు. బలరాముని తమ్ముడు గదుడు.

వసుదేవునకు దేవకి కాకుండా ఏడుగురు భార్యలు కలరు. వారిలో రోహిణి ఒకరు. రోహిణికి ఆరుగురు పుత్రులు కలిగిరి. వారు బలరాముడు, గదుడు, సారణుడు, దుర్మదుడు, విపులుడు, కృతుడు.

గదుడు ద్రౌపదీ స్వయంవరములో పాల్గొన్నాడు. అర్జునుడు సుభద్రను వివాహమాడినపుడు ద్వారక నుండి ఇంద్రప్రస్థమునకు కట్నకానుకలను తీసుకొనివచ్చాడు. ధర్మరాజు చేసిన రాజసూయ యాగములో పాల్గొన్నాడు. సాళ్వరాజుల నుండి ద్వారకను రక్షించుటలో ప్రముఖ పాత్ర వహించినాడు. ధర్మరాజు చేసిన అశ్వమేధ యాగములో కృష్ణునితో పాటు పాల్గొన్నాడు. ద్వాపర యుగాంతములో యాదవులు ఒకరి నొకరు కొట్టుకొని మరణించిన వారిలో గదుడు ఒకడు.

గదాగ్రజుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 318. గోపాంగనా చేల చోరాయ నమః

– గోపస్త్రీల చీరలను దొంగిలించినవాడు కృష్ణుడు.

మార్గశిర మాసమున బృందావనము నందలి గోపకన్యలు కాత్యాయనీ (దుర్గాదేవి) వ్రతము చేయుచుండిరి. అపుడు వారు అరుణోదయ కాలమున యమునా నదిలో స్నానము చేసేవారు. గోపకన్యలు స్నానానంతరం కాత్యాయనీ దేవిని పూజించి నంద కుమారుడైన కృష్ణుని మాకు భర్తగా కూర్చుమని ప్రార్థించేవారు. ఒకనాడు వారు ఎప్పటి వలెనే యమునా నదికి వెళ్ళి విజన ప్రదేశమున తీరము నందు తమ వస్త్రములను వుంచినారు. కృష్ణుని కీర్తించుచు గోపకన్యలు నదిలో జలకము లాడుచుండిరి. సర్వజ్ఞుడైన కృష్ణుడు వారి కోరికలను గమనించి, వారికి వ్రత ఫలములను ప్రసాదించుటకు నిశ్చయించుకొన్నాడు.

ఓ దుర్గాదేవీ! నీకు మ్రొక్కెదము. దయతో మాకు కృష్ణుడు మగడు అగునట్లు చేయుము తల్లీ! అని ప్రార్థించేవారు గోపికలు.

ఆనాడు తన మిత్రులతో కూడి యమునా నదికి గోపకన్యలు విజన ప్రదేశమని నగ్నముగా స్నానము చేయుచున్న చోటికే వెళ్ళినాడు. మిత్రులను సద్దు చేయవద్దని వారించి మెల్లగా నదీ తీరమున గోపకన్యల వస్త్రములను తీసికొని, తీరమునందే గల కదంబ వృక్షము పైకి ఎక్కినాడు. అప్పుడు గోప బాలురు పగలబడి నవ్వుచుండగా కృష్ణుడు చిరునవ్వు నవ్వుచు గోపికలతో కన్యలారా! మీకు ఇష్టమైనచో ఇచటికి వచ్చి మీ మీ వస్త్రములను తీసికొనుడు. ఇప్పుడు మీరు కాత్యాయనీ వ్రతము ఆచరించి బడలి యున్నారు. కనుక మీలో ఒక్కరుగా గాని మీరు అందరు కలిసి గాని ఇచ్చటికి వచ్చి మీ వస్త్రమును తీసికొనుడు. కృష్ణుని పరిహాసపు మాటలకు గోపకన్యలు లోలోన మురిసిపోసాగిరి. అప్పుడు వారు ఒకరిని చూచి మరియొకరు నవ్వుకొనుచు బిడియముతో నీటినుండి బయటికి రాజాలకుండిరి. అప్పుడు కృష్ణుడు పదే పదే సరసోక్తులు పలుకుచుండగా వారి మనస్సులు కృష్ణుని మీదే ఆకర్షితములగుచుండెను.

అప్పుడు వారు కంఠముల వరకు నీళ్ళలో నిలబడి ఆ చన్నీటి బాధకు తాళ లేక వణుకుచు ముద్దు కృష్ణా నీవు నందగోపుని ముద్దుల కుమారుడవని మాకు తెలియును. నిన్ను వ్రజ వాసులందరూ మెచ్చుకొనుచున్నారు. ఇట్లు అన్యాయమునకు పాల్పడవద్దు. మేము చలితో వణికిపోవుచున్నాము. మా వస్త్రములను మాకు ఇమ్ము. కృష్ణా! నీవు ధర్మము తెలిసినవాడవు. మేము నీకు దాసీలము. నీ మాటను పాటించెదము. మా వస్త్రములను మాకు ఇచ్చి వేయుము. లేనిచో ఈ సంగతి నందరాజుకు చెప్పెదము అని దీనంగా ప్రార్థించారు అని పోతన వర్ణించాడు.

అంతట కృష్ణుడు కన్యలారా! మనోహరములైన మీ చిరునవ్వులు నన్ను సంతోష పెట్టినవి. నిజముగ మీరు నాకు దాసీలయినట్లయితే నా మాటలను మన్నింపుడు. వెంటనే మీరు ఇచటికి వచ్చి మీ మీ వస్త్రములను తీసుకొని వెళ్ళుడు. అంతట గోపకన్యలు ఉహుహూ అని చలికి వణుకుచు సిగ్గుతో మనసులు గట్టిపరచుకుని నీటినుండి వెలువడి చిగురుటాకు వలె కోమలములు, బంగారముతో నవరత్నములతో చేయబడిన కంకణముల కాంతితో ప్రకాశించుచున్న చేతులతో వారి మర్మాంగములను కప్పుకొని వరుసగా వచ్చి కృష్ణుని ముందు నిల్చున్నారు. అప్పుడు కృష్ణుడు వారిని చూచి ప్రసన్నుడై వారి వస్త్రములను భుజముపై పెట్టుకుని ముసి ముసి నవ్వులు నవ్వుచు గోప కన్యలారా! మీరు దీక్షగా ఒక నెల రోజులు నియమ నిష్ఠలతో కాత్యాయనీ వ్రతము చేసినారు. అందుకు మీరు ప్రశంసింప దగినవారు అయినారు. కాని నేడు మీరు నగ్నముగా జలకములాడుట ద్వారా జలాధి దేవత అయిన వరుణుని పట్లను, యమునా నది యెడలను అపరాధము చేసినారు. కనుక ఈ దోష పరిహారార్థము తలలపై చేతులు మొగిడ్చి నమస్కరింపుడు. పిదప మీ వస్త్రములను తీసుకొనుడు అని పలికినాడు. కృష్ణుని మాటలను వినిన పిమ్మట ఆ గోపకన్యలు నగ్నముగా పవిత్ర నదీ జలములలో స్నానము చేయుట వ్రతభంగమే అని గ్రహించినారు. ఆ దోష నివారణమునకై వారు సర్వకర్మలకు సాక్షి అయిన కృష్ణునకు చేతులెత్తి నమస్కరించినారు. దాసుల తప్పులు దండముతో సరిగదా! గోపకన్యలు నగ్నముగా నుండి తలలు వంచి నమస్కరించి నందులకు సంతుష్టుడై వారి వస్త్రములను వారికి ఇచ్చినాడు. వెంటనే వారు వస్త్రములు ధరించారు.

చీరలను దొంగిలించి సిగ్గులు విడిపించి ఎగతాళి చేసి అయినా మనకు నోములో కొరత లేకుండా మ్రొక్కించినాడని గోపకన్యలందరు కృష్ణుని కీర్తించారు.

అంత కృష్ణుడు గోపకన్యలారా! మీ మనస్సులోని కోరిక నాకు తెలియును. నన్ను పతిగా పొంది సేవించుటకై మీరు కాత్యాయనీ వ్రతమును చేసినారు. మీ కోరిక నెరవేరుతుంది. సంతుష్టితో మీ గృహములకు వెళ్ళండి అని చెప్పినాడు. కృష్ణుని మాటలకు గోపకన్యలు అత్యంత ఆనందముతో బృందావనమునకు వెళ్ళినారు.

గోపాంగనా చేల చోరుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.



## శుభప్రదం – మంగళప్రదం

# మంగళగౌరీ వ్రతం

: గొర్తి రాజరాజేశ్వరి

శ్లో|| "మాణిక్య ప్రతిమ ప్రభాం హిమనిభైస్తుంగైశ్చతుర్భిర్గజైః
హస్త గ్రాహిత రత్నకుంభ సవిలైరాసిచ్య మానాం ముదా
హస్తాబ్జైర్వదాన మంబుజయుగా భీతిర్ధధానాం హరేః
కాంతాం కాంక్షిత పారిజాత లితికాం వందే సరోజాసనాం"

సంవత్సరానికి పన్నెండు నెలలు. పన్నెండు మాసములలో ''ద్వాదశస్వపి మాసేషు శ్రావణోమేఽతి వల్లభః'' శ్రావణం నాకు అత్యంత ప్రీతిని కలిగించేది. ''ద్వాదశ స్వరూపి మాసేషు శ్రావణః శివరూపకః'' అని స్కాందపురాణంలో శివునిచే కొనియాడ బడటమే గాక శ్రావణమాసం శివరూపమేనని నిర్దేశింపబడింది.

శ్రవణా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం శ్రావణమాసం. శ్రవణా నక్షత్రం మహావిష్ణువు జన్మ నక్షత్రం. అందువల్ల మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనదీ మాసం. ఆధ్యాత్మికంగానూ, సామాజికంగానూ ప్రత్యేకతను సంతరించుకున్న మాసం శ్రావణమాసం. పరిపూర్ణమైన సుఖములను, సౌఖ్యములను ప్రసాదించు నోములను, వ్రతములను కలిగిన మాసం శ్రావణమాసం. మహర్షులు మానవాళికి ఆధ్యాత్మికతను, భక్తిభావమును పెంపొందింప చేయు నిమిత్తము వ్రతాలను, నోములను ప్రసాదించారు.

''అస్మిన్ మాసే కృతం యద్యత్తద నంతాయ కల్పతే''

శ్రావణ మాసంలో చేసిన పూజాది సత్కర్మలు అనంతమైన ఫలితాన్నిస్తాయి అని సాక్షాత్ ఈశ్వరునిచే శ్రావణమాస మహిమ కీర్తించబడింది. సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సు, సుఖసంతోషాల కోసం స్త్రీలు వ్రతాలు ఆచరించే మాసం శ్రావణమాసం. స్త్రీలకు అత్యంత పవిత్రమైంది. వైదిక సంస్కృతిలో ఈ మాసానికి గల ప్రత్యేకత ఎనలేనిది. ఈ మాసంలో ఈ పవిత్ర ప్రదేశంలో ఎన్నో నోములు, పూజలు, వ్రతాలు పెద్దలు ఏర్పరిచారు. అలాంటి వ్రతాలలో వరలక్ష్మీ వ్రతం ఒకటి. ఈ వరలక్ష్మీ వ్రతాన్ని శ్రావణమాసంలో వచ్చే శుక్రవారాలలో చేస్తారు. వంశాచారాన్ని బట్టి, ఆచార వ్యవహారాలను అనుసరించి ఈ నోము నోచుకుంటారు.

శ్రావణం – భర్తకు ప్రతిరూపమైన మాసం కనుక ఈ మాసం మహాలక్ష్మీదేవికి ఎంతో ఇష్టం. మంగళగౌరి... మాంగల్యానికి అధిదేవత గౌరీదేవి. నిత్య సుమంగళి. అఖిల జగత్తుకు పూజ్యురాలు. సంపదలకు నిలయమైన తల్లి. ఆమె దయకు పెన్నిధి. తన కరుణార్ద్ర వీక్షణాలతో సర్వమూ సమకూర్చగల శక్తి స్వరూపిణి శ్రీమహాలక్ష్మి. స్త్రీలు తమ మాంగల్యాన్ని పది కాలాలతో పాటు కాపాడమని కోరుకుంటారు.

"మంగం జనన మరణాదిరూపం సర్వణం భక్తానాం లాతి నాశయతి
సామోక్షప్రదా మంగళా ఇత్యుక్తతే"

జనన – మరణాలను మంగం అంటారు. గౌరీదేవి తనను

వేడినవారికి జనన మరణాల నుండి విముక్తిని కలిగిస్తుంది కాబట్టి 'మంగళ' అయిందని దుర్గా ప్రదీపమనే గ్రంథం వ్యాఖ్యానిస్తోంది. చండీ సప్తశతి కూడా "దేహి సౌభాగ్య మారోగ్యం దేహిమే పరమం సుఖం" అంటూ సౌభాగ్యాన్ని, ఆరోగ్యాన్ని, సంతోషాలను అందించే తల్లిగా గౌరిని వర్ణించారు. అంతటి మహిమోపేతమైన తల్లిని సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తూ, సకల సౌభాగ్యాలను ప్రసాదించమని వేడుతూ చేసేదే మంగళగౌరీవ్రతం. శ్రావణమాసంలో ప్రతి ఇంటా స్త్రీలు మంగళగౌరి, వరలక్ష్మీ వ్రతాలు జరుపుకుంటారు. ఈ రెండు వ్రతాలు సౌభాగ్యాన్ని, సుమంగళీత్వాన్ని కలిగిస్తాయని విశ్వసిస్తారు. పసుపుముద్దకు, కుంకుమ పెట్టి గౌరమ్మగా పూజిస్తారు. శ్రీశక్తి అంశావతారమే లక్ష్మి. నిరాకార శ్రీశక్తి సాకారమైనప్పుడు లక్ష్మిగా పూజలందుకుంటుంది.

చతుర్విధ పురుషార్థాలను అందించడానికి నాలుగు చేతులతో ఫాల్గుణమాసం ఉత్తరా నక్షత్రంలో నిండుపున్నమి శుక్రవారం నాడు అమ్మవారు చక్కదనాల కుప్పగా ఉద్భవించింది. అందుకే శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజుగా భావించి పూజ చేస్తారు ముత్తైదువలు. ఏటేటా శ్రావణమాసంలో ప్రతి శుక్రవారాన్ని విశేషమైన పండుగగా భావించి వరలక్ష్మీదేవికి పూజలూ, వ్రతాలూ జరుపుకుంటారు.

అందానికి, ఆకర్షణకు, సౌభాగ్యానికి, సౌజన్యానికి, సౌశీల్యానికి ఆటపట్టు లక్ష్మీదేవి. శ్రీహరి హృదయవాసిని. జగాలను బ్రోచే, కాపాడే మహా ఇల్లాలు. అష్టైశ్వర్యానికి నిలయమైన దేవత. అష్టరూపాలలో భక్తులను అనునిత్యం అనుగ్రహిస్తుంది. నిత్యకళ్యాణాలను ఇచ్చే భాగ్యదేవత. పద్మంలో కొలువుండే నిష్కళంక. సత్సంకల్పంతో అడిగిన ఏ కోరికనైనా అనుగ్రహించే తల్లి కనుక ఆమెకు వరలక్ష్మి అని పేరు. సంప్రదాయం ఉన్నా, లేకున్నా ప్రతి ముత్తైదువు తప్పనిసరిగా ఆచరించాల్సిన వ్రతమిది. జీవితకాలంతో పాటు ఉద్యాపన లేకుండా చేసుకోదగినది లక్ష్మీదేవి పూజ వరలక్ష్మీ వ్రతం. అనునిత్యం లక్ష్మీదేవిని పూజించినా, శ్రావణమాసంలో చేసే వరలక్ష్మీ వ్రతానికి విశేష ప్రాధాన్యత ఉంది. స్కాందపురాణం ఈ వ్రతాన్ని ఆచరించే సౌభాగ్యవతులను విష్ణుపత్ని తప్పనిసరిగా అనుగ్రహిస్తుందని ఉవాచ.

వరలక్ష్మీ వ్రతం నాడు తెల్లవారు ఝామున అనగా బ్రాహ్మీ ముహూర్తంలో లేచి కాలకృత్యములు తీర్చుకొని, తలంటుకొని, గోమయంతో పూజాగృహాన్ని, ఇంటిని శుభ్రం చేసి, మంటపాన్ని ఏర్పాటు చేసుకోవాలి. గడపలకు పసుపు రాసి, కుంకుమ పెట్టి, గుమ్మాలకు మామిడి తోరణాలను కట్టి, గృహానికి ముందు, లోపల రంగవల్లులను తీర్చిదిద్దుకోవాలి. మంటపంలో కొత్త వస్త్రమును పరచి, దానిపైన బియ్యం పోసి వాటిపైన తమలపాకులు వేసి, కలశాన్ని ఏర్పాటు చేసుకుని చేతిలో తమలపాకులు ఉంచుకుని ఆ కలశంపై కుడిచేతిని వెనుకకు తిప్పి ఉంచి "కలశస్య ముఖే విష్ణుః కంఠే రుద్ర సమాశ్రితా" అనే శ్లోకాన్ని చదువుతూ మామిడి ఆకులతో లేదా తమలపాకులతో కలశంలో నీటిని అటు ఇటూ తిప్పుతూ కలశంలోని జలాన్ని పూజాద్రవ్యంపై చల్లి తరువాత శిరస్సుపై చల్లుకోవాలి. పసుపుతో గణపతి ప్రతిమను తయారు చేసుకుని "శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే" అనే శ్లోకం చదువుతూ అక్షతలు, చందనం, కుంకుమ, పూలను చల్లుతూ అష్టోత్తరాలతో, శతనామాలతో పూజించి స్వామివారికి సమర్పించాలి. బెల్లం ముక్కను గణపతి ముందుపెట్టి ఆకుతో నీళ్ళు చల్లి ఉద్ధరిణెతో చూపిస్తూ "శ్రీమహాగణపతయే నమః గుడోపహారం సమర్పయామి" అంటూ నీళ్ళు చల్లి నివేదించాలి.

చేతిలో పూలు, అక్షతలు తీసుకుని "శ్రీవరలక్ష్మీ దేవతాయై నమః ప్రాణ ప్రతిష్ఠాపన ముహూర్త సుముహోర్తోస్తు స్థాపితాభవ సుముఖోభవ సుప్రసన్నోభవ" అని ప్రార్థిస్తూ అమ్మవారి పాదాల చెంత సమర్పించాలి. కలశంలోని నీటిని పువ్వులతో తీసుకుని అమ్మవారి పాదాలపై చల్లాలి.

"గంగాజలం మయానీతం మహాదేవశిరః స్థితం శుద్ధోదక స్నానమిదం గృహాణావిదు సోదరి శ్రీ వరలక్ష్మీ దేవతాయై నమః శుద్ధోదక స్నానం సమర్పయామి" అంటూ తమల పాకులతో అమ్మవారి ప్రతిమపై చల్లాలి. ముందుగా సిద్ధం చేసుకొనిన వివిధ రకాలైన పుష్పాలతో అష్టోత్తర శతనామాలతో పూజించాలి. పూజించేటప్పుడు..

**"సంపూర్ణ చంద్రవదనాం సర్వజ్ఞాం శివసుందరీం**
**వరాఽభయకరాంభోజాం పాశాంకుశ కరోజ్జ్వలాం**
**సావిత్రీం సదయాం దేవీం సర్వమంగళ దేవతాం**
**బాలాం నవోఢాం సంపూజ్యాం మంగళద్రవ్య వాసినీం**
**సర్వాలంకార సంపూర్ణాం భావయేత్ సర్వమంగళాం"**

పూర్ణచంద్రుని వంటి వదనంతో, పదహారేండ్ల ప్రాయంలో సర్వజ్ఞురాలై, నాలుగు చేతులతో క్రమంగా వరద అభయ ముద్రలు, పాశాంకుశాలు ధరించి సకల అలంకారాలతో శోభిల్లు అమ్మా నీకు నమస్కారం అంటూ పూజించాలి. "దశాంగం గుగ్గులోపేతం సుగంధం సుమనోహరం ధూపం దాస్యామితేదేవి వరలక్ష్మీ గృహాణతం వరలక్ష్మీ దేవతాయై నమః ధూపమాఘ్రాపయామి" అంటూ ధూపాన్ని చూపించాలి. అనంతరం రెండు చేతులతో దీపకాంతిని తీసుకుని "వరలక్ష్మీ దేవతాయై నమః దీపం దర్శయామి" అంటూ దీపకాంతిని అమ్మవారి ముఖానికి అద్దాలి.

ముందుగా తయారు చేసుకున్న తోరములను పళ్ళెములో ఉంచి, అమ్మవారి ముందు ఉంచి ఒక్కొక్క నామముతో ఒక్కో ముడిని పువ్వులతో కట్టి పూజించాలి. మంత్రపూరితమైన తోరాలను (పదహారు ముడులు కలిగిన) మగవారు కుడిచేతికి,

ఆడవారు ఎడమ చేతికి ''గుణైః షోడశభిర్యుక్తం దోరకం దక్షిణకరే, బధ్నామి దేవదేవేశి ప్రసాదం కురుమే వరం'' అని పఠిస్తూ కట్టుకోవాలి. గౌరీదేవిని ''జయ దేవీ నమస్తుభ్యం జయభక్త వరప్రదే, జయశంకర వామాంగే, జయమంగళ మంగళే'' అని నమస్కరించాలి. అట్లకాడకు గంధం రాసి, దానికో తోరం కట్టి జ్యోతుల మీద తిప్పుతూ కథ చదువుకోవాలి. కథ అయిన తర్వాత కత్తికి కాటుక లాగా పట్టి ఉన్న కాటుకను కళ్ళకద్దుకుని దానిమీద కొద్దిగా ఆవునెయ్యి వేయాలి. కాటుకను తాను కంటికి పెట్టుకుని ముత్తైదువలకు ఇవ్వాలి. ముత్తైదువుల కాళ్ళకు పసుపురాసి, కుంకుమతో పారాణి పెట్టి అక్షతలు, పూలతో పూజించాలి. వరలక్ష్మీదేవికి చీర, రవికె పెట్టి తమలపాకులు, వక్కలు, పళ్ళు, నానబెట్టిన శనగలను వాయనముగా ఇవ్వాలి. ''యేవం సంపూజ్య కళ్యాణీం వరలక్ష్మీం స్వశక్తితః దాతవ్యం ద్వాదశాపూపం వాయనం హి ద్విజాయతే ఇందిరా ప్రతిగృహ్ణాతు ఇందిరాయై దదాతిచ ఇందిరా తారకోభాం ఇందిరాయై నమో నమః'' అంటూ వాయనమివ్వాలి. శక్తిమేర బ్రాహ్మణులకు, ముత్తైదువులకు భోజనము పెట్టాలి. భూరి దక్షిణలతో తాంబూలమివ్వాలి. తాంబూలం తీసుకున్నవారు మన ఇంట శుభాలు కలగాలని ఆశీర్వదిస్తారు.

## వరలక్ష్మీవ్రత కథ :

కైలాసగిరిలో పరమేశ్వరుడు తన అనుచర గణములతో, మునిశ్రేష్ఠులతో కూడియుండగా పార్వతీదేవి అక్కడకు వచ్చింది. ''స్వామీ! స్త్రీలు సుఖసౌఖ్యాలను పొందడానికి, పరివార సమేతంగా ఆయురారోగ్యాలతో, పుత్ర పౌత్రాదులతో కళకళలాడుతూ ఉండాలంటే ఎటువంటి వ్రతాలను, నోములను ఆచరించాలో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను'' అన్నది. పరమేశ్వరుడు సమాధానమిస్తూ ''స్త్రీలకు సమస్త సుఖాలను ప్రసాదించు వ్రతం వరలక్ష్మీ వ్రతం. శ్రావణ పూర్ణిమకి ముందు వచ్చే శుక్రవారం నాడు ఈ వ్రతాన్ని ఆచరించాలి. వ్రతం పూర్తయ్యాక కథను వినాలి. వ్రతాన్ని ఆచరించిన వారి మనోభీష్టాలు నెరవేరుతాయి. ఆ కథను తెలియజేస్తాను'' అని పరమేశ్వరుడు వ్రతకథను వినిపించాడు.

పూర్వం 'కుండినం' అనే ఒక పట్టణం ఉండేది. ఆ పట్టణాన చారుమతి అనే ఒక బ్రాహ్మణ స్త్రీ ఉంది. ఆమె వేకువ ఝామునే లేచి స్నానమాచరించి, పుష్పాలను తెచ్చి భర్త పాదాలకు నమస్కరించి పూజలు చేసేది. అత్తమామలను తల్లితండ్రుల వలె చూసుకుంటూ ఉండేది. గృహకార్యాలన్నీ స్వయంగా తానే చూసుకునేది. చుట్టుప్రక్కల వారితో, బంధువులతో చనువుగా కలిసి మెలిసి ఉండేది. చారుమతి సద్గుణాలకు వరలక్ష్మీదేవి ప్రీతిచెంది ప్రసన్నురాలైంది. ఒకనాడు చారుమతి కలలో వరలక్ష్మీదేవి కనిపించి ఇలా అన్నది. ''చారుమతీ! నీ సత్ప్రవర్తనకు, సద్గుణాలకు ప్రసన్నురాలినయినాను. నీకు ఏదేని వరం ఇవ్వాలన్న సంకల్పం కలిగింది. శ్రావణ పూర్ణిమకు ముందువచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించు. నీ సమస్త కోరిలు నెరవేరుతాయి'' అన్నది. చారుమతి తెల్లవారగానే భర్త, అత్తమామలకు తన స్వప్న వృత్తాంతాన్ని వివరించింది. వారు సంతోషించి వ్రతాన్ని నియమ నిష్ఠలతో ఆచరించమని చెప్పారు. చుట్టుప్రక్కలవారు కూడా ఆమె స్వప్న వృత్తాంతము విని ఎంతో సంతోషించారు. అందరూ కలిసి వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడానికి సంకల్పించుకున్నారు. శ్రావణ శుక్రవారం రాగానే చారుమతి నియమముతో వరలక్ష్మీదేవిని పూజించింది. తొమ్మిది సూత్రములు గల, పదహారు ముడులు గల తోరాన్ని దక్షిణ హస్తానికి కట్టుకుంది. కథను విని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలను చేసి, ముత్తైదువలను పూజించి వారికి శనగలతో కూడిన వాయనాన్ని సమర్పించింది. కాటుకను తాను ధరించి, ముత్తైదువుల చేత ధరింపచేసింది. వ్రతం పూర్తవగానే బ్రాహ్మణులకు దక్షిణ తాంబూలములను ఇచ్చి సత్కరించింది. ప్రసాదాన్ని బంధుమిత్రులకు పెట్టి తానూ భుజించింది. అందరూ దేవిని స్తుతించారు. ఇహ లోకంలో సమస్త సుఖాలు అనుభవించిన తర్వాత పరలోకంలో శ్రీపురానికి చేరుకున్నారు చారుమతి దంపతులు.

**''పద్మాసనే పద్మకరే సర్వలోకైన పూజితే**
**నారాయణ ప్రియే దేవి సుప్రీతా భవసర్వదా''**

అనే శ్లోకంతో చారుమతీదేవి వరలక్ష్మిని పూజించి, ఆ దేవి అనుగ్రహాన్ని పొందింది. కనుక స్త్రీలందరూ ఈ శ్లోకంతోనే షోడశోపచార పూజ చేయడం ఉత్తమ ఫలితాలను ఇస్తుంది.

సర్వ జగత్తులకి కారణమైన పరాశక్తే లక్ష్మీదేవి. ఈ జగత్తంతా ఏ శక్తి చేత రక్షింపబడుతోందో, గోచరమవుతోందో ఆ శక్తి యైన మహాలక్ష్మిని మనసా, వాచా, కర్మణా అర్చించి సన్మంగళాలను పొందెదరు గాక!

**''రక్ష రక్ష జగన్మాతర్దేవి మంగళ చండికే**
**హారికే విపదారా శేర్హర్ష మంగళకాలికే**
**హర్ష మంగళ దక్షే చ హర్ష మంగళ దాయికే**
**శుభే మంగళ దక్షే చ శుభే మంగళ చండికే**
**--- మంగళే మంగళార్హేచ సర్వమంగళ మంగళే**
**సతాం మంగళదే దేవి సర్వేషాం మంగళాలయే**
**పూజ్యే మంగళవారేచ మంగళాభీష్ట దేవతే**
**పూజ్యే మంగళభూపస్య మనువంశస్య సంతతం**
**మంగళాధిష్ఠాతృదేవి మంగళానాం చ మంగళే**
**సంసార మంగళాధారే మోక్ష మంగళదాయిని**
**సారే చ మంగళా ధారే పారే చ సర్వకర్మణాం**
**ప్రతి మంగళవారే చ పూజ్యే హే మంగళప్రదే**
**పుత్రాన్ దేహి ధనం దేహి సౌభాగ్యం సర్వమంగళే**
**సౌమంగల్యం సుఖం జ్ఞానం దేహినే శివసుందరి''**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

ఇక మాట్లాడలేదు. లేచాడు. దర్భలు తెచ్చాడు. పరిచాడు. పడుకున్నాడు. ఏడుస్తున్నాడు.

చూశారు అంగదుణ్ణి. అందరి కళ్ళు చెమ్మగిల్లాయి. హనుమంతుని మాటలు పని చేయలేదు. అంగదుని మీద సానుభూతి పెరిగింది. జాలి కలిగింది. అందరూ సుగ్రీవుణ్ణి నిందించారు. వాలిని పొగిడారు. సముద్రం దగ్గరికి వెళ్ళారు. కాళ్ళు చేతులు కడిగారు. ఆచమనం చేశారు. దర్భలు పరిచారు. తూర్పుముఖంగా కూర్చున్నారు.


రామ వనవాసం, దశరథుని మరణం, దండకారణ్య ప్రవేశం, ఖరదూషణ సంహారం, సీతాపహరణం, జటాయు వధ, రాముడు వాలిని చంపడం, సుగ్రీవునిపై రాముని కోపం — అలా జరిగింది అంతా పరస్పరం చెప్పుకున్నారు. గొంతెత్తి ఏడ్చారు. ఆ ఏడుపులు కొండగుహల్లో మారుమోగాయి.

## సంపాతి

గద్దల రాజు సంపాతి. కొండ గుహలో ఉంటున్నాడు. అతడు జటాయువునికి అన్న. బలపరాక్రమవంతుడు. చిరంజీవి. ఉపకార స్వభావుడు. వానరుల ఏడుపులు విన్నాడు. బయటికి వచ్చాడు. చూశాడు వానరుల్ని. 'దైవం అనుకూలిస్తే అన్నీ సంప్రాప్తమవుతాయి. నాకు ఆహారం దొరకలేదు. చాలాకాలమైంది. ఇపుడు దైవం దయ తలచింది. వానరుల రూపంలో ఆహారం దొరికింది అనుకున్నాడు తనలో.

ఆ గద్ద మాటలు విన్నారు. “ఓ హనుమంతుడా! ఆ పక్షిని చూడు. ఆహారం కోసం ఆశపడుతోంది. సాక్షాత్ యముడు గద్ద రూపంలో వచ్చాడు. మనం రాముని పని చేయలేదు. సుగ్రీవాజ్ఞ పాటించలేదు. సీతాదేవి కోసం జటాయువు చనిపోయాడు. పశువులు పక్షులు ప్రాణాలకి తెగిస్తున్నాయి. రామునికి సాయపడుతున్నాయి. జటాయువులా ప్రాణత్యాగం చేద్దాం. రామ కార్యంలో ఎంతో శ్రమపడ్డాం. వెదకని చోటు లేదు. మైథిలి జాడ కనుగొనలేకపోయాం. రావణునితో యుద్ధం చేశాడు. చనిపోయాడు. పరమపదం చేరాడు. నిజంగా అదృష్టవంతుడు జటాయువు. సీతారాములు అడవుల పాలు కావడం, ఒక బాణానికి వాలి చనిపోవడం ఇదంతా కైకేయి వర ప్రభావం — ఈ దురవస్థకి కారణం” అలా జరిగిందంతా చెప్పుకున్నారు. దుఃఖించారు.

విన్నాడు సంపాతి. వానరుల్ని చూశాడు. ప్రాయోపవేశ దీక్షలో ఉన్నారు. మనసు చలించింది. అంటున్నాడు. “ఎవడ్రా నీవు? నా సోదరుడు జటాయువు. వాడు నా ప్రాణం కన్నా మిన్న. నా తమ్మునికి రాక్షసునితో యుద్ధమా? ఎందుకు జరిగింది? ఎపుడు



జరిగింది? రామునితో స్నేహం ఎలా కుదిరింది? చాలాకాలానికి నా తమ్ముని పేరు విన్నాను. మహాత్ములారా! నా రెండు రెక్కలు కాలిపోయాయి. ఎగురలేను. మీ వద్దకి రాలేను. ఇలా రండి. దించండి – స్వరంలో దైన్యం గోచరించింది.

విన్నారు వానరులు. సంపాతి మాటలు నమ్మలేదు. తమని తింటుందనుకున్నారు. ఎలాగూ చస్తాం. సంపాతి తింటే తిననీ. కృతార్థులమవుతాం. మన సంకల్పం సిద్ధిస్తుందనుకున్నారు. వెళ్ళాడు అంగదుడు. పర్వతగుహ చేరారు. సంపాతిని ఎత్తుకున్నారు. దించారు. జటాయువుకు సీతా రామలక్ష్మణుల పరిచయం – రావణుడు సీతనెత్తుకుపోవడం – జటాయువు అడ్డుపడడం – పోరాడటం – రావణుడు చంపడం – జరిగింది చెప్పాడు అంగదుడు.

## సంపాతి వృత్తాంతం

అనూరుడు సూర్యుని రథసారథి. అతనికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు సంపాతి. చిన్నవాడు జటాయువు. ఇద్దరూ బలవంతులు. చెబుతున్నాడు సంపాతి. ''ఒకరోజు పందెం వేసుకున్నాం. ఆకాశంలోకి ఎగిరాం. అది మధ్యాహ్నం. సూర్యమండలం సమీపించాం. వేడికి తట్టుకోలేకపోయాడు తమ్ముడు. విలవిల్లాడాడు. నేను చూశాను. నా రెక్కలు కప్పాను. అయితే నా రెక్కలు కాలిపోయాయి. ఈ వింధ్య పర్వతాల్లో పడ్డాను. జటాయువు ఏమైనాడో తెలియదు. ఆరు రోజులు స్పృహ లేదు. ఏడో రోజు తెలివిలోకి వచ్చాను. దగ్గరలో ఆశ్రమం కనబడింది. అది నిశాకర మహర్షిదని తెలిసింది. నా దీనస్థితి చూశారాయన. దూరదృష్టితో చూశాడు. ''నీకు మళ్ళీ రెక్కలు వస్తాయి. ఇపుడే కాదు. సీతాదేవిని వెతుకుతూ వస్తారు. వారు వానరులు. రామదూతలు. రామునికి మేలు చేయాలి నీవు. అపుడు నీకు రెక్కలు వస్తాయి'' అన్నాడు.

''ఎంతోకాలం ఎదురు చూశాను. నాకు ఒక కొడుకు ఉన్నాడు. వాని పేరు సుపార్శ్వుడు. ఆహారం తెచ్చిపెట్టేవాడు. ఒకనాడు రాలేదు. చీకటి పడింది. వట్టి చేతులతో వచ్చాడు. అపుడు వాడు చెప్పాడు. ''నేను ఆహారం కోసం చూస్తున్నాను. ఒక స్త్రీని చంకలో పెట్టుకున్నాడు. వాడు నల్లగా ఉన్నాడు. వాళ్ళని తినాలనుకున్నాను. అడ్డగించాను. దారి ఇవ్వాలని బతిమలాడాడు. ఇచ్చాను. వాడు వెళ్ళిపోయాడు. ఆకాశంలో సంచరించే సిద్ధులు, చారణులు, మహర్షులు చూశారు. నా దగ్గరికి వచ్చారు. వాడికి దారి ఇచ్చి మంచిపని చేశావు. లేకపోతే వాడు నిన్ను చంపేసేవాడు. వాడు రాక్షసుడు రావణుడు. రాముని భార్య సీత. ఆమెనపహరించాడు. విన్నాను నేను. నాకు రెక్కలు త్వరలో వస్తాయి. సంతోషించాను''.

ఆ కథ విన్నారు వానరులు. ''ఆ రాక్షసుని నివాసమెక్కడ? తెలిస్తే చెప్పవా – అడిగాడు అంగదుడు. చెప్పసాగాడు సంపాతి. ''రావణుడు విశ్రవసువు కుమారుడు. కుబేరుని తమ్ముడు. వాడు లంకాపట్టణములో ఉంటాడు. అదే వాడి నివాసం. అది సముద్ర మధ్యంలో ఉంది. ఇక్కడికి నూరు యోజనాల దూరం. ఆ లంకలో సీతాదేవిని చూడవచ్చు. రాక్షసాంగనలు కాపలాగా ఉన్నారామెకు. దీనురాలై ఉంది. మీరు సాహసం చేయండి. లంక చేరండి. నేను దివ్యజ్ఞానంతో చెబుతున్నాను.

ఆకాశ మార్గంలో పోవడానికి ఏడు వీధులున్నాయి. పిచ్చుకలు ఎగిరేది మొదటి వీధి. కాకులు ఇతర పక్షులు పోతాయి అది రెండవ వీధి. లకుముకి పిట్టలు, నీటికాకులు మూడోవీధిలో ఎగురుతాయి. డేగలు నాల్గోవీధిలో పోతాయి. అయిదో వీధిలో గద్దజాతి పక్షులు ఎగురుతాయి. హంసలు ఆరో వీధిలో పోతాయి. ఏడో వీధిలో గరుత్మంతుడు, అరుణుడు ఎగురుతారు. అరుణి వంశంలోని వాళ్ళం మేం. మాకు దేవతాశక్తి ఉంది. నేత్రపాటవం, బలం ఉన్నాయి. నూరు యోజనాల లోపల వరకు చూడగలం. అతి సూక్ష్మమైన పదార్థాల్ని కూడా చూడగలం. రావణుడు చేసింది తప్పు. వాణ్ణి రాముడు చంపేస్తాడు. నా తమ్ముణ్ణి చంపింది ఆ రాక్షసుడు కదా. వాడు చస్తే నా కసి తీరుతుంది. ఉపాయం ఆలోచించండి. సముద్రం దాటండి. వైదేహిని చూడగలరు. నన్ను దయచేసి సముద్రం ఒడ్డుకు చేర్చండి. నా తమ్మునికి జలతర్పణాలు వదలాలి''.

సంపాతిని సముద్రతీరం చేర్చారు. స్నానం చేశాడు. జలతర్పణం విడిచాడు. మళ్ళీ తీసుకువచ్చారు. రావణుని ఉనికి తెలిసింది. అమితానంద భరితులైనారు వానరులు. అందరూ చూస్తుండగా సంపాతికి రెక్కలు వచ్చాయి. సంతోషించాడు. పూర్వపు బలం వచ్చింది. పరాక్రమం వచ్చింది. సీతాదేవిని మీరు

చూస్తారు. నాకు రెక్కలు రావడమే అందుకు నిదర్శనం అన్నాడు. ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

## వానరుల శక్తులు

సంపాతి వెళ్ళిపోయాడు. సముద్రం ఎలా దాటాలి? – వానరులు గుమిగూడారు. సింహనాదాలు చేశారు. సముద్రతీరం చేరుకున్నారు. చూశారు మహాసముద్రాన్ని. ఒకచోట అలలు ఆకాశం ఎత్తు లేస్తున్నాయి. మరోచోట కొంచెం తక్కువ ఉన్నాయి. ఒకచోట పర్వత ప్రమాణంలో ఎగసిపడుతున్నాయి. ఒకచోట అలల కదలిక లేదు. నిద్రపోతున్నట్లుంది సముద్రం. బాగా చూశారు వానరులు. శరీరాలు గగుర్పొడిచాయి. దిగులు పడ్డారు. సముద్రం ఆకాశంలా అపారంగా ఉంది. ఎలా దాటాలి? భయభ్రాంతులైనారు. చూశాడు అంగదుడు. అంటున్నాడు.

**విషాదోయం ప్రసహతే విక్రమే పర్యుపస్థితే ।**
**తేజసా తస్యహీనస్య పురుషార్థోన సిద్ధ్యతి ॥**
**న విషాదే మనః కార్యం విషాదో దోష వత్తమః ।**
**విషాదో హన్తి పురుషం బాలం క్రుదధ ఇవోరగః ॥**

"మనసు విషాదాన్ని చెందరాదు. ఆ విషాదం చాలా దోషం కలది. విషాదానికి గురైతే పగపట్టిన పాము బాలుని కాటు వేసినట్లు – మనిషిని చంపేస్తుంది. విక్రమం చూపాల్సిన చోట విషాదం కల్గితే వానిలో తేజస్సు క్షీణిస్తుంది. అసలు లేకుండా పోతుంది. సాధించాల్సిన పురుషార్థం సాధించలేదు". తర్వాత ఎవ్వరూ మాట్లాడలేదు.

ఆ రాత్రి గడిచింది. తెల్లవారింది. వానరులందరూ ఒకచోట చేరారు. కర్తవ్యం గురించి ఆలోచనలో పడ్డారు. వానరసేనని అదుపులో పెట్టేవారు ఇద్దరు. ఒకడు అంగదుడు మరొకడు హనుమంతుడు. వారికి తప్ప వేరొకరికి సైన్యం లొంగదు. అందరినీ చూశాడు అంగదుడు. "ఇపుడు మనలో సముద్రాన్ని దాటేదెవరు? రామకార్యం నెరవేర్చాలి. సుగ్రీవుని మెప్పు పొందాలి. అంటే నూరు యోజనాలు దాటాలి. సీతాదేవిని దర్శించాలి. క్షేమంగా తిరిగి రావాలి. కిష్కింధ చేరాలి" అన్నాడు. మళ్ళీ అందరిలో మౌనం. నిశ్శబ్దం. మళ్ళీ అంటున్నాడు అంగదుడు. "అందరూ బలవంతులు. దృఢ పరాక్రములు. ఉత్తమ వంశ సంజాతులు. మీరు వెనుకంజ వేయరాదు. మీ మౌనం నాకు నచ్చలేదు. మీలో ఎవరెవరు ఎంత దూరం పోగలరో చెప్పండి".

నేను 10 యోజనాలు ఎగరగలనన్నాడు గజుడు. గవాక్షుడు – నేను 30 యోజనాలన్నాడు. గంధమాదనుడు 40 యోజనాలన్నాడు. మైందుడు 60 – ద్వివిదుడు 70 యోజనాలు ఎగరగలమన్నరు. 80 యోజనాలన్నాడు సుషేణుడు. ఎవ్వరూ నూరు యోజనాలని చెప్పలేదు. జాంబవంతుడంటున్నాడు. పూర్వం వామనుడు 3 అడుగులు కావాలన్నాడు. బలిచక్రవర్తి ఇస్తానన్నాడు. విష్ణుమూర్తి త్రివిక్రమరూపం దాల్చాడు. అపుడు ఆ స్వామితో పాటు ఈ భూమండలాన్ని ప్రదక్షిణం చేశాను. ఇపుడు ముసలివాణ్ణయ్యాను. 90 యోజనాలు ఎగరగలను. సందేహం లేదు".

"నేను నూరు యోజనాలు ఎగరగలను. తిరిగి వస్తానో లేదో చెప్పలేను" అన్నాడు అంగదుడు.

వెంటనే అందుకున్నాడు జాంబవంతుడు. "నాయనా అంగదా! నీవు వానర శ్రేష్ఠుడవు. నూరు కాదు వెయ్యి యోజనాలు ఎగురగలవు. తిరిగి రాగలవు. అయితే నీవు మాకు నాయకుడవు. మా స్వామివి. నీవు పోరాదు. భృత్యుల్ని పంపాలి. అది రాజధర్మం. నీవు చెట్టు చేమ లాంటి వాడివి. కార్యములన్నీ కాపాడుకోవాలి. అది మా ధర్మం. మా కర్తవ్యం. నీవు లేకపోతే మేమంతా ఉండి లాభం లేదు.

విన్నాడు వాలి పుత్రుడు. "మనలో ఒక్కడూ సముద్రం దాటకపోతే ఇక మనకు ప్రాయోపవేశం తప్పదు. జాంబవంతా! పెద్దవాడివి. అన్నీ తెలిసినవాడివి. పని చెడరాదు. ఉపాయం చెప్పు. అందరినీ కాపాడు" అన్నాడు అంగదుడు.

బలానికి పరాక్రమానికి పెట్టింది పేరు హనుమంతుడు. అతని కోసం చూశాడు జాంబవంతుడు. ఏకాంత ప్రదేశంలో కూర్చుని ఉన్నాడు. గమనించాడు. వాయుపుత్రుణ్ణి ప్రోత్సహించాలి. అది జాంబవంతుని నిశ్చయం.

కృతయుగంలో వామనావతారం. అపుడున్నాడు జాంబవంతుడు. త్రేతాయుగంలో రామావతారం. అపుడున్నాడతడు. ద్వాపరం కృష్ణావతారం అపుడూ ఉన్నాడు. శ్యమంతకమణి విషయంగా కృష్ణునితో ద్వంద్వ యుద్ధం చేశాడు జాంబవంతుడు. అంత ఆయుర్దాయం ఎలా ఉంటుంది? అంటే బ్రహ్మ ఆవలింత వల్ల పుట్టినవాడు జాంబవంతుడు. దైవశక్తి వల్ల దీర్ఘాయుష్మంతుడు కాగలడు. ఇది ఒక జవాబు.

ఒక్కో యుగానికి మానవుని ఆయువు నిర్ణయించారు పెద్దలు. అది ఈ విధంగా ఉంటుంది.

మానవ ఆయుర్దాయం కృతయుగంలో 800 సంవత్సరాలు. త్రేతాయుగంలో 400 సంవత్సరాలు. ద్వాపరంలో 200 సంవత్సరాలు. కలియుగంలో నూరేళ్ళ ఆయుర్దాయం. మూడు యుగాల కాలం కలిపితే 1400 సంవత్సరాలు అవుతుంది. బ్రహ్మపుత్రుడు కనుక అంతకాలం ఉండగలడు. ఇది మరో అన్వయం.

## హనుమంతుని జన్మ వృత్తాంతం

అంటున్నాడు జాంబవంతుడు. మారుతీ! నీవు సాటిలేని వీరుడవు. సర్వ శాస్త్ర విశారదుడవు. ఎందుకు ఇలా వంటరిగా ఉన్నావు? మౌనంగా ఉన్నావు? నీ బలపరాక్రమాలు అసామాన్యం. రామలక్ష్మణులకు తీసిపోవు. గరుత్మంతుడు మహావేగ గమనుడు. అతని రెక్కలబలం చాలా గొప్పది. నీ భుజబలం అంతటిదే.




పరాక్రమంలో వేగంలో గరుత్మంతునితో సమానుడవు. నీ బుద్ధిబలం నీ తేజస్సు వేరెవరిలో లేవు. నిన్ను నీవు తెల్సుకో లేకున్నావు. నీ కథ చెబుతాను విను.

పుంజకస్థల ఒక అప్సరస. శాపం పొందింది. కుంజరుడు అనే వానరుడు ఉన్నాడు. వాని కూతురిగా పుట్టింది. ఆమె పేరు అంజన. కామరూపిణి. నీ తండ్రి కేసరి. వానికి భార్య అయింది. అంజన నీకు తల్లి. ఒకనాడు ఆమె మానవాంగన రూపం ధరించింది. చక్కగా అలంకరించుకుంది. పర్వతం పైకి చేరింది. విహరిస్తోంది. వాయుదేవుడు చూశాడు. మోహించాడు. గాఢంగా కౌగలించుకున్నాడు. గమనించిందామె. ''ఎవరా దుర్మార్గుడు? నా ఏకపత్నీవ్రతం భంగం చేస్తున్నాడు – అరిచింది. కోపించింది. నీ పాతివ్రత్యానికి భంగం రాదు. నీకు ఒక మహాపరాక్రమవంతుడు, బుద్ధిమంతుడు, నవ వ్యాకరణ పండితుడు, నాతో సమానమైన వేగం కలవాడు, బహు సమర్థుడు పుత్రునిగా పుడతాడు. అది నా మానసిక తలంపు. అంతే కాదు అది నా వరం అన్నాడు వాయుదేవుడు. ఆ కారణంగా పర్వతగుహలో జన్మించావు. నీవు పుట్టగానే సూర్యోదయమైంది. సూర్యబింబం చూశావు. పండు అనుకున్నావు. పట్టుకోవాలని ఎగిరావు. ఆకాశంలో మూడు వందల యోజనాలు పోయావు. సూర్యతేజం నిన్ను బాధించలేదు. చూశాడు దేవేంద్రుడు. కోపగించుకున్నాడు. వజ్రాయుధం విసిరాడు. నీకు దెబ్బ తగిలింది. ఒక పర్వతశిఖరం మీద పడ్డావు. నీ ఎడమ దవడ సొట్ట పోయింది. దాంతో హనుమాన్ అని పేరు వచ్చింది (హనుమ కల్గినవాడు హనుమంతుడు).

ఇంద్రుడు కొట్టాడు నిన్ను. వాయుదేవుడు కోపించాడు. ముల్లోకాల్లో గాలిని బంధించాడు. లోకాలు కలత చెందాయి. దేవతలు సంభ్రాతులైనారు. సర్వప్రాణికోటికి దిక్కు తోచలేదు. ఊపిరాడలేదు. లోకపాలురు పరుగులు తీశారు. వాయుదేవుని చేరారు. బతిమలాడారు. అనుగ్రహించాడు నీ తండ్రి. ఏ శస్త్రం కాని అస్త్రం కాని నిన్ను బాధించదు. బంధించదు. అది బ్రహ్మదేవుని వరం. నా వజ్రాయుధం దెబ్బ తగిలినా నిన్ను ఏమీ చేయదు. అది ఇంద్రుని వరం. అంతేకాదు నీకు స్వచ్ఛంద మరకణం ప్రసాదిస్తున్నాను అన్నాడు దేవేంద్రుడు. వాయుదేవుడు ప్రసన్నుడైనాడు. హనుమా నీవు పరమ శక్తిమంతుడవు అయ్యావు'' అన్నాడు.

''మారుతీ! నిన్ను ఎంత ఎలా పొగడగలను. ఒక మహత్కార్యం ఉంది. అది లోక కళ్యాణ దాయకం అవుతుంది. అది నీవే చేయాలి. నీవే సమర్థుడవు. మా అందరి ప్రాణరక్షకుడవు.

**"ఉత్తిష్ఠ హరిశార్దూల లంఘయస్వ మహార్ణవమ్ |**
**విక్రమస్వ మహావేగో విష్ణుస్త్రీన్ విక్రమానివ" ||**

''వానరోత్తమా! లే. ఈ మహా సముద్రాన్ని లంఘించు. మహావిష్ణువులా మహావేగంతో విజృంభించు''.

''నాయనా! మహావిష్ణువు త్రివిక్రమరూపం దాల్చినపుడు నేను ఈ భూమండలాన్ని 21 సార్లు ప్రదక్షిణం చేశాను. క్షీరసాగర మథన సమయంలో – దేవతల ఆదేశం ప్రకారం – అనేక దివ్యౌషధాలు తెచ్చాను. పాల సముద్రంలో వేశాను. అపుడు నాకు ఆగమన శక్తి ఉండేది. ఇపుడు ముసలివాణ్ణయ్యాను. ఆ శక్తి లేదు. ఈ కాలంలో నీవు ఒక్కడివే ఉన్నావు. సమస్త శక్తులున్నవాడివి. నీవు సముద్రాన్ని దాటగలవు. మరొకరి చేతకాదు. ఈ వానర సమూహం నీ పరాక్రమాన్ని చూడాలని ఉంది. ఓ వానర శ్రేష్ఠా! సముద్రాన్ని లంఘించు''.

విన్నాడు హనుమంతుడు. తన శక్తి ఎంతో తెలిసింది. దేహాన్ని పెంచాడు. ఆ ఆకారాన్ని చూశారు వానర వీరులు. హర్ష పులకితులైనారు.

## మహాశక్తిమంతుడు

సముద్ర లంఘనానికి సిద్ధపడ్డాడు హనుమంతుడు. దేహాన్ని పెంచాడు. అతని అద్భుతరూపం చూశారు వానరులు. వాళ్ళ దిగులు ఎగిరిపోయింది. సంతోషం పొంగింది. సింహనాదాలు చేశారు. తోక ఆడించాడు మారుతి. ఇంకా పెంచాడు దేహాన్ని. శ్రీమన్నారాయణుడు త్రివిక్రమరూపుడైనట్లు వాయుపుత్రుడు పెరిగాడు. మధ్యాహ్నపు సూర్యునిలా ఉన్నాడు. జ్వలిస్తున్న అగ్నిహోత్రంలా ఉన్నాడు. చూశారు వానరులు. సంభ్రమాశ్చర్యపరులైనారు. పరమానంద భరితులైనారు.

వానర వృద్ధులకు నమస్కరించాడు ఆంజనేయుడు. వానరసేనని చూశాడు. అంటున్నాడు. ''వాయుదేవుని శక్తి అపారమైంది. హద్దు లేనిది. అతనికి అగ్నిదేవుడు మిత్రుడు. గరుత్మంతుడు వేగగమనుడు. అంతటి వాయుపుత్రుణ్ణి నేను. ఎగరటంలో నాకెవరూ సాటి రారు. మహా మేరుపర్వతాన్ని వెయ్యిసార్లు తిరిగి రాగలను. సముద్రాన్ని అల్లకల్లోలం చేయగలను. ఈ భూమండలాన్ని సముద్రంలో ముంచేయగలను. నా వేగానికి సముద్ర జలాలు పైకి లేస్తాయి. అందులోని జలచరాల్ని ఆకాశంలో చూడగలరు. గగన వీధిలో గరుత్మంతుడు తిరుగుతుంటే అతణ్ణి వెయ్యిసార్లు చుట్టి రాగలను. అంతటి శక్తిమంతుణ్ణి నేను''.

**(సశేషం)**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

**గత సంచిక తరువాయి**

## ఘోణతీర్థ స్నానంతో వసిష్ఠాదుల పాపవిముక్తి :

వసిష్ఠమహర్షి ఆ బ్రాహ్మణునితో కూడ వేంకటాచలానికి బయలుదేరి దారిలో సువర్ణముఖరీతీరంలో ఉన్న, శుకమహర్షికి వరమిచ్చిన శ్రీకృష్ణుని దర్శించి ఆయనకు నమస్కరించి, ఆ తరువాత వేంకటాద్రి పాదమూలంలో ఉన్న సకల పాపహరమైన కపిల తీర్థంలో స్నానం చేసి వేంకటాచలాన్నధిరోహించి స్వామి పుష్కరిణి వద్దకు వెళ్ళారు. దానిలో స్నానం చేసి భూవరాహ స్వామికి నమస్కరించి, పాపశాంతికై ఆయనను ప్రార్థించారు. ఆ పుష్కరిణికి దక్షిణ తీరంలో ఉన్న లక్ష్మీపతికి నమస్కరించి ఆయనను ఈ విధంగా చక్కగా స్తుతించారు.

**జయ ధాతృగిరా నిదర్శితో జయ లోకావనదక్ష రక్షమామ్ ।**
**జయ శంఖణపూజితేహ మాం ద్విజమేనం చ పునీహికేశవ ॥**

**–బ్రహ్మోత్తర ఖండం. అ. 50. శ్లో. 47.**

లోకాలనుద్ధరించుటకై బ్రహ్మదేవుని ప్రార్థన మేరకు వెంకటాద్రిలో వేంచేసిన ఓ శ్రీనివాసా ! నీకు జయమగు గాక ! సర్వలోక సంరక్షణదక్షా! నన్ను రక్షించు ! శంఖమహారాజు పూజలుగైకొన్న ఓ ప్రభూ ! నీవు నన్ను పవిత్రుని చేయి. ఓ వేంకటనాయకా ! శ్రీధరా ! నీవు నివసిస్తున్న వేంకటాద్రిలోని మహత్తరమైన ఘోణ తీర్థంలో స్నానమాచరించుటకై బ్రహ్మదేవుని ఆజ్ఞచే ఇక్కడకు వచ్చాను. స్వామీ ! నాకు ఫలాన్ని అనుగ్రహించండి అని ప్రార్థించి ఉత్తర దిక్కున ఉన్న పాపనాశన తీర్థంలో సర్వాబద్ధునితో పాటు స్నానం చేసి ఘోణతీర్థానికి వెళ్ళారు. ఏకాదశినాడు ఆ తీర్థానికి వెళ్ళి అక్కడ ఐదురాత్రులు ఉన్నారు. ఐదవ రోజైన ఫాల్గుణ పౌర్ణమినాడు మధ్యాహ్న సమయంలో అక్కడకు ఋషులు, దేవతలు, గంధర్వులు, కిన్నరులు వచ్చారు. వారందరితో పాటు సర్వాబద్ధునితో కూడ వసిష్ఠమహర్షి తుంబురు తీర్థంలో శాస్త్ర విధిననుసరించి సంకల్పం చేసి స్నానమాచరించాడు. ఆ తరువాత దేవతలకు, ఋషులకు తర్పణాలు ఆచరించాడు. తరువాత ఆ విప్రునితో పాటు కూర్చొని యథావిధిగా మంత్ర జపం చేశాడు. ఆ జపం చివరలో శ్రీహరిని ధ్యానిస్తూ ఆ మహర్షి సమాధిస్థితిని పొందాడు.

అక్కడి వారంతా ఆ తీర్థంలో స్నానం చేసి తమ తమ అనుష్ఠానములు చేసుకొంటూ ఉన్నారు. ఇంతలో జగత్ప్రభువైన వేంకటేశ్వరుడు పీతాంబరధారియై గరుడ వాహనాన్నధిరోహించి లక్ష్మీదేవితో కూడి ఆ మహర్షి ఎదుట సాక్షాత్కరించాడు. ఆయన ముఖపద్మం ప్రసన్నంగా ప్రకాశిస్తున్నది. ఆయన సర్వప్రాణుల యందు దయ గలవాడై, ఆ తీర్థంలో స్నానం చేయడానికి వచ్చిన వారందరిపై కరుణా కటాక్షములు ప్రసరింపజేశాడు. సనక సనందనాది యోగులు, విష్వక్సేనులు, ఆదిశేషునితో కూడి ఆయనను సేవిస్తున్నారు. అటువంటి వేంకటేశ్వరుడు వసిష్ఠునితో యిలా అన్నాడు.

## శ్రీనివాసుడు చెప్పిన ఘోణ తీర్థమాహాత్మ్యం :

ఓ వసిష్ఠా ! నేను నీయందు ప్రసన్నుడనైనాను. నీవు వైభవంతో వర్ధిల్లుదువు గాక ! బ్రహ్మదేవుని వలన నా ఈ తీర్థ మాహాత్మ్యాన్ని విని నీవెంతో భక్తి శ్రద్ధలతో ఇక్కడకు వచ్చావు. ఓ మహర్షీ ! అందువల్ల నేను సంతుష్టుడనయ్యాను. ఓ బ్రాహ్మణోత్తమా ! నీ మనసులో ఏం కోరిక వుందో కోరుకో అని వేంకటేశ్వరుడు పలుకగా వసిష్ఠ మహర్షి కేశవునితో యిలా అన్నాడు.

వసిష్ఠా ! మహామునీ ! నాకు చాలా సంతోషమైంది. నిన్నాశ్రయించాడనే భావనతో అతని యందు నీవు చాలా దయ చూపిస్తున్నావు. ఆశ్రిత వాత్సల్యం చూపేవాడు ఉత్తమోత్తముడు. అటువంటి వారి యందు నాకు చాలా ప్రీతి. ఎందులకనగా మహత్తరమైన ఆ గుణం నాదే. ఈ సర్వాబద్ధుడు కూడా నీయందు విశ్వాసంతో చాలా భక్తి ప్రపత్తులు కలిగి ఉన్నాడు. మహాత్ములయందు భక్తి కలవారే పురుషోత్తములు, అటువంటి వారి హృదయాలలో ఎల్లప్పుడు నేను లక్ష్మీ సమేతుడనై నివసిస్తాను. ఇతడు చాలా పాపాలు చేశాడు. ఇతడు లోక నిందితుడు. ఇతనిలో ఒక మంచి గుణం కూడా లేకపోవడం వలన ఇతనిని అందరూ సర్వాబద్ధుడని అంటున్నారు. అయినప్పటికీ నీ సహాయంతో ఈ తీర్థానికి వచ్చి పూర్ణిమనాడు భక్తితో స్నానం చేశాడు. కావున ఇతని పాపాలన్నీ నశించినాయి. ఓ మహర్షీ! నీ సహవాసం వలన ఇతనిలో సర్వ సద్గుణాలూ ఆవిర్భవించినాయి. అందువలన ఈ రోజు నుండి ఇతడు సర్వ సిద్ధుడు అనే పేరును పొందుతాడు. నేను ఇతని హృదయంలో ఉండి ఇతని చేత మంచి పనులు చేయిస్తూ ఇతనిని ధనవంతునిగాను, ధార్మికునిగాను, సుఖవంతుని గాను చేస్తాను ఓ వసిష్ఠా ! మహర్షీ ! వీరందరి ఎదుట చెప్పే నా మాటను శ్రద్ధగా విను. పౌరోహిత్యం వలన కలిగిన నీ దోషాన్ని నేను పోగొడుతున్నాను. పురుషుడు కాని, లేక స్త్రీ కాని బ్రాహ్మణుడు కాని, క్షత్రియుడు కాని ఈ తీర్థంలో స్నానం జేయుట వలన పాపముల నుండి విముక్తులై వాంఛితార్థములను పొందుతారు. ఇందుకు సందేహం లేదు.

పూర్వం తుంబురుడు ఇక్కడ నా గురించి తపస్సు చేసి ఈ తీర్థం తన పేరుతో ప్రసిద్ధమయ్యేటట్లు వరం కోరాడు. తెలిసి గాని, తెలియక గాని మనస్సు, వాక్కు, శరీరములతో చేసే పనుల వలన కలిగే పాపం సర్వం ఇక్కడ స్నానం చేయడం వలన నశిస్తుంది. స్త్రీకాని, పురుషుడు కాని పర్వదినంలో ఈ తీర్థంలో స్నానం చేసి తమ తమ అభీష్టాలను పొందుతారు. ఇందుకేమాత్రం సందేహం లేదు. ఓ మహర్షీ ! ఈ తీర్థానికి తుంబురు తీర్థమని పేరు ప్రసాదించబడింది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో పూర్ణిమ శుభదినంలో ఈ తీర్థంలో స్నానం చేసేవారు ముల్లోకాలలోను ధన్యులు. ఈ తీర్థస్నానం వలన కన్య సర్వ సద్గుణ సంపన్నుడైన భర్తను పొందుతుంది. వివాహితయైన స్త్రీ దీర్ఘ సుమంగళియై వంశోద్ధారకుడైన పుత్రుని కంటుంది. వృద్ధురాలు. సర్వపాపములనుండి విముక్తురాలై పుత్ర పౌత్రాదులతో కూడి ఐశ్వర్యవంతురాలై బంధువర్గంతో దీర్ఘ సుమంగళిగా చిరకాలం జీవిస్తుంది. ఈ తీర్థంలో స్నానం చేయుట వలన గొడ్రాలు పుత్రుని కంటుంది. ఇందుకు సందేహం లేదు. ధనం కోరే పురుషుడు ధనవంతు డౌతాడు. పుత్రుని కోరేవారు పుత్రులను, మనుమలను కోరేవారు మనుమలను పొందుతారు. గౌరవం కోరేవారు లోకంలో అందరిచేత గౌరవించబడతారు. విద్యార్థి సకల విద్యలు ఆర్జిస్తాడు. లౌకిక, వైదిక కార్యములలో ఎల్లప్పుడు నిష్ణాతుడౌతాడు. ఈ తీర్థస్నానము వలన అందరూ పాప రహితులై, ధాన్యాన్ని, ద్రవ్యాన్ని, పుత్ర భాగ్యాన్ని, సౌఖ్యాన్ని పొంది బంధువర్గంతో సుఖంగా దీర్ఘాయుష్మంతులై జీవించి దేహాంతంలో విష్ణులోకాన్ని పొందుతారు.

అత్ర స్నాతా ముక్త పాపాస్సమస్తా
ధాన్యం ద్రవ్యం పుత్ర భాగ్యం చ లబ్ధ్వా ।
సౌఖ్యం లబ్ధ్వా బంధు మధ్యే సమస్త
మాయుష్మంతో విష్ణులోకం ప్రజంతి ॥

## పుణ్య తీర్థాలలో దానఫలం :

ఈ ఘోణ తీర్థంలో ఈ పర్వదినాన స్నానం చేసిన పుణ్యాత్ములు బ్రాహ్మణులకు దానాలు చేస్తే వారి యందు నాకు చాలా దయ కలుగుతుంది. సువర్ణాన్ని దానం చేసేవారి యింట్లో లక్ష్మీదేవి స్థిర నివాసమేర్పరచు కుంటుంది. విప్రులకు గోదానం, రజతదానం (వెండి) చేయడం, భూదానం, తిలాదానం, ఫలదానం, విద్యాదానం, వస్త్రదానం చేసేవారు నాకత్యంతం ప్రియతములు. తాంబూలం సుగంధ ద్రవ్యాలు, పెరుగు, మజ్జిగ, పానకం యిచ్చేవారు బ్రహ్మరుద్రాదులకు నాకు కూడా ప్రీతి పాత్రులవుతారు. ఇక్కడ భక్తితో భగవద్భక్తులకు భోజనం పెట్టేవారిని చూసి నాకు, లక్ష్మీ దేవికి కూడా మహానందం కలుగుతుంది.

కలియుగంలో ఈ తీర్థం చాలా ప్రసిద్ధి చెందుతుంది. మానవులకు స్నానము, దానము సర్వపాపాలను పోగొడతాయి. ఈ మార్గంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి యాత్రికుల శ్రమను పోగొట్టేవారు నా అంశతో కూడిన ఋషులతో సమానమని చెబుతారు. ఇందుకు సందేహం లేదు. ఇక్కడ చేసే ప్రతి దానము కోటి రెట్లు అధికమవుతుంది. ఇందుకే మాత్రం సందేహం లేదు. కాబట్టి మానవులంతా ఎల్లప్పుడు ఈ పుణ్యదినంలో ఇక్కడ దానములు చేయుదురు గాక ! వారందరికీ నా స్నాన్నిధ్యాన్ని ప్రసాదిస్తాను.

స్నానం దానం మనుష్యాణాం సర్వాఘౌఘ వినాశనమ్ ।
సర్వం దానం కోటి గుణం భవత్యత్ర న సంశయః ॥

-బ్రహ్మోత్తరఖండం. అ. 50. శ్లో. 85,86.

ఈ తీర్థంలో స్నానం చేసే వారందరికీ అభీష్టాలను ప్రసాదిస్తాను ! అని చెప్పి భగవంతుడైన వేంకటాచలపతి

అక్కడ తీర్థస్నానానికి వచ్చిన వారందరిని సమావేశపరచి మేఘ గంభీరస్వరంతో యిలా చెప్పారు. ఓ పుణ్యాత్ములారా ! ఈ తీర్థంలో స్నానం చేయడం వలన మీ అందరి పాపాలు నశించినాయి. మీ అందరి కోరికలను ప్రసాదిస్తున్నాను. కాలాంతరంలో మీ అందరకు యోగులకు కూడా దుర్లభములైన ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయి. కలియుగంలో భరత వర్షంలో మానవజన్మ లభించడం చాలా దుర్లభమైనది అందులోను ఎంతో పుణ్యం చేసిన వారికి కాని వేంకటాచల యాత్ర చేసే భాగ్యం లభించదు.

కలౌతు భారతే వర్షే మానుషం జన్మదుర్లభమ్ ।
తతో వేంకటయాత్రాతు దుర్లభా సుకృతం వినా ॥

-బ్రహ్మోత్తర ఖండం. అధ్యాయం 51. శ్లో. 90.

అందులో కూడా ఈ పవిత్ర పర్వదినాన ఈ తుంబురు తీర్థంలో స్నానం దానం చేసే భాగ్యం లభించినవారు మిక్కిలి కృతార్థులు, ధన్యులు. ఇందుకే మాత్రం సందేహం లేదు ! అని చెప్పి వేంకటేశ్వరుడు గరుడ వాహనారుఢుడై లక్ష్మీదేవితో సహ ఆ వేంకటాచలంలో ఆనందంగా విహరించసాగాడు. దేవతలు, ఋషులు మానవులు ఈ విధంగా తుంబురు తీర్థంలో స్నానంచేసి శ్రీవారికి నమస్కరించి ఆయన వచనామృతాన్ని గ్రోలి ఆ తీర్థాన్ని ప్రశంసిస్తూ, స్తుతిస్తూ, సంతుష్టాంతరంగులై తమ తమ నివాసాలకు వెళ్ళారు.

## సర్వసిద్ధునికి వసిష్ఠాదుల ప్రశంస :

వసిష్ఠ మహర్షి కూడా సంతుష్టుడై సర్వ సిద్ధునితో పాటు తన ఆశ్రమానికి వెళ్ళాడు. అతనక్కడ కొంతకాలం గడిపిన తరువాత వసిష్ఠమహర్షి సర్వసిద్ధునితో యిలా అన్నాడు – ఓ బ్రాహ్మణా ! నీవు యిక మీ ఊరికి వెళ్ళు. భాగ్యవంతమైన మీ ఇంటికి చేరు. వేంకటేశ్వరుని అనుగ్రహంతో నీకు బహు ధనధాన్య సంపదలు లభించినాయి. ఇకపై నీవు విప్రోచితములైన స్నానం, దానం, జపం మొదలైన సత్కర్మలనాచరిస్తూ మహాత్ములను పూజిస్తూ బ్రాహ్మణులకు భోజనం పెడుతూ వేంకటేశ్వరుని సదా స్మరిస్తూ, ఆయనకు నమస్కరిస్తూ పుత్ర పౌత్రాదులతో సుఖంగా ఉండు ! అని చెప్పాడు.

వసిష్ఠమహర్షి ఈ విధంగా ఆదేశించగా సర్వ సిద్ధుడు ఆయన పాద పద్మములకు నమస్కరించి తన గ్రామానికి వెళ్ళాడు. అక్కడి వారంతా అతనికి ఎదురేగి అతనికి స్వాగతం పలికారు. ఓ సర్వసిద్ధా ! నీవు ధన్యుడవు. వేంకటేశ్వరుడు దయాసముద్రుడు. వసిష్ఠుని అనుగ్రహం వలన నీకు సాటి ఎవరూ లేరు ! అని అతనిని పొగడుతూ బ్రాహ్మణ క్షత్రియాదులందరూ అతనిని గౌరవించారు. అతడు ధనధాన్య సమన్వితుడై పుత్ర పౌత్రాదులతో సదాచారసంపన్నుడై దానధర్మాలు చేస్తూ సదా వేంకటేశ్వరుని స్మరిస్తూ భూలోకంలో బ్రాహ్మణ శ్రేష్ఠుడయ్యాడు. ఈ విధంగా సత్సాంగత్యమహిమ, అలాగే వేంకటాద్రి మహిమ, వేంకటేశ్వరుని వైభవం, ఇంకను తుంబురు తీర్థ మాహాత్మ్యాన్ని, ఫాల్గుణ పౌర్ణమినాడు భక్తుల సమావేశంలో పఠించే విద్వాంసుడికి, అలాగే భక్తితో దీనిని వినేవారికి వేంకటేశ్వరుడు కోరిన కోర్కెలను ప్రసాదిస్తాడు. వేంకటాచలమాహాత్మ్యాన్ని చెప్పుటలో నిష్ఠాతుడైన వానిని వ్యాసాది మహర్షులు విష్ణ్వంశ సంభూతునిగా ప్రశంసిస్తారు.

ఓ విప్రోత్తములారా ! పరమ పవిత్రమైన వేంకటాచల మాహాత్మ్యాన్ని విన్నారు కదా ! దీనిని విన్న తరువాత యితర మాహాత్మ్యాలను వినాలనే కోరిక కలుగదు. తుంబురు తీర్థంతో సమానమైన పాప పరిహారకమైన పుణ్య తీర్థం మరొకటి లేదు. అది కూడా పౌర్ణమినాడు స్నానం చేస్తే సర్వోత్తమ మైన పుణ్యం లభిస్తుంది.

వేంకటాచల మాహాత్మ్యం శ్రుతం వా పావనం ద్విజాః ।
యస్మిన్ శ్రుతే నృమాహాత్మ్యే శ్రవణేచ్ఛా నజాయతే ॥
నాస్తి తుంబురుతీర్థస్య సమం పాపప్రణాశనమ్ ।
తస్మీనపౌర్ణమాస్యాం చేత్సర్వ పుణ్యోత్తమోత్తమమ్ ॥

- బ్రహ్మోత్తర ఖండం. అ. 50. శ్లో. 104,105.

## తుంబురునికి నారదుని శాపం :

శౌనకాది మహర్షులు సూత మహర్షిని యిలా ప్రార్థించారు– మహాత్మా! సర్వశాస్త్ర కోవిదా ! పురాణ విజ్ఞాన విచక్షణా ! మేమంతా మిమ్మల్ని ఒక విషయం అడగాలనుకుంటున్నాము. దానిని చెప్పడానికి మీరే సమర్థులు. పూజ్యుడైన తుంబురుడు వేంకటాచలంలో ఒక తీర్థంలో తపస్సు చేశాడని చెప్పారు కదా ! ఆయన అక్కడ ఎందుకు తపస్సు చేశాడు ? తపస్సు చేసి ఏమి ఫలితాన్ని పొందాడు ? ఘోణ తీర్థం తన పేరుతో ప్రసిద్ధి కావాలని భగవంతుని ఎందుకు కోరాడు ? ఆయన ఎవరి గురించి తపస్సు చేశాడు? మాకు దయతో ఈ విషయాలన్నీ తెలియజేయండి. శౌనకాది మునులు ఈ విధంగా కోరగా సూత మహర్షి వేంకటేశ్వరునికి నమస్కరించి యిలా అన్నాడు– ఓ బ్రహ్మజ్ఞులారా ! మీకు పాపపరిహారకమైన పవిత్ర చరిత్రను చెబుతాను. సంతోషంగా వినండి.

ఒకానొకప్పుడు తుంబుర, నారదులు యిరువురు ఆకాశంలో వెడుతూ తమ వీణలను వాయిస్తూ ఏకాగ్ర చిత్తంతో శ్రీహరిని కీర్తిస్తూన్నారు. అప్పుడు దేవర్షి నారదుడు సర్వ రత్న ఖచితమైన వీణను ధరించిన తుంబురుని చూసి ఆశ్చర్యంతో యిలా అన్నాడు తుంబురా ! నీ వీణ నా వీణకంటే చాలా మెరిసి పోతున్నది. నీ వీణ ఎందువల్ల ఈ విధంగా ప్రకాశిస్తున్నది? పూర్వం యిలా



శోభించలేదు కదా! నిజం చెప్పు అని అడిగాడు. అప్పుడు తుంబురుడు నారదునితో యిలా అన్నాడు – నేను ప్రాచీనబర్హి అనే మహారాజు దగ్గరకు వెళ్ళి ఆయన్ను స్తుతించాను. ఆ మహారాజు నా స్తోత్రంతో సంతుష్టుడై నాకీ వీణను చేయించి యిచ్చాడు! అని చెప్పాడు. అది విని నారదుడు కోపంతో యిలా అన్నాడు.

ఓ సఖా ! నీవు మానవస్తుతి చేశావు. లోకంలో మానవులను స్తుతించటం సత్పురుషులకు తగనిపని. దానిని సజ్జనులు నిందిస్తారు. కావున అధముడవైన నీవు నాతో సహవాసం చేయుటకు తగవు. నేను సర్వలోక నాయకుడైన కేశవుణ్ణి తప్ప మానవుని స్తోత్రం చేయను. అందుచేత నేను శ్రీహరికి అత్యంత ప్రీతి పాత్రుడనయ్యాను. నీవు నరస్తుతి చేశావు కాబట్టి నీవు నాతో స్నేహం చెయ్యటానికి తగవు, నీకు ఆకాశ గమనం యోగ్యత లేదు. నీవు తలకిందులుగా భూమిపై పడిపోదువు గాక !

నారదుడు ఈ విధంగా శపించగానే తుంబురుడు తలకిందులుగా భూమిపై పడ్డాడు. ఆ పడటంలో వేంకటాచలం మధ్యలో ఘోణతీర్థం సమీపంలో మానవ సంచారం లేని సింహాలు, పెద్దపులులు సంచారం చేసే భయంకరమైన ప్రదేశంలో పడ్డాడు. ఆ పడుతున్నప్పటికినీ నమస్కరించే వారికి ప్రీతిని కలిగించే శ్రీహరిని ధ్యానిస్తూ అతడు ఎటువంటి బాధా లేకుండా వేంకటాచలంలోని ఘోణ తీర్థ సమీపానికి చేరాడు.

## ఘోణతీర్థంలో తుంబురుని తపస్సు :

ఆ తుంబురుడు ఘోణతీర్థాన్ని, నలుదిక్కులా పరికించి చూచి హరిభక్తితో ధైర్యవంతుడై ఈ విధంగా చింతించసాగాడు. ఇది వేంకటాద్రి మధ్య ప్రదేశమై ఉంటుంది. మరొకటి కాదు. కాబట్టి ఆ వేంకటేశ్వరుడే నన్ను సదా కాపాడాలి ఆయనే నాకు రక్షకుడు. వేరే దిక్కు లేదు, అనుకుని ఆ శంఖచక్రధారి, లక్ష్మీపతి అయిన వేంకటేశ్వరుని ధ్యానించటానికి ఉపక్రమించాడు. భక్తితో ఆ తీర్థంలో స్నానం చేసి తూర్పుముఖంగా కూర్చొని, నూరు సార్లు ప్రాణాయామం చేసి తుంబురుడు ధ్యాన నిమగ్నుడయ్యాడు.

ఆయన పీతాంబరధారి, చతుర్భుజుడు, లక్ష్మీదేవితో కూడిన వక్షస్థలంతో శోభించేవాడు, ప్రసన్న వదనుడు, కృపాసముద్రుడు ఉప్పొంగే నేత్రములు కలవాడు, పరమ పురుషుడు, అనంతుడు, గరుడుడు, విష్వక్సేనుడు, మొదలైన భక్తులతో కూడినవాడు. మహర్షులచే సేవింపబడేవాడు, దేవాది దేవుడు, రాక్షసులను సంహరించిన సుదర్శన చక్రాన్ని ధరించినవాడు, తన్ను సేవించేవారికి సర్వ సులభుడు, ఆశ్రయమైనవాడు, హృద్యమైన శరీరాన్ని ధరించినవాడు అయిన ఆ వేంకటాచలపతిని ధ్యానిస్తూ ఓంకారాన్ని అర్థయుక్తంగా జపిస్తూ గాలిని స్తంభింపచేసి నిశ్చలంగా ధ్యానంలో కూర్చున్నాడు.

## భగవంతుని సాక్షాత్కారం :

తుంబురుడు ఈ విధంగా నియమంతో ఒక సంవత్సర కాలం భగవంతుని ఉపాసించాడు. అంతట ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన భగవంతుడైన వేంకటాచలపతి అక్కడ అతనికి సాక్షాత్కరించాడు. ఆయన పీతాంబరధారియై దివ్యమైన గంధములు మాలలు, ఆభరణాలతో అలంకృతుడై ఉన్నాడు. ఆయన ముఖం పూర్ణ చంద్రబింబం వలె ఉన్నది. ఆయన విశాలమైన నేత్రములు పద్మములవలె ఉన్నవి. ఆయన సుందరమైన వక్షస్స్థలంలో సర్వలోకమాత అయిన లక్ష్మీదేవి విలసిల్లుతున్నది. దివ్యమైన వాద్యఘోష ఆ గిరి గహ్వరములలో ప్రతిధ్వనిస్తున్నది. అప్పుడు భగవంతుడు తుంబురునితో యిలా అన్నాడు. తుంబురా ! ఓ తుంబురా ! నాయనా ! నన్ను దర్శించు. నీకేం కావాలి? అని భగవానుడు పలుకగా తుంబురు మహర్షి కళ్ళు తెరచి ఆయన్ను దర్శించాడు. ఆ దేవదేవుని దర్శించిన వెంటనే ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆయన ప్రక్కనే ఆయనను సేవిస్తున్న ఆదిశేషుణ్ణి, పర్వతంవలెనున్న గరుత్మంతుని, విష్వక్సేనుని, అగస్త్యాది మహర్షులను స్వామివారి దివ్య పాదారవిందములనే వీక్షిస్తున్న వ్యాసాది మహర్షులను, అంజలి బద్ధులైన ఋషులను, సనకాది యోగులను, వైఖానస మునులను, శుకమహర్షిని, ఆయన మానస పుత్రులను, దేవ, గంధర్వ సిద్ధ, విశ్వావసు, యక్ష, కిన్నర, కింపురుష, నాగ నాయకులను దర్శించాడు. ఓ దేవదేవా! జగన్నాథా ! సావధానమనస్కా ! నీకు జయమగు గాక ! అని మేఘగంభీర ధ్వానంతో వేత్ర హస్తులైన కొందరిని దర్శించాడు. అలాగే బ్రహ్మలోకం నుండి వచ్చిన వారిని, దేవలోకంనుండి వచ్చిన అప్సరోగణాన్ని చూచాడు. అంతట ఆ శేషగిరీశ్వరుడు తన దర్శనార్థమై వచ్చిన వారందరిని సమావేశపరచి యిలా చెప్పాడు. మీరంతా వెంటనే ఈ తీర్థంలో స్నానం చేయండి. ఇది సర్వపాపపరిహారకమైనది. సకల శ్రేయస్సులను యిచ్చేది! భగవంతుని పలుకులు విని అక్కడివారంతా భక్తితో సంకల్పం చేసుకొని గోవింద నామ స్మరణం చేస్తూ ఆ తీర్థంలో స్నానం చేసి ఒడ్డుకు వచ్చారు. పవిత్ర హృదయుడైన తుంబురుడు కూడా

దానిలో స్నానం చేసి వారితో భగవంతుని ఈ విధంగా మరల మరల స్తుతించారు.

**జయ సర్వగుహావాస లోకరక్షామణే హరే ! ।**
**భక్తార్త పాలనపర ప్రణతార్తి హర ప్రభో ! ॥**
**లక్ష్మీనాథ జయానంత రక్షితాశేష భూసుర ।**
**పునీహి సకలాన్లోకాన్పాలయ త్వం కృపాలయ ॥**

**-బ్రహ్మోత్తరఖండం. అ. 51. శ్లో. 36,37.**

సర్వజీవుల హృదయగుహల్లో నివసించే ఓ శ్రీహరీ !

లోకరక్షామణీ! భక్తుల ఆర్తిని పోగొట్టుటలో సమర్థుడవైన ఓ ప్రభో ! నిన్ను శరణు వేడినవారిని, నీకు నమస్కరించే వారిని కష్టాలనుండి కాపాడే స్వామి! లక్ష్మీనాథా ! అనంతా! సకల భూసురులను రక్షించినవాడా ! నీకు జయమగు గాక ! నీవు లోకాలన్నిటిని పావనం చేయి. ఓ కృపానిధీ !

అంతట తుంబురుడు ఓ వేంకటాచలపతీ !

నీకు సదా నమస్కరిస్తున్నాను. నీవు నా పాపములను

పోగొట్టు. ఈ తీర్థ మాహాత్మ్యాన్ని మీ మాహాత్మ్యాన్ని వినవలెనని నాకు చాలా కోరిక కలుగుచున్నది. కావున దయతో అనుగ్రహించండి అని ప్రార్థించాడు.

## అగస్త్యుడు చెప్పిన తుంబురుతీర్థ మాహాత్మ్యం :

వారంతా ఈ విధంగా స్తుతించగా వేంకటేశ్వరుడు ప్రసన్నుడై అగస్త్యమహర్షితో యిలా అన్నాడు. ఓ మహామతీ ! ఇపుడు వీరందరకీ వేంకటాచల వైభవాన్ని, ఈ తీర్థమాహాత్మ్యాన్ని గురించి కొంచెం చెప్పు అని దేవ దేవుడు యిలా ఆజ్ఞాపించగా అగస్త్యమహర్షి ఈ విధంగా చెప్పనారంభించాడు.

**పుణ్యో యం వేంకటగిరిస్సర్వ పుణ్యస్థలేష్వపి ।**
**సమస్త తీర్థాన్యత్రైవ పుణ్యాని నివసంతి హి ॥**

**-బ్రహ్మోత్తర ఖండం. అ. 51. శ్లో. 41.**


పుణ్యస్థలాలన్నిటిలో ఈ వేంకటాద్రి పరమ పవిత్రమైనది. సకల పుణ్యతీర్థాలు యిక్కడే ఉన్నాయి. ఇక్కడి దైవం వేంకటేశ్వరుడు. ఆయన దయామూర్తి భక్తుల అపరాధాలను క్షమిస్తాడు, రక్షిస్తాడు. అందువలన అందరు ఆయన్ను సేవించాలి. ఈ తుంబురు తీర్థంలో స్నానం చేసినవారికి పాపాలన్నీ నశిస్తాయి. సకల శ్రేయస్సులు సిద్ధిస్తాయి. ఇందుకేమాత్రం సందేహం లేదు. ఇక్కడ సువర్ణాన్ని, అన్నాన్ని, తాంబూలాన్ని, సుగంధాన్ని, చల్లని మంచినీటిని దానం చేసినవారు పవిత్రులై సకల కోరికలను పొందుతారు. అంతట తుంబురుడు స్వామిని యిలా ప్రార్థించాడు– స్వామీ ! నా పేరుతో ఈ తీర్థం ప్రసిద్ధమగు గాక! భగవంతుడు తథాస్తు అని పలికి మరల తుంబురునితో యిలా అన్నాడు ఓ తుంబురా ! నీవు పవిత్రుడవయ్యావు. కావున ఇకపైన నారదునితో పాటు నీవు నా సంకీర్తన చెయ్యి. ఫాల్గుణ పౌర్ణమినాడు ఈ తుంబురుతీర్థంలో స్నాన, దానాదులు చేసేవారికి ఈ లోకంలోను, పరలోకంలో కూడా సకలాభీష్టాలూ ప్రసాదిస్తాను! అని వరం ప్రసాదించగా తుంబురు ప్రముఖులందరూ సంతుష్టులై తమ తమ స్థానాలకు వెళ్ళారు.

తుంబురుః :–

**భగవన్ ! మమనామ్నైవ తీర్థమేతత్ ప్రసిద్ధ్యతు ।**
**త్యక్తవాన్ విష్ణుః తుంబురుం పునరబ్రవీత్ ॥**
**శ్రీభగవాన్ :– నారదేన సహైవ త్వం పూతో మత్కర్తనం కురు ।**
**మే త్ర ఫాల్గుణ రాకాయాం స్నానదానాది కుర్వతే ॥**
**ఇహలోకే పరత్రాపి తేషామిష్టం యాతా యధాగతమ్ ॥**
**ఇత్యుక్తాస్తుమ్బురు ముఖాః తుష్టా యాతా యధాగతమ్ ॥**

**-బ్రహ్మోత్తర ఖండం. అ. 51. శ్లో. 45-47.**

శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలోని బ్రహ్మ పురాణ భాగము సంపూర్ణం.





ధారావాహికం



# శ్రీ కృష్ణ తత్వం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

భాగవతాన్ని రచించినవాడు "వేదవ్యాసో భగవాన్ ఋషిః" అని అనిపించుకున్న వ్యాసుడు సెక్స్ చెబుతాడా? ఇకపోతే సర్వసంగ పరిత్యాగియైన అవధూత శుకయోగీంద్రుడు– కామసంబంధమైన కథలు చెబుతాడా? విన్నవాడు చావుకి ఎదురు చూస్తున్న పరీక్షిత్తు మహారాజు కామకథలు వింటాడా?

రచనల్లో 1–లౌకికభాష. 2–కావ్యభాష. 3–సమాధిభాష. కొన్ని సన్నివేశాలను వ్యాసులవారు మూడోదైన (శైలిలో) సమాధిభాషలో రాసారు.అందులో గోపికావస్త్రాపహరణం ఒకటి.

భాగవతం తెలిసి పలుకుట చిత్రంబు శూలికైన తమ్మిచూలికైన–(శివునికైన బ్రహ్మకైనా) విబుధవరుల విన్నంత కన్నంత తెలియవచ్చినంత తేటపరుతు–అన్నాడు పోతన.

మహాభాగవతంలోని కథలు కాలక్షేపం కోసం కాదు– జ్ఞాన వైరాగ్యాలతో భక్తిశ్రద్ధలతో కూడుకున్నవి. అందులో నివృత్తి మార్గం చక్కగా ఆవిష్కరించబడింది. కనుకనే మహాభాగవతంలో వున్నటువంటి సన్నివేశాలన్నీ డీకోడ్ చేయాలి.అపుడే అందులోని అంతరార్థాన్ని అందుకోగలం.

దేహానికి ఒక ఆచ్ఛాదనం– ఆవరణం– అదే వస్త్రమైంది. నిజముగా భగవంతుడు ఏవిధమైన ఆచ్ఛాదనంకానీ ఆవరణంకానీ లేనివాడు. జీవుడుకూడా అంతే. నామ రూప లింగ అభేద ఉపాధి రహితమైన సూక్ష్మమైన స్థితిలో వుంటాడు పరమాత్మ. బహుస్యాం అని సంకల్పించినపుడే– నామరూపాలు వచ్చేస్తాయి స్వామికి.

ఇక్కడ గోపికావస్త్రాపహరణాన్ని డీకోడ్ చేస్తే–నేను నాది నాకోసం అనే అహంకారం మమకారాలను పోగొట్టి– జీవులను స్వామి తన సన్నిధికి చేర్చుకుంటాడు. నగ్నంగానే స్వామి సన్నిధికి వెళ్లారు గోపాంగనలు. అంటే ప్రేమాధిక్యత కలిగినవారు వ్రజ గోపికలు.

అది మార్గశిర మాసం. కృష్ణదేవుణ్ణి పతిగా పొందాలని నందవ్రజంలోని గోపకన్యలు–కాత్యాయినీ (దుర్గాదేవి) వ్రతం చేసారు. యమునా నదిలో స్నానాలు చేసి–ఇసుకతో దేవీమూర్తిని తయారు చేసారు.షోడశోపచారాలు ఆచరించి–స్తుతించారు. ఆవిధంగా నెలరోజులు అమ్మను ఉపాసించారు.

ఎప్పటిలాగే నదికెళ్లి– గట్టుమీద చీరలు వుంచి– కాళిందిలో జలకాలాడుతున్నారు గోపకన్యలు.కృష్ణుని మీద ఎవరికి తోచిన పాటలు వారు పాడుతున్నారు.

ఆ గోపకన్యలకు వ్రతఫలాన్ని ఇవ్వాలని కృష్ణభగవానుడు తన మిత్రులతో కలిసి– నదీతీరానికి చేరాడు. తన వాళ్లని మాట్లాడకుండా వుండాలని చెప్పి–ఆ కన్యల వస్త్రాలను దొంగలించాడు. కడిమి చెట్టు ఎక్కాడు.

గోపికలు స్నానాలు ముగించుకొని–చూస్తే తమ తమ చీరలు కనిపించలేదు. చుట్టుపక్కల పరిసరాలను పరికించి చూసారు. వస్త్రాలను అపహరించి– కదంబవృక్షం మీదున్న కృష్ణుడు కనపడ్డాడు. సిగ్గుపడుతూ ఇలా అంటున్నారు–

**మామా వలువలు ముట్టకు**
**మామా!కొనిపోకు- పోకు మన్నింపతగున్**
**మా మానమేల కొనియదు**
**మా మానసహరణమేల? మానుము కృష్ణా!**

మామా(కృష్ణా) మాకు చెందిన చీరలను ముట్టుకోవద్దు.ఇక మా వస్త్రాలను ఎత్తుకుని పోవద్దు.మరి మా ప్రవర్తనని మన్నించు. మా మానము ఎందుకని దొంగలిస్తావు? ఇంకా మా మనసులను ఎందుకు దోచుకుంటావ్? ఈ పాడు పని మానవయ్యా!

వ్రజగోపభామల మాటలు విన్నాడు కృష్ణుడు.వాళ్ల చీరలను తన భుజం మీద వేసుకుని అంటున్నాడు ఇలా–

మీరందరూ వ్రతాన్ని ఆచరించారు.చాలా సంతోషం. ఒక్కొక్కరుగా వచ్చి లేదా మీరందరూ కలిసివచ్చి–మరి మీ మీ వస్త్రాలను తీసుకోవచ్చు.

కృష్ణా! ఆడవాళ్లు స్నానాలు చేస్తుంటే మగవాళ్లు వస్తారా? వచ్చారు అనుకో– నిర్దయతో ఇలాంటి తుంటరి పనులు చేస్తారా? ఔరా! మరి ఈ వింతలు నీకే సరిపోతాయి.ఓ స్వామీ! ఇక నీకు దాసులమై వుంటాం.బాబ్బాబు! మా చీరలు ఇప్పించవా?

కృష్ణుని మాటలు గోపకన్యలు విన్నారు. అందరూ చలికి గడగడా వణుకుతూ–కంఠం లోతు నీళ్లల్లో వున్నప్పటికీ కృష్ణదేవునికి ఎంతగానో ఆకర్షితులైనారు.

కృష్ణా! ధర్మాధర్మాలు తెలిసినా కూడా నీవు మమ్మల్ని రమ్మంటే ఎలా వస్తాం?

గోపికలారా! పవిత్రమైన కాత్యాయని వ్రతాన్ని ఆచరిస్తూ– నగ్నంగా స్నానాలు చేయడం వ్రతభంగం అవుతుంది. జలాధిపతి వరుణ దేవుణ్ణి– యమునా నదీమతల్లిని కించపరిచారు. దోషపరిహారార్థంగా–తలమీద చేతులు జోడించి నాకు నమస్కరించండి.

మరి చేసింది తప్పని తెలుసుకున్నారు గోపభామలు. ఇక దాసుని తప్పులు దండంతో సరి– సర్వకర్మాచరణకు సాక్షీభూతుడైన కృష్ణభగవానునికి నమస్కరించారు.

చలికి వణికిపోతున్నప్పటికీ వెళ్లాలన్నారు కొందరు. అలా అయితే నగ్నంగా ఏవిధంగా వెళ్లాలన్నారు కొందరు.ఏది ఏమైనప్పటికి కృష్ణుని మీద ఎవ్వరికీ కోపం లేదు.

ఇకపోతే శారీరకమైన సుఖభోగాల కోసంకాదు– భగవత్ ఆనందానుభూతి కోసం వెళ్లారు.మరి దేహాత్మల భ్రాంతిని విడవాలి.ఇక భక్తి పండిన ప్రేమ సిగ్గుని విడిచిపెడుతుంది. శరణాగతి సమయంలో సిగ్గుని విడిచిపెట్టేసింది ద్రౌపది.

కృష్ణ సమాగమంలో ఏదో తెలియని ఆనందానుభూతి వారి మనసుల్లో దోబూచులాడుతుండగా– సిగ్గు దొంతర్ల మధ్యలో అప్రయత్నంగా నడిచివెళ్లి వస్త్రాలను తీసుకున్నారు. గోపకన్యల అలౌకికమైన ప్రేమానురాగాలకు కట్టుబడి గోపీవల్లభునిగా ఖ్యాతిని ఆర్జించాడు కృష్ణుడు.

ఎప్పటిలాగే గోవత్సాలను తోలుకుని గోపబాలురతో బలరామకృష్ణులు వెళ్లారు. అయితే తొందరలో అందరూ చల్దిచిక్కాలను మరచిపోయారు.అది మధ్యాహ్న సమయం. అందరికీ ఆకలిగా వుంది. అక్కడికి దగ్గరలో బ్రహ్మవేత్తలైన బ్రాహ్మణులు స్వర్గం కోసం అంగిరసం అనే యజ్ఞాన్ని చేస్తున్నారు. వాళ్ల దగ్గరికి వెళ్లి– నేను అన్నం అడగండనట్లు చెప్పండి అన్నాడు కృష్ణుడు.

1–స్తోక కృష్ణుడు. 2–శ్రీదాముడు. ఇంకా 3–అంశుడు. 4–సుబలుడు. 5–అర్జునుడు. 6–విశాలుడు. 7–వరూథపుడు. 8–వృషభుడు. 9–దేవప్రస్థుడు. 10–తేజస్వి. ఈ పదిమంది కృష్ణునికి స్నేహితులు.

వాళ్లందరూ వెళ్లారు. బ్రాహ్మణులకు నమస్కరించారు. మేం ఆకలితో వున్నాం అంటూ కృష్ణుడు అడుగుతున్నాడు. అందరికీ అన్నం పెట్టించండి అన్నారు.వాళ్ల మాటలను విన్నప్పటికీ విననట్లున్నారు విప్రోత్తములు.నిరాశతో వెనుదిరిగారు.

ఇపుడు మరలా ముని పత్నుల దగ్గరికివెళ్లి– అడగండని పది మంది గోపబాలురను పంపించాడు కృష్ణుడు మళ్లీ. బలరామకృష్ణులు బాగా ఆకలితో వున్నారు. మాకు అన్నం పెడతారా అని మునుల భార్యలను దీనంగా అడిగారు.

వంటంతా అయిపోయింది. పూర్ణాహుతి కోసం ఎదురు చూస్తున్నారు అందరునూ.ఆ సమయంలో కృష్ణుడు వచ్చివున్నాడు అన్నమాట మునుల భార్యల చెవిని పడింది. కృష్ణునికి ఆకలట– ఎక్కడలేని వుత్సాహం పుట్టుకొచ్చింది వాళ్లందరిలో.

ఆ కృష్ణ భగవానుని దివ్యమంగళకర కళ్యాణమయ స్వరూపసౌందర్యాలనూ బాల్య లీలావిలాసాలను వాళ్లందరూ విని వున్నారు. ఇపుడు ఆ కృష్ణదేవుని దర్శించుకునే భాగ్యం కలుగుతుందని పరమానందభరితులైపోయినారు మునిపత్నులు.

**చతుర్విధం బహుగుణమన్నం ఆదాయ భాజనైః ।**
**అభిసస్రుః ప్రియం సర్వాః సముద్రమివ నిమ్నగాః ॥**

వెంటనే భక్ష్య భోజ్య లేహ్య చోష్య భోజన పదార్థాలను తీసుకుని–సముద్రం వైపుగా నదులు పరుగులు తీసినట్లు బ్రాహ్మణ భార్యలు కృష్ణుడు వున్నచోటికి పోయారు.

అపుడు భర్తలు సోదరులు అడ్డుపడినా లెక్కచేయక పరుగులు తీసారు.

కాళిందీనదీ తీరాన అశోక వృక్షంకింద నందనందనుని దర్శించినారు ముని పత్నులు.ఆ సమయంలో కృష్ణుడు ఏవిధంగా వున్నాడంటే–––

ఒక చెలికాని మీద ఒక చేయిచాచి–వేరొక చేతితో కమలాన్ని పట్టుకుని విలాసంగా తిప్పుతున్నాడు.నల్లని కొప్పునకు అందని ముంగురులు లేతచెక్కిళ్లపై చిందులువేస్తున్నాయి. శ్యామసుందరుని తనువుపై పట్టు పీతాంబరం ఎంతో నిగనిగలాడుతోంది. మెడలో వనమాలతో పాటు– నెమలి పింఛం ధరించాడు.సకల జగత్తుని సమ్మోహపరిచేటట్లు నటవేషంతో విరాజిల్లుతున్నాడు.ఆ దివ్యమైన కృష్ణ భగవానుని కన్నుల కరువుతీరేటట్లుగా చూసారు ముని పత్నులు.

**(ఇంకా ఉంది)**

ధారావాహికం



# ముకుందమాల

- భువనేశ్వరి మారేపల్లి,
9550241921

**హే గోపాలక! హే కృపా జలనిధే! హే సింధుకన్యాపతే!**
**హే కంసాంతక! హే గజేంద్ర కరుణాపారీణ! హే మాధవ!**
**హే రామానుజ! హే జగత్త్రయ గురో! హే పుండరీకాక్ష! మాం**
**హే గోపీ జననాథ! పాలయ పరం జానామి న త్వాం వినా ||**

ఓ గోపాలక! ఓ కృపాజలనిధీ! ఓ సింధుకన్యాపతీ! ఓ కంసాన్తకా! ఓ గజేంద్ర వరదా! ఓ మాధవా! ఓ రామానుజా! ఓ జగత్త్రయగురూ! ఓ పుండరీకాక్షా! ఓ గోపీజననాథా! నన్ను రక్షించండి. నిన్ను తప్ప వేరొకరిని ఎరుగను అంటూ ఆళ్వార్లు పరమాత్మ చేసిన అతిమానుష కృత్యాలను కీర్తిస్తూ మంగళం పాడుతున్నారు. (ఈ శ్లోకము నిత్యానుసంధానం చేయవలసిన శ్లోకం.)

పరమాత్మను గోపాలకుడా అని సంభోధిస్తున్నారు, "గో పదానికి అర్థం త్రిగుణాత్మకమైన ప్రకృతి అని అర్థం. ప్రకృతి అనే క్షేత్రంలో జీవులనబడే బీజములను నాటి నడిపించే వ్యవస్థాపకుడు కాబట్టి గోపాలకుడు. పరమాత్మా! నీ యొక్క సౌలభ్య గుణము చేత ద్వాపరంలో కలిగిన ఆపద నుండి జనులను, పశువులను తేడా లేకుండా అందరిని కాపాడినటువంటి వాడివి కదా! స్వామీ! నీవు కృపాజలనిధివి కూడా అంటే మన పూర్వాచార్యులు ఒక అందమైన ఉపమానం చెప్తారు, ఒక అత్యధికమైన నీటిని కలిగిన నల్లటి మేఘము ఒక పర్వతము మీద విశ్రాంతి తీసుకున్నట్లే, పరమాత్మ ఎందుకు శయనించి ఉంటాడు అంటే భట్టరువారు ఇలా చెప్తారు, ఆ నీరు కలిగిన నల్లటి మేఘము వలె పరమాత్మ ఉదరంలో కూడా జలములు ఉన్నాయట వాటి బరువు మోయలేక విశ్రమించి ఉన్నారు అంటారు. అంటే అనేక జలములు అధికముగా కలవాడు ఎవరికీ ఏ కష్టమొచ్చినా తట్టుకోలేక వారికంటే ముందు తాను నిలబడి ఆపదను తొలగించేవాడు పరమాత్మ. కాబట్టి కృపాజలనిధివి నువ్వు. నీలో ఉన్నటువంటి ఈ కృప, దయాది గుణములను అధికముగా పెంచగలిగిన వారు ఎవరు అంటే అమ్మ లక్ష్మీదేవి. సింధుకన్యాపతివి కదా! నువ్వు. అమ్మవలన మరింతగా గుర్తింపు కలిగిన వాడివి. తుల్యా శీల వయోవృత్తామ్ అని చెప్పినట్లు క్షీరసాగరము నుండి జన్మించిన అమ్మ దేవతలందరు చూస్తుండగా వారెవరిని లెక్కపెట్టక అన్ని విధముల తగిన వాడైనటు వంటి స్వామీ యొక్క కంఠముననే స్వయంవర మాలికను వేసింది. అందుకే శ్రీపతిః అని పిలవబడుతున్నావు. స్వామీ! నీవు కంసాంతకుడవు కదా! శిష్టులను కాపాడి దుష్టులను సంహరించ గల శక్తి కలిగి ఉన్నవాడివి. బాహ్య శత్రువులనే కాక, అంతఃశత్రువులనే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే వాటిని కూడా పరిహరించేవాడివి నువ్వు. ఓ గజేంద్రవరదా! అనడంలో అంతరార్థం – పరమాత్మ యొక్క రక్షణ వ్యవస్థ తెలియజేస్తుంది. నివాసశ్శరణం సుహృద్గతిః నారాయణః – అని ఉపనిషద్వాక్యం వీరు వారు అనే తారతమ్యం లేకుండా అందరికి ఆశ్రయమైనవాడు, రక్షకుడు, ఆప్తమిత్రుడు, ప్రాప్యమైనవాడు నారాయణుడే. అని గజేంద్రుని విషయంలో నిరూపించిన ఓ వరదా! ఓ మాధవా! మాయాః = లక్ష్మీదేవి యొక్క, ధవః = భర్త అనగా శ్రీపతి కాబట్టి మాధవుడు. నీవు రామానుజుడవు కూడా

కదా! శ్రీ వైకుంఠమున ఉండేటప్పుడు భక్తులను గైకొని రక్షిస్తావు. భక్త విరోధులు వస్తే ఆదిశేషా! వారిని చూడు అని అనడంలో నీకు సహాయకులు ఉన్నారు కాబట్టి నువ్వు సహాయ సంపన్నుడవు అని అర్థం. అలాగే నువ్వు పేరు మార్చి రాముడవు ఐతే నీ శయ్య అయిన ఆదిశేషుడు కూడా పేరు మార్చి లక్ష్మణుడై నిన్ను అంటిపెట్టుకుని ఉన్నాడు కాబట్టి నువ్వు సహాయ సంపన్నుడవు. స్వామీ నువ్వు బ్రహ్మదేవుడిని నాభి కమలము నందు కూర్చో బెట్టుకుని వేదములను ఉపదేశం చేసావు. నీవే నరనారాయణ రూపుడవై అష్టాక్షరీ మంత్రమును సమస్త లోకములకు ఉపదేశం చేసినవాడవు. కాబట్టి నువ్వు జగత్తుకే ఆచార్యుడవు. గొప్ప విశాలనేత్రములు కలిగినటువంటి వాడవు. ఆ నేత్రములను దర్శించిన చాలు కనుకనే పుండరీకాక్షుడు. గోపీజననాధుడవు! సమస్త గోపికలకు దారకము, పోషకము సమస్తము నీవే అయి ఆర్తులను కాపాడి వారి వాంఛలను నెరవేర్చేవాడివి. కాబట్టి నీకంటే గొప్పవాడు, నీకు సమానమైన వాడు వేరొకడు ఉన్నట్లు ఎలాంటి వేదశాస్త్రములలో నేను చదవలేదు. నువ్వే రక్షకుడవు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం పరమాత్ముడు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఎన్నో అవతారములు స్వీకరిస్తూ, ఎన్నోబాధలు సహిస్తూ అవతారపరమార్థాన్ని నెరవేరుస్తూ ఉంటాడు. మహావిష్ణువు స్థితికారుడుగా లోకాలను కాపాడడానికి స్వీకరించిన అవతారములలో అత్యంత మహిమాన్వితమైన సంపూర్ణ అవతారం కృష్ణావతారం.

మానవులలోసహజంగా ఉండేకోపతాపాలు, ఈర్ష్యాద్వేషాలు, మదమత్సరములు, కుటిల యత్నాలు వంటివి అన్నీ పైకి కనిపిస్తూ అంతర్లీనంగా అడుగడుగునా పరమపదానికి దగ్గర చేసే అవతారం ఈ కృష్ణావతారం. అయితే ఎంతటి పరమాత్ముడైనా తన భక్తుల వద్దకు వచ్చేసరికి వెన్నలా కరిగిపోయేవాడే. కృష్ణావతారంలో తాను సాక్షాత్తూ పరంధాముడైనప్పటికీ గొల్ల పిల్లలతో కలిసి వారి ఎంగిలి కూడా తిన్నాడు. దుర్యోధనుడి విందు కాదని విదురుడు భక్తి పారవశ్యంలో పెట్టిన అరటి తొక్క తిన్నాడు. విదురుడి కుటీరములో బస చేసాడు. యువరాజు అయి ఉండి కూడా గోకులంలో మట్టిలో, ధూళిలో పడి ఆడాడు, పాడాడు. తన భక్తులు ఏది పెడితే అది తిన్నాడు. ఎక్కడ ఉండమంటే అక్కడ ఉన్నాడు. జాతి మత భేదాలు, అంతస్థుల తారతమ్యాలు చూడలేదు. పదకవితాపితామహులైన అన్నమయ్యగారు అన్నట్టు...

"కందువగు హీనాధికములిందు లేవు, అందరికి శ్రీహరే అంతరాత్మ అని రుజువు చేసింది కలియుగంలో ఎక్కడైనా ఉందా అంటే ఉంది. ప్రత్యక్ష తార్కాణం మన ఉడిపి కృష్ణుడు అని సభక్తికంగా, సగర్వంగా చెప్పవచ్చు. సాధారణముగా భగవంతుడిని దర్శించడం కోసం భక్తులు వెళ్ళాలి. స్వామి కనిపించేలా, ఎలా వెళితే వీలుగా ఉంటుందో చూసుకుని వెళ్ళాలి. కానీ ఉడిపిలో మాత్రము సాక్షాత్తూ కృష్ణయ్యనే తన భక్తుడికి కనిపించేలా తిరిగి పోవడం జరిగింది. అదెలాగంటే.... ఆలయానికి వెళ్ళే భగవంతుడు ఎటువైపు ఉంటే అటు తిరిగి దర్శనం చేసుకుంటాం. కాని భగవంతుడే భక్తుడు ఉన్న చోటికి తిరిగితే..! ఆ భక్తుడెంతటి పుణ్యవంతుడో కదా! భక్త కనకదాసు విషయంలో ఇదే జరిగింది. ప్రాపంచిక సౌఖ్యపు మోహాల్లో కొట్టుమిట్టాడినా, చివరికి ఆదికేశవ స్వామి అనుగ్రహంతో భక్తాగ్రేసరుడయ్యాడు కనకదాసు. గురువును మించిన శిష్యుడయ్యాడు. ఉడిపి శ్రీకృష్ణుని కరుణాకటాక్షాలను పొందాడు. కనకదాసు ఉన్న వైపునకు ముఖాన్ని తిప్పి, ఆయనకు దివ్యదర్శనం ఇచ్చాడు ఉడిపి కృష్ణ భగవానుడు. భగవంతుని పైన కనకదాసుకు ఉన్న మొక్కవోని విశ్వాసమే ఆయన్ను భక్తాగ్రగణ్యులలో ఒకరిగా తీర్చిదిద్దింది. జీవన్ముక్తుడిని చేసింది. కురుబగౌడ దాస కుటుంబంలో పుట్టిన మహాభక్తుడు కనకదాసు. కర్ణాటకలో హవేరీ జిల్లా బాద గ్రామంలో యుద్ధ సైనికాధ్యక్ష కుటుంబంలో బీర్ గౌడ, బీచమ్మ దంపతులకు 1509లో జన్మించాడు. తనకీర్తనలు, ఉపభోగాల వలన కర్ణాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేసి బాగా ప్రసిద్ధమయ్యాడు.

కనకదాసు అసలు పేరు తిమ్మప్ప నాయకుడు బాగా చదువుకొని సమాజాన్ని అన్ని కోణాలలో సూక్ష్మ పరిశీలన చేశాడు. అతని కీర్తనలో ఒకదాని ప్రకారం కనకదాసు "కనక నాయకుడు" అనే సైన్యాధ్యక్షుడు. ఒక యుద్ధంలో తీవ్రంగా గాయపడ్డాడు కానీ అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. దీనితో సైన్యానికి స్వస్తి చెప్పి వ్యాసరాయల శిష్యుడై "కనకదాసు" అని గురువు పెట్టిన పేరుకు సార్ధకత తెచ్చి సామాన్యులకు అర్థమయ్యే కన్నడ భాషలో కీర్తనలు రాస్తూ రచనలు చేస్తూ వేదాంతాన్ని అభ్యసించి మహాకృష్ణ భక్తుడయ్యాడు.

ఒకప్పుడు గురువు వ్యాసరాయలు తన శిష్యులందరినీ పిలిచి తలా ఒక మధుర ఫలాన్ని ఇచ్చి, ఆ పండును ఎవరూ చూడకుండా రహస్యంగా తినండి అని చెప్పాడు. గురువు చెప్పిన అంతరార్థం గ్రహించలేక ఒక శిష్యుడు దుప్పటిని తన మీద కప్పుకుని ఎవరూ చూడడం లేదని భావించి ఆ దుప్పట్లో కూర్చుని ఫలాన్ని ఆరగించాడు. వేరొక శిష్యుడు దగ్గర్లో చెట్టు చిటారు కొమ్మ మీదికి ఎగబ్రాకి ఆకుల మధ్యలో కూర్చుని తృప్తిగా పండును తిన్నాడు. ఇంకొక శిష్యుడు సామాన్లు దాచే చీకటి గదిలోకి వెళ్ళి, ప్రశాంతంగా పండు రుచిని ఆస్వాదించాడు. అయితే ఒక శిష్యుడు మాత్రం విచారంగా ఆ పండు తీసుకుని వచ్చి గురువుగారి ముందు నిలబడ్డాడు. ఆయనకు ఆశ్చర్యం వేసి, నాయనా! ఏమైంది? నీవెందుకు ఫలం ఆరగించలేదు? అని ప్రేమగా అడిగాడు. గురువర్యా! నేను పాపాత్ముడను. గురువుగారు చెప్పినట్లు చేయలేకపోయాను. నన్ను క్షమించండి. నేను అనేక చోట్లకు వెళ్ళి, పండు తిందామని ప్రయత్నించాను. కానీ ఎక్కడకు వెళ్ళి పండు నోట్లో పెట్టుకుందామని అనుకున్నా ఆ భగవంతుని



దర్శనం అవుతూ వచ్చింది. నేను ఒంటరిగా ఉన్న ఆలోచనే కలుగలేదు. అని విచారంగా, వినయంగా బదులిచ్చాడు. ఆ శిష్యుడి సమాధానం విని గురువు వ్యాసరాయలు ఎంతో విస్మయం చెందాడు.

కనకదాసు ముఖ్య బోధన “నేను అనేది పోతే అంతా పోతుంది”. ఒక రోజు గురువు వ్యాసరాయలు కనకదాసుతో సహా తన శిష్యులను “మీలో మోక్షానికి ఎవరు అర్హులు?” అని ప్రశ్నించగా క్షణం ఆలోచించకుండా “నేనే కాదు వీళ్ళెవ్వరూ అర్హులు కాదు” అన్నాడు. గురువు రెట్టించి అడిగినా అదే సమాధానం చెప్పటమే కాదు “నేను మోక్షానికి వెడతానా?” అని

గురువు అడిగితే “మీరూ వెళ్ళలేరు” అని ఖచ్చితంగా చెప్పాడు. దీనికి శిష్యులతో సహా గురువుకు కూడా విపరీతమైన కోపం వచ్చింది దాసు మీద. చివరికి గురువు దాసును “నీకు మోక్షానికి వెళ్లాలని లేదా” అని అడగగా “నేను అనేది పోతే అంతాపోతుంది-మోక్షం వస్తుంది” అన్నాడు. శిష్యుడి పరమ వేదాంత భావనకు గురువు పరమానందం పొందాడు. ఆతర్వాత రమణ మహర్షి కూడా “నే నెవరు అని తెలుసుకొంటే అంతా తెలుస్తుంది” అని చెప్పిన సంగతి మనకు తెలుసు.

మరొకసారి వ్యాసరాయల వారు తమ పూజామందిరంలో భగవంతునికి మానసిక పూజ నిర్వహిస్తున్నారు. ఒక పూలహారాన్ని భగవంతుని మెడలో వేస్తున్నట్లుగా ఊహిస్తూ, తలపై ఉన్న కిరీటం అడ్డు వస్తున్నదని, భగవంతుని తలపై కిరీటం తీస్తున్నట్టుగా మానసికంగా భావిస్తున్నారు. అంతలో శిష్యుడు అటుగా వస్తూ, గురువర్యా! ఆ కిరీటమేమో పెద్దది. పూలదండ చిన్నదిగా ఉన్నది. పూలదండను పాదాల దగ్గర పెట్టకూడదా! అంటూ దూరంగా కూర్చున్నాడు. ఆ శిష్యుని మాటలు గురువుగారిని మరొకసారి దిగ్భ్రమకు గురిచేశాయి. మానసిక పూజ చేసు కుంటున్న గురువుగారు చూసిన దృశ్యం శిష్యుడికి ఎలా కనిపించింది? అని ఆశ్చర్యపోయారు. ఆ శిష్యుడు సామాన్యుడు కాడని తెలుసుకున్నారు. ఈ రెండు సందర్భాల్లో వ్యాసరాయల వారిని ఆశ్చర్యానికి గురిచేసిన శిష్యుడే కనకదాసు.

మహా భక్తునిగా, జీవన్ముక్తునిగా కనబడుతున్న కనకదాసు మొదట్లో ప్రాపంచిక వ్యామోహాల్లో పడి కొట్టుకుపోయాడు. తల్లిదండ్రులిద్దరూ శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులైనప్పటికీ తాను మాత్రం ఒక లక్ష్యం అంటూ లేకుండా తిరిగాడు. కృష్ణదేవరాయలు పాలించే కాలంలో కనకదాసు తండ్రి బీరప్ప ఒక పశువుల కాపరి. తరువాత రాజ్య అవసరాల రీత్యా యుద్ధ విద్యలు నేర్చుకుని రాయలవారి కొలువులో సైనికునిగా పనిచేశాడు. తల్లి బుచ్చమ్మ. వారు కులం రీత్యా ఆరోజుల్లో అగ్రవర్ణం వారు కాకపోయినా చుట్టుపక్కల మంచి పేరు తెచ్చుకున్నారు. చాలా రోజులు వారికి సంతానం కలుగలేదు. వారు వేంకటేశ్వరుని పరి పరి విధాల ప్రార్థింపగా వారి భక్తికి మెచ్చి, ఒక పుత్రుని ప్రసాదించాడు వేంకటేశ్వరుడు. ఆ పిల్లవాడికి తిమ్మప్ప అని పేరు పెట్టుకుని గారాబంగా పెంచుకోసాగారు. గారాబం వల్ల తిమ్మప్పకు చదువు అబ్బలేదు. తండ్రి సైనికుడు కావడం వల్ల తండ్రి ద్వారా కత్తిసాము, కర్రసాము నేర్చుకున్నాడు. కాని సరైన గమ్యం లేకుండా ఉండేవాడు. తల్లిదండ్రులు, కట్టుకున్న భార్య చనిపోయారు. దాంతో తిమ్మప్పను అభిమానించేవారు ఎవరూ లేకుండాపోయారు. అయినా తిమ్మప్ప పెద్దగా చింతించలేదు. ఒక్క బాధ మాత్రం పట్టుకున్నది. అదే అతని జీవితాన్ని మలుపు తిప్పింది. ఒకరోజు ఆదికేశవ స్వామి కనకదాసు కలలో కనిపించి, అతనిని వ్యాసరాయ అనే గురువు వద్దకు జ్ఞాన సముపార్జన కోసం వెళ్లమని చెప్పాడు. అదే విధంగా కనకదాసు హంపీలో ఉన్న వ్యాస రాయుని దర్శనం చేసుకొని జ్ఞానభిక్షకై ప్రార్థించాడు. అంతటి గురువు కూడా కనకదాసు నిమ్న జాతి వాడని అతనికి విద్య ఉపదేశించడానికి నిరాకరించాడు. కనకదాసు ఎంతకూ గురువును వదిలి వెళ్లడానికి ఇష్టపడక పోయేటప్పటికి అతనిని వదిలించు కోవడానికి వ్యాసరాయుడు ఎదురుగా ఒక దున్నపోతు కనిపిస్తుంటే, ఆ దున్నపోతు నామాన్నే మంత్రంగా ఇచ్చి, జపించమని పంపివేశాడు. గురువు మీద అచంచల భక్తితో కనకదాసు అదే నామాన్ని ఏకాంత ప్రదేశంలో జపించడం మొదలుపెట్టాడు. అప్పుడు యమ ధర్మరాజు తన వాహనమైన దున్నపోతు ఎక్కి వచ్చి, కనకదాసును వరం కోరుకోమని అడిగాడు. దేవా! నాకేమీ కోరికలు లేవు. మా గురువుగారికి ఏమైనా ఉన్నాయేమో కనుక్కోమన్నాడు. ఆ దున్నపోతు గురువుగారిని వరం కోరుకొమ్మన్నది. ఈ హఠాత్ సంఘటనకు గురువుగారికి ముచ్చెమటలు పోశాయి. అయినా వచ్చిన అవకాశం వదులుకోవడం ఇష్టం లేక తమ ఆశ్రమానికి పక్కగా ప్రవహిస్తున్న నది ప్రవహించడానికి అడ్డంగా ఉన్న ఒక పెద్ద బండరాయిని తొలగించి, నీటి ప్రవాహాన్ని సుగమం చేయమని చెప్పాడు. ఆ విధంగా చేయబడిన సొరంగం, కనకతూములు పేరుతో చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో ఉన్నాయని చెప్తారు. ఈ సంఘటన తరువాత వ్యాసరాయనికి కనకదాసు భక్తి, విశ్వాసాలు అవగతమయ్యాయి. అంతటి భక్త శిఖామణి

కనకదాసు. భక్త కనకదాసు 90 ఏళ్ల నిండు జీవితం గడిపాడు. వేలకొద్దీ కీర్తనలు రచించాడు. అనేక దేవాలయాలు కట్టడానికి కారణభూతుడయ్యాడు. అనేక మంది భక్తులుగా మారి, వైరాగ్య జీవితం గడుపడానికి మార్గదర్శకంగా నిలిచాడు. భక్త కనకదాసు జీవితమే భగవంతుని అస్తిత్వానికి నిదర్శనం.

ప్రతిరోజూ ఆదికేశవస్వామి తిమ్మప్పకు కలలో కనిపించేవాడు. ఏదైనా వరమిస్తాను కోరుకొమ్మని విసిగించేవాడు. తిమ్మప్ప మాత్రం తనకు ప్రాపంచిక సుఖాల మీద వ్యామోహం తగ్గలేదనీ తనకు ఆయన వరాలు, భక్తి, మోక్షం అవసరం లేదని తెగేసి చెప్పేవాడు. ఇలాంటి సమయంలోనే ఒకసారి శత్రురాజుల మీద చేసిన యుద్ధంలో తిమ్మప్ప కూడా పాల్గొన్నాడు బాగా గాయపడి, స్పృహ కోల్పోయాడు. ఆ సమయంలో ఆదికేశవ స్వామి మళ్లీ కనిపించి, వరం కోరుకోమన్నాడు. తిమ్మప్ప మామూలు ధోరణిలో స్వామీ! నీవు నా వెంట ఎందుకు పడుతున్నావు? ఎందరో భక్తులు నీ దర్శనం కోసం, వరాల కోసం అడుగుతారు కదా! వారిని సంతోషపెట్టరాదా! అని విసుగ్గా అన్నాడు. దానికి స్వామి కోపం తెచ్చుకోకుండా చిరునవ్వుతో, తిమ్మప్పా! నీవు దెబ్బ తగిలి బాధలో ఉన్నట్టున్నావు. నేను నీ వెనుకనే ఎందుకు తిరుగుతున్నానో కారణం చెబుతాను. విను. నీ పూర్వ జన్మలో నీవొక ప్రసిద్ధ పండితుడవు. నా భక్తుడవు. నీ ప్రారబ్ధ కర్మల వలన ఈ జన్మలో నా యందు మనసు లగ్నం చేయలేకపోతున్నావు. నీ సంచిత ఫలం ఇప్పుడు నీకు అక్కరకు వచ్చే సమయం ఆసన్నమైంది అని మృదువుగా చెప్పాడు. తిమ్మప్పకు సంచితం, ప్రారబ్ధం అనేవి అర్థం కాకపోయినా విషయం ఏదో కొంచెం అర్థమవుతున్నట్టు అనిపించింది. అయితే తన సాధారణ మొండితనంతో దేవునితోనే బేరమాడాడు. స్వామీ! నువ్వు చెప్పేదంతా నేను నమ్మాలంటే నాకున్న ఈ గాయాలు, నొప్పులు వెంటనే తగ్గించు. అప్పుడు నువ్వు చెప్పినట్లు చేస్తా అన్నాడు తిమ్మప్ప. ఆది కేశవ స్వామి వెంటనే తన కరస్పర్శతో తిమ్మప్ప నొప్పులను మటుమాయం చేశాడు. దైవస్పర్శ తగిలిన తిమ్మప్ప దిగ్గున లేచి కూర్చున్నాడు. భగవానుడు అంతర్ధానమయ్యాడు. మరుక్షణం నుంచే తిమ్మప్పకు భగవంతునిపై ఆలోచనలు అధికం కాసాగాయి. భగవంతుని స్మరణ లేకుండా ఉండలేకపోయేవాడు. కొన్నాళ్లకు కనకదాసు తీర్థయాత్రలు చేయ సంకల్పించి గురువుగారి అనుమతితో పర్యటనకు బయలుదేరాడు. అనేక పవిత్ర జలాలలో స్నానాలు చేస్తూ దేవుళ్లందరినీ దర్శించుకోసాగాడు. ఆ పర్యటనలో భాగంగా తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుని దర్శించుకోవడానికి వెళ్లాడు. కనకదాసు రాకను వేంకటేశ్వరుడు గుర్తించాడు. కనకదాసుకు ప్రత్యేక దర్శనం చేయించమని గుడికి సంబంధించిన మహంతును ఆదేశించాడు. కాని మహంతు అతి సామాన్యునిగా ఉన్న కనక దాసును గుర్తించలేకపోయాడు. కనకదాసేమో దర్శన భాగ్యం దొరకక ముఖద్వారం వద్దనే తారట్లాడసాగాడు. అదే సమయంలో భగవంతునికి అలంకరించే నగలు కొన్ని మాయమైనట్లు అధికారులు గుర్తించారు. ఆలయం ఎదుట అనవసరంగా తిరుగుతున్నాడని భావించి, కనక దాసును దొంగతనం నేరంపై బంధించారు. కొరడా దెబ్బలతో హింసించారు. కనకదాసు స్పృహ తప్పి పడిపోయాడు. అప్పుడు ఆర్తత్రాణ పరాయణుడైన వేంకటేశ్వరుడు మహంతు కలలో కనిపించి ఆయనపై కోపం ప్రదర్శించాడు. గౌరవంగా దర్శనం చేయించమని నేను ఆదేశిస్తే, కొరడా దెబ్బలు తినేటట్లు చేస్తావా? అని కన్నెర్రజేశాడు. మహంతు హడలిపోయి. అప్పటికప్పుడు అర్ధరాత్రి కనకదాసును విడిపించి, సపర్యలు చేసి, తన తప్పును మన్నించమని ప్రార్థించాడు. ఆయనకు ప్రత్యేక దర్శనం చేయించాడు. కనకదాసుకు స్వామి దర్శనం కాగానే పోయిన నగలు దొరికినట్లుగా మహంతుకు వర్తమానం వచ్చింది. అప్పుడు ఇద్దరికీ స్వామిలీల అర్థమైంది.

వ్యాసరాయలు శ్రీ కృష్ణ దేవరాయల గురువు. ఉడిపిలో ఉండేవాడు కనకదాసు కూడా గురువుతో అక్కడే ఉన్నాడు. ఉడిపి శ్రీ కృష్ణ దర్శనానికి కనకదాసును బ్రాహ్మణ పూజారులు వ్యాసరాయలు చెప్పినా అనుమతి నిరాకరించారు. కనకదాసు గుడిబయట పడమర వైపు కూర్చుని శ్రీకృష్ణ కీర్తనలు కొన్ని రోజులపాటు భక్తితో పారవశ్యంతో గానం చేశాడు. కానీ కర్కశ హృదయులైన పూజారులకు కనికరం కలగలేదు లోనికి అనుమతించలేదు. ఒకరోజు తూర్పున ఉన్న కృష్ణ విగ్రహం తన భక్తుడికి దర్శనం ఇవ్వాలని ఒక్కసారిగా పడమర వైపుకు తిరగటం, ఆలయం గోడ కూలిపోయి కనకదాసుకు కనకమహాలక్ష్మీ విభుడైన శ్రీ కృష్ణస్వామిదివ్య దర్శనం లభించింది. పూజారులు అప్రతిభులయ్యారు కనకదాసు మహాభక్తికి నీరాజనాలు పలికి సగౌరవంగా ఆలయ ప్రవేశం చేయించారు. ఉడిపి కృష్ణాలయం ముఖద్వారం తూర్పు వైపున ఉంటుంది. మొదట్లో కృష్ణ విగ్రహమూ తూర్పుకే ఉండేది. కనకదాసుకు దర్శనం ఇవ్వటానికి కృష్ణుడే దిశను మార్చు కున్నాడు. అప్పటినుంచి ముఖద్వారం తూర్పుకు ఉన్నా, కృష్ణ విగ్రహం పడమటి వైపే ఉంటోంది. భక్తవరదుడు అంటే ఇదే. ఇప్పుడు ఇక్కడ ఉన్న కిటికీని "కనకదాస కిటికీ" అంటారు. ఈ కిటికీ లోంచే ఉడిపి కృష్ణుని దర్శిస్తారు. అంతటి చరిత్ర సృష్టించాడు.

ఆ సంఘటన తరువాత వెంటనే ఆదికేశవ స్వామి దేవాలయానికి పరిగెత్తి దర్శనం కోసం లోపలకు అడుగుబెడుతుండగా ద్వారాలు మూసుకున్నాయి. స్వామీ! నాలో జ్ఞానద్వారాలు తెరిపించి, నీ దర్శన భాగ్యం మటుకు కలుగకుండా కోవెల ద్వారాలు మూసినావా? అని పరితపిస్తూ ఆశువుగా కీర్తనలు పాడసాగాడు. నీవు గజరాజు పిలుపు మేరకు, లక్ష్మీదేవి చెంతనే ఉన్నా, వెంటనే వెళ్లి మకరిని సంహరించావు. ప్రహ్లాదుడనే బాలుడి కోరిక మేరకు స్తంభంలో నుంచి దర్శనమిచ్చి

రక్షించావు. అందరికీ అంత దయామయుడివిగా ఉండి, నా విషయంలో ఎందుకు క్రూరంగా ఉన్నావు స్వామీ! తలుపులు తీసి దర్శనమీయవా! అని వేదనతో తిమ్మప్ప ప్రార్థించసాగాడు. స్వామి దర్శనం కోసం పిచ్చివానివలె ఏడవసాగాడు. ఆ గుడి తలుపులకు తన నుదుటిని బాదుకోసాగాడు. రక్తం చిమ్మింది. భగవంతుడు ఇక తిమ్మప్పను పరీక్షించదలుచుకోలేదు. తలుపులు తెరుచుకున్నాయి.

తిమ్మప్పకు ఆదికేశవ స్వామి దర్శనమవగానే మధురమైన పాట అతని నోటి నుండి వెలువడింది. దేవా! నేను నీ దాసుడను. నా చివరి శ్వాస వరకు నీ నామమే స్మరిస్తాను. జన్మ జన్మలు ఎత్తి నీ మహిమలను వ్యాప్తి చేస్తాను అని ఆర్తిగా కీర్తిస్తూ సంపూర్ణ శరణాగతి పొందాడు తిమ్మప్ప. ఆనాటి నుండి తిమ్మప్ప కనకదాసుగా నామాంతరం చెందాడు. అతని ప్రవర్తనలో అద్భుతమైన మార్పు వచ్చింది. శారీరక సుఖాలపై అనురక్తి తగ్గింది. భగవంతునిపై ఆర్తి హెచ్చింది. కనకదాసు ఆలోచనలన్నీ స్వామి చుట్టూ కేంద్రీకృతమయ్యాయి మహాభక్తుడైన కనకదాసు. ఆలయ గోపురం ముందు చిన్నగుడిసెలో ఉండేవాడు. తర్వాత దాన్ని ఒక మందిరం లాగా కట్టి "కనక మందిరం" అని పిలుస్తున్నారు. మహాభక్తుడైన పురందరదాసు, వ్యాసరాయలూ కృష్ణభక్తులే అయినా కనకదాసుకూ కృష్ణస్వామికి ఉన్న అనుబంధం అన్నిటి కన్నా మించినది. కనకదాసు ఏదిరాసినా సామాన్యులకు అర్థమయేటట్లు వారికి అందుబాటులో ఉండేటట్లే రాశాడు. ఆయన రాసిన "రామ ధ్యాన చరిత" లో రాగి ధాన్యానికి, బియ్యానికి ఉన్న స్పర్థను చక్కగా అభి వర్ణించాడు. రాగి పేదవాళ్ళ ఆహారం. బియ్యం ధనవంతుల ఆహారం. బియ్యం గొప్పదే అయినా రాగిలో పోషకాహార విలువ ఎక్కువ. దీన్నే ఆయన అందులో నిరూపించాడు. బీద, ధనిక భేదాన్ని పేదయైనా వ్యక్తిత్వంలో మిన్నగా ఉండే విధానాన్ని ఇందులో ప్రతీకాత్మకంగా చెప్పాడు. ఆనాటి సమాజంలో హరిదాసు ఉద్యమం బాగా ఉండేది. దాస సంప్రదాయానికి చెందిన కనకదాసు విస్తృతంగా పర్యటించి ఆ సంప్రదాయం వ్యాప్తి చేస్తూ ప్రజలలో భక్తి, సామాజిక బాధ్యతా, సమత్వం పెంపొందించాడు. సామాజిక అంశాలను నీతిని భక్తితో జోడించి చెప్పాడు. తన కీర్తనలలో వర్ణ వ్యవస్థను ఏకిపారేశారు. అందరూ సమానమే అన్నాడు. "కులకుల వేందు హోడె దాదరి" అన్న కీర్తనలో కులం కులం అని ఎందుకు మొత్తుకొంటారురా అని చివాట్లు పెట్టాడు.



ఇవాళ కర్ణాటక హావేరి జిల్లా లోని కాగినేలిలో కొలువై ఉన్న ఆదికేశవ స్వామికి అత్యంత భక్తుడు కనకదాసు. కనకదాస విరచిత 240 కృతులు సజీవంగా ఉండి కర్ణాటక సంగీత గాయకుల నోట ప్రచారమవుతున్నాయి. ఈ కీర్తనలో ముద్ర "కిగినెలె ఆదికేశవ" అని ఉంటుంది. కీర్తనలు రచించటమే కాదు అదోజగత్ సహోదరులను ఉన్నత స్థితికి తీసుకురావటానికి సంఘ సంస్కరణ ఉద్యమాలు చేశాడు. కనకదాసు జీవిత చరమాంకంలో తిరుపతిలో బాలాజీ సన్నిధిలో గడిపి, నూరేళ్లు నిండు జీవితాన్ని అనుభవించి 1609 లో శ్రీ కృష్ణ సన్నిధానం చేరుకొన్నాడు. యవ్వనంలోనే కనకదాసు 1-నలచరిత్ర, 2-నృసింహస్తోత్రం, 3-హరిభక్తి సార, 4-రామధ్యాన చరిత్రే, 5-మోహన తరంగి కన్నడంలో రచించాడు. కనకదాసు కవిత్వం చక్కని ఉపమానాలతో సహజ సుందరంగా సరళంగా ఉంటుంది. శ్రీ కృష్ణుని ద్వారకా నగరాన్ని విజయనగరంగా పోల్చి విదేశీ రాయబారులు విజయనగరాన్ని వర్ణించిన తీరును దృష్టిలో పెట్టుకొని గొప్పగా వర్ణించాడు. శ్రీ మధ్వాచార్యులు ఉడిపి కృష్ణ మఠములో ఉన్న కాలములో, కనకదాసు అనే పేరు కలిగిన తక్కువ జాతికి చెందిన ఒక వ్యక్తి కృష్ణుని ఆరాధనలో లీనమై ఉండేవాడు. ఉడిపిలో ఉన్న కృష్ణుడి దివ్య మంగళ విగ్రహాన్ని కనులారా చూడాలని ఎంతో ఆరాటపడేవాడు. కానీ, అతనికి ఆలయ ప్రవేశార్హత లేనందున బయట నిలబడి భక్తిగా నమస్కరించేవాడు. ఆలయం వెనుక ఉన్న ఒక చిన్న గుడిసెలో నివసిస్తూ కృష్ణ భక్తిలో లీనమై ఉండేవాడు. అతని భక్తికి, ఆర్తికి పరవశుడైన కృష్ణుడు అతని కుటీరం వైపుగా తిరిగాడు. అక్కడ ఉన్న గోడలో చిన్న చీలిక కూడా ఏర్పడేలా చేసాడు. అది గమనించిన కనకదాసు తన భాగ్యానికి పొంగిపోతూ ఆ సన్న సందులో నుంచి కృష్ణ దర్శనం చేసుకుని తన జన్మ చరితార్థం అయింది అని భావించేవాడు. ఏమిటి ఇలా జరిగింది అని ధ్యానంలో తెలుసుకున్న మధ్వాచార్యులు అమితమైన ఆనందంతో ఆ భక్తుని గౌరవించి గోడలోని చీలికను పూడ్చకుండా అక్కడ ఒక కిటికీ ఏర్పాటు చేయించి మరింత సులువుగా కనకదాసు కృష్ణుడి దర్శనం చేసుకునే వీలు కల్పించారు. భగవంతుని కృపకు పాత్రులు అవ్వడానికి ఏ భేదాలు అడ్డు రావని, ప్రేమతో కూడిన భక్తి మాత్రమే మార్గమని మరొకసారి ఆ భక్తుని ఆదరించి లోకానికి చాటారు. ఇప్పటికీ ఉడిపిలో అదే ఆచారం కొనసాగుతోంది. కృష్ణుడి దర్శనం ఇప్పటికీ కనకదాసు గారి కోసం నిర్మించబడిన కిటికీలో నుంచే ఉంటుంది. అంటే భగవంతుడు భక్త పరాధీనుడు. కుల మత భేదాలకు అతీతముగా ఆ పరంధామునికి భక్తితో చేరువ అవ్వవచ్చు అని కలియుగములో కూడా రుజువు అయ్యింది. మనమంతా కూడా కనకదాసు గారిలా ఆ భక్త సులభుని పాదారవిందము లను వదలకుండా పట్టుకుని తరిద్దాము.

**ఓం నమో భగవతే వాసుదేవాయనమః**




# శ్రీకృష్ణ జననం

– ఎస్.ధర్మారావు

**అష్టమి రోహిణి పొద్దున**
**నష్టమ గర్భమున బుట్టి! యా దేవికి కిన్**
**దుష్టని కంసువధింపువె**
**సృష్టి ప్రతిపాలనమ్ము! సేయగ కృష్ణా!**

పూర్వము రాజ లాంఛనాలతో వేలకొలది రాక్షసవీరులు తన్ను ఆక్రమించేసరికి ఆ భారాన్ని మోయజాలక భూమి గోరూపధారిణియై బ్రహ్మాదుల వెంట వైకుంఠానికి వెళ్ళింది. అచట సర్వ భువనాలకి అధీశ్వరుడైన శ్రీమన్నారాయణునితో మొర పెట్టుకుంది. దానికి భగవంతుడు భూభారం తగ్గించడానికి తాను వసుదేవుని ఇంట జన్మిస్తానని చెప్పి దేవతలను కూడా వారి వారి అంశలతో యదుకులంలో జన్మించమని ఆదేశించాడు. శేషుడు తనకు అన్నగారుగా ముందే జన్మిస్తాడని, దేవకన్యలు దేవకార్యం నెరవేర్చడానికి వారిని పూజించడానికి జన్మించుతారని చెపుతాడు. ఈ ప్రపంచం అంతా ఏ మాయ చేత నిత్యం మోహితం అవుతూ ఉంటుందో అలాంటి యోగమాయ ఆ శ్రీహరి ఆజ్ఞను పాటించడానికై నిజాంశతో ఆడశిశువుగా పుడుతుంది. అతని మాటలకు సంతసించి భూదేవి తిరిగి వచ్చింది. బ్రహ్మ, ఇతర దేవతలు తమ తమ స్థానాలకు తిరిగి వెళ్ళారు.

ఆ సమయంలో యదు వంశపు వాడైన శూరసేన మహారాజు మధురాపురాన్ని తనకు రాజధానిగా చేసుకుని శూరసేన దేశాలను పరిపాలిస్తూ ఉన్నాడు. ఆ శూరసేనుని కుమారుడు వసుదేవుడు. అతడు మధురలో దేవకిని వివాహమాడి ఆమెతో కూడా రథారూఢుడై తన స్థానానికి బయలుదేరి వెళుతున్నాడు. రాజైన దేవకుడు శంఖాలు, పటాలు, భేరులు హోరెత్తి మోగుతూ ఉండగా తన పుత్రిక యైన దేవకీ దేవికి ఆరణంగా మసిజ్జతమైన పద్దెనిమిది వందల రథాలు, బంగారు చేరులు, అలంకరించబడి ఉన్న నాలుగు వందల ఏనుగులను, పదివేల అశ్వాలను, విలాసవంతులైన దాస దాసీ జనులను రెండు వందల మందిని ఇచ్చి సాగనంపాడు. అప్పుడు ఉగ్రసేనుని పుత్రుడగు కంసుడు దేవకి తనకి వరుసకు చెల్లెలు కనుక ఆమెయందు గల సోదరి ప్రేమతో పగ్గాలు చేతపట్టి ఉల్లాసంగా దేవకీ వసుదేవులున్న రథాన్ని తోలసాగాడు. అలా కొంతదూరం వారి ప్రయాణం సాగింది. ఇంతలో హఠాత్తుగా అశరీరవాణి ఇలా పలికింది.

‘‘ఓ కంసా! నీ సోదరిని ఎంతో ఆనందంతో అత్తవారి ఇంటికి సాగనంపుతున్నావు. కాని భావిలో జరిగేది తెలుసుకోలేకపోతున్నావు. నీ చెల్లెలు ఎనిమిదో కానుపులో

పుట్టేవాడు నిన్ను కడతేరుస్తాడు సుమా!

ఆ మాటలు వినగానే కంసునికి దేవకి రూపం మృత్యుస్వరూపం లాగున గోచరించింది. అభిమానం, సోదరి ప్రేమ పటాపంచలై పోయాయి. వెంటనే కంసుడు రథం మీదనుంచి దేవకిని కొప్పు పట్టి క్రిందకి లాగి ఒర నుంచి కత్తి దూసి ఆమె తల నరకడానికి సిద్ధపడ్డాడు. అప్పుడు వసుదేవుడు ఒక్క క్షణంలో అతనికి అడ్డు వచ్చి తన సామ్య వాక్యాల అమృతంతో అతనిని శాంత పరచడానికి పలు విధాలా ప్రయత్నిస్తూ ఇలా అన్నాడు.

**ఉ॥ అన్నవు నీవు చెల్లెలి కక్కట! మాడలు చీరలిచ్చుటో**
**మన్ననచేయుటో మధురమంజులభాషతో నాదరించుటో**
**మిన్నుల మ్రోతవే నిజము మేలని చంపకు మన్న, మాని రా**
**పన్నసంహింపు మన్న! తగదన్న! వధించకు మన్న! వేడెదన్**

బావా! నీవు దేవకి అన్నవు. అన్న చెల్లెలికి మాడలు, చీరలు ఇచ్చి మన్నన చేయాలి. మధుర మంజులమైన మాటలతో అలరించాలి. అంతేకాని ఆకాశం నుండి ఏదో వినపడింది అని అదే నిజమని నమ్మి చెల్లెలిని చంపకూడదు. అది నీకు తగని పని. అందుచేత ఆమెను చంపకు. ఆ ప్రయత్నం మానుకో.

ఓ రాజా! నీ చెల్లెలు అమాయిక. ఎప్పుడూ నీ క్షేమం కోరుతూ ఉంటుంది. నిర్మలాంతఃకరణ. అలాంటి దానిని ఏదో ఆకాశవాణి పలికింది కదా అని నీ మర్యాద, మన్నన పోగొట్టుకొని చంపబూనడం సత్కుల సంజాతుడవైన నీకు తగదు. నీవు పుణ్యమూర్తివి. అట్టి నీవు కోపానికి లోనవడం చాలా పాపం. అందుచేత చెల్లెల్ని చంపడం అనేది ఎంత హేయకృత్యమో ఆలోచించు. ఇంకా నేను చెప్పే ఈ మాటలు విను.

దేహికి జన్మించగానే మృత్యువు కూడా వెన్నంటియే ఉంటుంది. అది రేపు కావచ్చు లేదా నూరేళ్ళ తరువాతైనా రావచ్చు కాని "జాతస్య హి ధృవో మృత్యుః" అన్న ఆర్యోక్తి ప్రకారం పుట్టినవాడెపుడో ఒకపుడు గిట్టక తప్పదు. ఈ పాంచభౌతిక దేహం మరణ సమయంలో పంచత్వం పొందగానే కర్మానుసారం ఈ దేహి (జీవుడు) మరియొక శరీరం పొందుతాడు. వెనుకటి శరీరం శిథిలమవుతుంది. ఒక జన్మలో చేసిన కర్మఫలం మరుసటి జన్మలో పక్వానికి వచ్చి అనుభవం లోనికి వస్తుంది. చేసిన కర్మ ఎప్పటికీ చెడిపోదు. "బుద్ధిః కర్మానుసారిణీ" అన్నట్లుగా లోగడ చేసుకున్న కర్మననుసరించి ఇపుడు చేయబోయే పనులయందు బుద్ధి ప్రసరిస్తూ ఉంటుంది. అదేవిధంగా తాను చేసుకొనిన కర్మను అనుసరించి ఏర్పడిన అవయవాలు కలిగిన శరీరంలో ప్రవేశించి రాగద్వేషాలకు అనుగుణంగా దేహి ప్రవర్తిస్తూ ఉంటాడు. కర్మఫలం వల్ల మేలు కలగవచ్చు లేదా కీడు కలగవచ్చు. తనకు కర్త ఎవరు అంటే తాను చేసుకొనిన కర్మమే. బ్రహ్మకైనా తన కర్మకు లోబడక తప్పదు. ఇక సామాన్యుల మాట చెప్పాలా!

**కం॥ కర్మములు మేలు నిచ్చును**
**గర్మంబులు కీడునిచ్చు, కర్తలు దనకున్**
**గర్మములు బ్రహ్మకైనను**
**గర్మకుడై పరుడల దడవగా! నేమిటికిన్**

**కం॥ కావున పరులకు హింసలు**
**గావింపగవలదు తనకు! గళ్యాణముగా**
**భావించి పరుల నొంచిన**
**బోవునె తత్ఫలము పిదప! బొందక యున్నే**

అని కంసునితో అనునయ వాక్యాలు పలికి తనలో ఇలా అనుకొన్నాడు. ఆపదలో ఉన్న భార్యను రక్షించుకోవడం కోసం బిడ్డలను తీసుకొని వచ్చి ఇస్తాను. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో అని చెప్పడం మేలు. ముందు ఏమి జరుగనున్నదో ఎవరికి ఎరుక. మూలం అయిన ఈమె బ్రతికి ఉంటే, పుట్టిన సుతులకు మృత్యువే నిశ్చయమైతే ఎవరు తప్పించగలరు? బ్రహ్మ ఇతనికి మృత్యువే రాసి పెడితే దాన్ని ఎలా తప్పించుకోగలడు? కొడుకులు పుట్టగానే తెచ్చి నీకు ఇస్తాను అని చెప్పి ప్రస్తుతం ఈమె మరణాన్ని తప్పించడం కర్తవ్యం. కొడుకులు పుట్టిన తర్వాత ఏదో కారణం చేత కృత్యం తారుమారు కాకూడదా? ఎనిమిదవ సంతానం ఇతణ్ణి చంపగలదని కదా ఆకాశవాణి పలికింది. అది ఎందుకు తప్పిపోతుంది? ఇపుడు భార్యను రక్షించుకోవడం నా కర్తవ్యం అని కంసునితో సాంత్వ వచనాలతో ఇలా అన్నాడు.

అదికాక ఈమెకు పుట్టబోయే ఎనిమిదవ సంతానం వల్ల కదా నీకు ప్రాణాపాయం అని ఆకాశవాణి చెప్పింది. దేవకికి పుట్టే పిల్లలనందరినీ నీకు అప్పగిస్తూ ఉంటాను. వారిని నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. అబల, సాధువు అయిన నీ చెల్లెలిని మాత్రం చంపకు అని బ్రతిమలాడాడు. అతని మెత్తని మాటలకు తృప్తి చెందిన కంసుడు దేవకీ వసుదేవులను అచటనే వదిలిపెట్టి తన గృహానికి చేరాడు.

ఒకరోజున త్రిలోకసంచారి, బ్రహ్మ మానసపుత్రుడు అయిన దేవర్షి నారదుడు కంసుని ఇంటికి వచ్చాడు. ఏకాంతంలో కూర్చుని ఉండగా ప్రసంగవశాత్తు చెప్పినట్లుగా నారదుడు అతనితో నీవు పూర్వజన్మలో కాలనేమి అనే రాక్షసుడవని, శ్రీహరి ఖడ్గానికి బలి అయ్యావు అని, మందలో ఉన్న నందాదులు, దేవకీ వసుదేవులు మొదలైన వారంతా దివినుండి భువికి దిగివచ్చి మానవ రూపంలో ఉన్న దేవతలని, ఆ శ్రీహరి దేవకీదేవి ఎనిమిదవ గర్భంలో జన్మించి దైత్యులను చంపడానికి ప్రయత్నిస్తాడని చెప్పి తన దోవన తాను వెళ్ళిపోయాడు.

నారదుని మాటలు విన్నాక కంసునికి అదురుపాటు కలిగింది. అయ్యో పొరపాటు చేశానే అని కలత చెందిన మనసుతో యాదవులంతా తనకు శత్రువులని, తాను రాక్షస జాతికి చెందిన వాడినని భావించి దేవకీ వసుదేవులకు బేడీలు వేసి చెరసాలలో పెట్టించి గట్టి కాపలా పెట్టించాడు. వారి ఆర్గురు పుత్రులను చంపాడు. ఆ కోపంలో తండ్రియైన ఉగ్రసేనుణ్ణి చెరలో పెట్టించి తానే శూరసేన దేశానికి రాజునని ప్రకటించి సింహాసనం ఎక్కి రాజ్యపాలనం చేయడం మొదలుపెట్టాడు.

శ్రీహరి అంశ భాగంతో వసుదేవుని మనస్సులో ప్రవేశించి అతని ద్వారా దేవకి గర్భంలో ప్రవేశించాడు. ఆ సర్వేశ్వరుని గర్భంలో ధరించిన ఆ సతీమతల్లి పూర్ణచంద్రుడు కలిగి వున్న తూర్పుదిక్కు వలె మిక్కిలి శోభతో ప్రకాశించింది. తాను చెరసాలలో బంధించినా ఎంతమాత్రం అయినా కనుగొందక రోజు రోజుకూ వృద్ధి పొందుతూ ఉన్న ఆమె గర్భాన్ని దానితో పాటు వర్ధిల్లే ఆమె ముఖంలోని తేజస్సు చూసి ఆశ్చర్యపడ్డాడు కంసుడు. దేవకికి క్రమంగా దోహద క్రియలు జరిపాడు. తన కోపాన్ని దిగమింగుకుని, తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో కాలం గడుపుతూ ఉన్నాడు. శిశువు పుట్టగానే నా కత్తికి ఎర చేస్తాను అని అనుకుంటున్నాడు కంసుడు. అలా శత్రుత్వం వహించడం చేత కంసుడు ఇతర ధ్యానములన్నీ మరచి సదా శ్రీహరి మీదనే ధ్యానం లగ్నం చేసి ఉన్నాడు.

దేవతల భవిష్యద్వాణి నిజమగునట్లు మరునాటి రేయి దేవకీదేవి నీళ్ళాడి పుత్రుని ప్రసవించింది. అపుడు సముద్రాలన్నీ స్వచ్ఛమైన జలాలతో పొంగి పొరలాయి. మేఘాలు లయకు తగ్గట్లుగా ఉరిమాయి. ఆకాశం కూడా గ్రహ తారకలతో స్వచ్ఛంగా ప్రకాశించింది. దిక్కులన్నీ తెలివి గాంచాయి. పరిమళ భరితమైన మందమారుతం హాయి గొలుపుతూ వీచింది.

హోమాగ్నులు ప్రజ్వలించి వెలిగాయి. సరస్సులన్నీ వికసించిన తామరలతో శోభించాయి. నదులు స్వచ్ఛ జలాలతో ప్రవహించాయి. భూలోకంలోని పల్లెలు, పట్టణాలు, గొల్లపల్లెలు అన్నీ ఆనంద భరితం అయ్యాయి. పక్షుల కిలకిలా రావాలతోను పుష్పఫల సమృద్ధితోను వనాలు అన్నీ ఒప్పి ఉన్నాయి.

అలా శ్రీకృష్ణావతార శుభ సమయంలో దేవతలు పుష్పవృష్టి కురిపించారు. గంధర్వులు గానం చేశారు. రంభ మొదలైన అప్సరసలు దివ్యనాట్యం చేశారు. సిద్ధ చారణలు మొదలైన దేవతా గణాల భయం తీరిపోయింది. దేవ దుందుభులు మ్రోగాయి.

పూర్ణిమ నాడు తూర్పు దిక్కు షోడశ కళలతో నిండిన పూర్ణచంద్రుని కన్నట్లుగా దేవకీదేవి లోకరక్షకుడైన విష్ణుస్వరూపిని ప్రసవించింది. నీలమేఘ ఛాయతో చతుర్భుజాలతో, శంఖ చక్ర గద పద్మాలు గల హస్తాలతో కౌస్తుభమణితో రమణీయమైన సూత్రంతో శ్రీవత్స లాంఛనంతో శ్రీహరి జన్మించాడు. అలా నిజరూపంతో వెలసిన బాలుని చూసి వసుదేవుడు చాలా ఉత్సాహం పొంది నేటితో యాదవుల కడగండ్లు తీరిపోయాయి అని మిక్కలి సంతసమందాడు.

**తే.గీ** **బాలు బూర్ణేందు రుచిజాలు, భక్తలోక**
**పాలు సుగుణాల పాలు గృ । పావిశాలు**
**జూచి తిలకించి పులకించి । చోద్యమంది**
**యుబ్బి చెలరేగి వసుదేవు । డుత్సహించె**

దేవకీ వసుదేవులు మిగుల ఆనందమంది బాలుని అనేక విధాల స్తుతించిరి.

★★★



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 67 వ కళ్యాణము

తేది 26-06-2024 బుధవారం ఉదయం 10.30 గంటల నుండి అల్వాల్ లోని మారుతినగర్ మున్సిపల్ పార్కు ప్రక్కన గల ఇంటి నెం.1-10-71/1 వద్ద జరిగింది. దీనిని శ్రీమాన్ గంగ రవికుమార్, లలిత దంపతులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా జరిగింది.

## 68 వ కళ్యాణము

తేది 17-07-2024 తొలి ఏకాదశి పర్వదినము నాడు జరిగింది. సాయంత్రం 6 నుండి 7 వరకు భజగోవిందం, ఆ తరువాత 68వ శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభోగంగా జరిగింది. ఇది రామంతపూర్ లోని రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో జరిగింది. దీనిని శ్రీమాన్ గుంటుక రవీందర్ రెడ్డి, రూపాదేవి దంపతులు నిర్వహించారు.

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



## గో సేవ

వైకుంఠాన్ని విడిచి వెళ్ళిన శ్రీమహాలక్ష్మిని అన్వేషిస్తూ భూలోకంలోనివేంకటాచలంపర్వతానికివిచ్చేసినశ్రీమహావిష్ణువు అలసి సొలసి ఆకలి దప్పులతో అలమటిస్తున్నప్పుడు ఆయనను ఒక గోమాత తన క్షీరంతో ఆదుకుంది. ఆ విధంగా శ్రీవేంకటేశ్వరునికి, గోవులకు విడదీయరాని బంధం ఏర్పడింది. అంతేకాకుండా, హైందవ సంస్కృతిలో గోమాతకు విశిష్టమైన స్థానం ఉంది. గోమాత తనువులో ముక్కోటి దేవతలు కొలువై ఉన్నట్లుగా చెబుతారు.

అలా గోవుకు ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, గో సంరక్షణకై తి.తి.దే అనేక చర్యలను చేపట్టింది. అందులో భాగంగానేతిరుమల,తిరుపతి పట్టణాలలోవందలాది ఎకరాలలో విశాలమైన గోశాలలు ఏర్పాటు చేసి, అందులో వేలాది గోవులను సంరక్షిస్తున్నారు. వీటిలో పాలిచ్చే ఆవులతో పాటు, వట్టిపోయిన ఆవులు, లేగదూడలు కూడా ఉన్నాయి. వయసుడిగిన ఆవులను కసాయి శాలలకు తరలిస్తుంటే గోరక్షాసమితి కార్యకర్తలు వాటిని రక్షించి తి.తి.దే గోశాలలకు తరలిస్తారు.

ఆలయంలో ప్రసాదాల తయారీ కోసం, నేతిదీపాలు వెలిగించటం కోసం, అర్చకుల భుక్తి కోసం ఆలయానికి గోవులను దానం చేసే సంప్రదాయం అనాదిగా వస్తోంది. చరిత్రపుటల్లోకి వెళితే లభించిన శాసనాలను బట్టి, మొట్టమొదటగా కులోత్తుంగ చోళుడనే చోళరాజు ప్రప్రథమంగా ఆలయానికి గోవులను దానం చేశాడు. తరువాత 13వ శతాబ్దానికి చెందిన విజయగండ గోపాలుడు 33 గోవులను; యాదవరాజు వీర నరసింగ దేవరాయల వారి దేవేరి 64 ఆవులు, 2 ఆంబోతులను సమర్పించారు. ఇంకా – పెరియతెమ్మ నాయకన్న, వీరకుమార కంపన, చంద్రగిరికి చెందిన మాధవదాసన్, మహాకుండలేశ్వరుడు, సాళువ మహాదేవ మహారాజు, కందాడై రామానుజ అయ్యంగార్ వంటి ఎందరో మహారాజులు, వారి దేవేరులు, ఆచార్యపురుషులు, పీఠాధిపతులు, జమీందార్లు, వర్తకశ్రేష్ఠులు – ఇలా ఎందరెందరో శ్రీనివాసునికి గోవుల నర్పించి తరించారు.




మొట్టమొదట 'గోశాల'గా వ్యవహరించబడే ఈ గోసంరక్షణశాల తర్వాత 'శ్రీవేంకటేశ్వర డైరీ ఫామ్' గానూ, తరువాతి కాలంలో 'శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ కేంద్రం' గానూ రూపాంతరం చెందింది.

మహంతుల కాలంలో గోవిందరాజస్వామి ఆలయ పరిసరాలలో ఉన్న ఈ గోశాల, పెరుగుతున్న గోవులకు అనుగుణంగా తరువాతి కాలంలో కపిలతీర్థం మార్గంలో

గల శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ కళాశాల ప్రాంగణానికి, తదనంతరం ఇప్పుడు మహతీ ఆడిటోరియం ఉన్న ప్రదేశానికి, చివరగా తిరుపతి పట్టణ శివారులో ఇప్పుడున్న సువిశాల ప్రాంగణానికి మార్చబడింది. ప్రస్తుతం ఇందులో గోవులే కాకుండా రేవతి, పద్మ, లక్ష్మి, మహాలక్ష్మి, వైష్ణవి అనే ఏనుగులు, గుర్రాలు, ఆంబోతులు, ఒంటెలు, జింకలు, పొట్టేళ్ళు, నెమళ్ళు, బాతులు, అనేక పక్షిజాతులు కూడా పెంచబడుతున్నాయి.

దేశం మొత్తం మీద 33 జాతుల ఆవులుంటే, వాటిలో 13 జాతుల ఆవులు తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ శాలలోనే ఉండడం విశేషం. ఇందులో సంరక్షించబడుతున్న ఆవులలో చాలా వరకు భక్తులు సమర్పించుకున్నవే. దేశవాళీ ఆవుల సంతతిని వృద్ధి చేయాలనే లక్ష్యంతో మేలుజాతి ఒంగోలు వృషభాలు కూడా గోశాలలో పెంచబడుతున్నాయి. దేశవాళీ ఆవుల యొక్క పాలు, గోమయం మరియు గోపంచితాలలో ఉన్న ఔషధ విలువలను గుర్తించి, వాటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు.

గోశాలలో ఆవుల ఆరోగ్యానికి, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తారు. ప్రతిరోజు 4 సార్లు నిర్ణీత సమయాలలో పౌష్ఠికాహారాన్ని అందిస్తారు. క్రమం తప్పకుండా నిపుణులైన పశువైద్యులు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు.

పాల దిగుబడి పెంచడం కోసం గోమాతలకు సంగీతం వినిపించడం ఈ గోశాల ప్రత్యేకత. అన్నమయ్య సంకీర్తనలు, శాస్త్రీయ సంగీతం నిరంతరంగా వినిపిస్తున్నందువల్ల పాల దిగుబడి వృద్ధి చెందినట్లు శాస్త్రోక్తంగా వెల్లడైంది.

రోజూ కొన్నివేల లీటర్ల పాలు ఉత్పత్తి అయినప్పటికీ, పాలను విక్రయించే సాంప్రదాయం లేదు. ఉదయం, సాయంత్రం సేకరించిన స్వచ్ఛమైన పాలు, పెరుగు, వెన్న స్వామివారి సేవకు, దేవాలయ అవసరాలకు వినియోగిస్తారు. మిగిలిన వాటిని వివిధ దేవస్థానాలకు, ఫలహార శాలలకు, అతిథి గృహాలకు, మూగ–బధిర పాఠశాలకు, హాస్టళ్ళకు, వైకుంఠం క్యూ సముదాయంలో వేచి ఉండే భక్తులకు సరఫరా చేస్తారు.

2002వ సంవత్సరంలో ప్రారంభించబడ్డ గోసంరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథలుగా ఉన్న గోవుల ఆలనా– పాలనా, ఉచిత పశువైద్యశాలల నిర్వహణ, గోవు వుత్పత్తులు మరియు పశు సంరక్షణ పద్ధతులపై శాస్త్రీయ పరిశోధన మున్నగునవి నిర్వహిస్తారు. గోమాత వైశిష్ట్యాన్ని చాటి చెప్పేందుకు గాను తి.తి.దే ఆధ్వర్యంలో ఒక జాతీయ సదస్సు నిర్వహించబడింది.

గోవుల పట్ల ప్రజలలో శ్రద్ధా భక్తులు పెంపొందించటం కోసం ప్రతిరోజూ గోపూజ నిర్వహిస్తూ, ప్రజలు కూడా పూజలో పాల్గొనే అవకాశం కలిగిస్తున్నారు. అలాగే కృష్ణాష్టమి నాడు ఘనంగా ఉత్సవాలు నిర్వహించి, వేలాదిమంది భక్తులు పురప్రముఖుల సమక్షంలో గోమాతలకు విశేషపూజలు నిర్వహిస్తారు.

## కళ్యాణకట్ట

తిరుమలను తలచుకోగానే మొట్టమొదటగా భక్తుల మదిలో మెదిలేది లడ్డూ ప్రసాదమైతే, రెండోది కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించడం. దాని పూర్తి వివరాలు.




కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వరునికి భక్తకోటి సమర్పించుకునే అనేకానేక మొక్కుబడులలో 'తలనీలాల సమర్పణ' అత్యంత ముఖ్యమైనది. వేల సంవత్సరాల నుండి స్త్రీ పురుషులిరువురూ సౌందర్య చిహ్నమైన తమ కేశసంపదను ఎన్నో వ్యయప్రయాసల కోర్చి సంరక్షించుకుంటున్నారు. భక్తులు అటువంటి అమూల్యమైన శిరోజాలను ఏమాత్రం సంకోచించకుండా శ్రీవారి సన్నిధిలో సమర్పించుకుంటారు. తిరుమలలో తలనీలాల సమర్పణకు ఎంతో పౌరాణిక ప్రాశస్త్యం, చారిత్రక వైశిష్ట్యం ఉన్నాయి.

### ముండన సంస్కారం :

మానవ జన్మనెత్తిన ప్రతి ప్రాణికీ, స్త్రీ పురుష భేదాలు లేకుండా, తప్పనిసరిగా జరగవలసిన సంస్కారాలలో ముండన సంస్కారం ఒకటి. ముండన సంస్కారమంటే తమ ఇష్టదైవం చెంతన కేశఖండన గావించుకొని, మానవ సహజమైన అహంకారాన్ని భగవంతుని పాదాల చెంత విడనాడడం. పుట్టిన బిడ్డకు ఆడ, మగ తేడా లేకుండా, ఏడాది తిరగకుండా శ్రీవారి సన్నిధిలో ముండన సంస్కారం చేయించడం దక్షిణ భారతదేశంలోని లక్షలాది కుటుంబాలలో తరతరాలుగా వస్తున్న ఆచారం.

### పౌరాణిక ప్రాశస్త్యం :

మానవులు తెలిసో తెలియకో చేసిన పాపాలు వారి కేశాలను ఆశ్రయించి ఉంటాయని పురాణాలలో చెప్పబడింది. అందువలన తిరుమల క్షేత్రంలో తలనీలాల నర్పిస్తే జన్మ జన్మల పాపాలు పటాపంచలవుతాయని భక్తుల విశ్వాసం. అంతే గాకుండా, శ్రీమహావిష్ణువు నారదునికి, వేంకటాచలంపై తాను శ్రీవేంకటేశ్వరునిగా అవతరిస్తానని, కలియుగంలో తన భక్తులు అశ్వమేధ యాగాల వంటి సంక్లిష్టమైన వైదిక ప్రక్రియలు

చేపట్టలేరని, అందువల్ల వేంకటాచలంలో వెలసిన తనకు, మనస్ఫూర్తిగా నమస్కరించుకుని తల నీలాలు సమర్పించుకుంటే పూర్వజన్మల పాపాలన్నీ తొలగిపోతాయని సెలవిచ్చినట్లుగా శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో చెప్పబడింది. శ్రీవారి మహాభక్తురాలైన 'నీలాదేవి'కి శ్రీవేంకటేశ్వరుడొసగిన వరం వల్ల తిరుమలలో తలనీలాలు సమర్పించుకునే సాంప్రదాయ మేర్పడినట్లు చెప్పబడే మరో పౌరాణిక కథనాన్ని మనం 'సప్తగిరులు' ప్రకరణంలో తెలుసుకున్నాం.

## ధార్మిక క్రతువుల్లో కేశఖండన :

భారతదేశంలో సనాతన కాలం నుండి అనేక సందర్భాలలో కేశఖండన కావించుకోవడం తప్పనిసరి. యజ్ఞయాగాదులు నిర్వర్తించేటప్పుడు, చాతుర్మాస్య దీక్ష చేపడుతున్నప్పుడు, దేవ, పితృ, ఋషి తర్పణం చేసేటప్పుడు తప్పనిసరిగా ముండనం చేయించుకోవాలని శాస్త్రాలు చెబుతున్నాయి. పద్మపురాణంలో, తీర్థయాత్రలకు వెళ్ళినప్పుడు కేశఖండన విధిగా చేయించుకోవాలని చెప్పబడింది. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైనవి, అభివృద్ధి చెందినవిగా చెప్పబడే గ్రీకు, సిరియన్, ఈజిప్షియన్ నాగరికతలలో కూడా ధార్మిక కారణాల వల్ల అప్పటి ప్రజలు తమ కేశాలను తొలగించుకున్నట్లుగా చారిత్రక ఆధారాలు లభ్యమయ్యాయి.

## చారిత్రక విశేషాలు :

శ్రీవారి సమక్షంలో తలనీలాలు సమర్పించుకోవడమనే ఆనవాయితీ చరిత్రకు అందని కాలం నుంచి ఉన్నప్పటికీ చారిత్రక ఆధారాలు మాత్రం శ్రీకృష్ణదేవరాయల కాలం నుండి మాత్రమే లభ్యమయ్యాయి. ఆ కాలంలో చంద్రగిరిని పరిపాలించిన విజయనగర రాజు శ్రీనివాస మహాదేవ రాయలవారి తామ్రశాసనం ప్రకారం, పంతులు గారి వంశానికి చెందిన 'సంజీవిని' అనే ధర్మకర్త ఆధ్వర్యంలో కొండపైనున్న ఒక పూరిపాకలో తొలి మంగలికట్ట ఏర్పడింది. అప్పట్లో శ్రీవారి మెట్ల ద్వారా నడిచి వచ్చే భక్తులు ఈ మంగలికట్టలో తలనీలాలు సమర్పించి, చెంతనే ఉన్న బావిలో స్నానమాచరించేవారని తెలుస్తోంది. దానిని అప్పట్లో 'మంగలిబావి'గా పిలిచేవారు. క్రమేణా అదే 'మంగళం బావి'గానూ, దాని సమీపంలో ఉండే అతిథి గృహాలు 'మంగళం బావి కాటేజెస్' (ఎంబిసి కాటేజెస్) గానూ పిలువబడుతున్నాయి.

18వ శతాబ్దంలో అప్పటి పాలకులు క్షౌరకర్మ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఒక గుత్తేదారుకు అప్పగించారు. ఆ గుత్తేదారు క్షురకుల నుండి 'హజన్ గూటా' అనే శిస్తును వసూలు చేసేవారు. క్షురకులు వారు చెల్లించిన శిస్తును ముండనం చేయించుకున్న భక్తుల నుండి నిర్ణీత రుసుము రూపంలో వసూలు చేసుకునేవారు. ఆవిధంగా దాదాపు మూడు వందల సంవత్సరాల క్రితమే తిరుమలలో తలనీలాల సమర్పణ ఒక ఆధ్యాత్మిక ప్రక్రియగా పరిణతి చెందడమే గాకుండా, ఒక ప్రధాన ఆదాయ వనరుగా మారి క్షేత్రాన్నే నమ్ముకున్న అనేకమందికి జీవనోపాధి కూడా కల్పిస్తుండేది.

1831వ సంవత్సరంలో అప్పటి ఆర్కాట్ జిల్లా కలెక్టర్ ఏషియాటిక్ జర్నల్ అనే పత్రికలో ప్రచురించిన వ్యాసంలో భక్తులు హుండీ ద్వారా బంగారం అచ్చులు, వెండి ముద్రలు, రూపాయల సంచులు, రాగి నాణాలు, సుగంధ ద్రవ్యాలు వంటివే కాకుండా, తమ పొడవాటి అందమైన జుట్టును కూడా భగవంతునికి సమర్పించుకునేవారని పేర్కొన్నాడు. గత రెండు వందల సంవత్సరాలలో జీవన విధానం అనేక కొత్త పోకడలు తొక్కి, అనేక సంప్రదాయాలు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ ఈ మొక్కుబడి సజీవంగా ఉండడమే కాకుండా, తలనీలాలు సమర్పించుకునే భక్తుల సంఖ్య ఏ ఏటికాయేడు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతూనే ఉంది. శ్రీనివాసుని పట్ల ప్రజలలో పెరుగుతున్న భక్తివిశ్వాసాల కిది మరో ప్రబలమైన తార్కాణం.

1917వ సంవత్సరంలో కొండపై 70 మంది క్షురకర్మ నిర్వహించేవారుంటే ఆ రోజుల్లోనే తలనీలాల సమర్పణకు ఎంతటి ఆదరణ ఉందో ఊహించుకోవచ్చు. 1946వ సంవత్సరంలో అప్పటి తి.తి.దే పాలకమండలి మరియు ధర్మకర్త పంతులుగారి వంశస్థుడైన 'శివరామయ్య' గారితో కుదిరిన మరో ఒప్పందం ప్రకారం కేశఖండన ద్వారా యాత్రికుల నుండి వచ్చే 25 శాతం తి.తి.దేకు 75 శాతం క్షురకులకు చెందేటట్లుగా తీర్మానం చేయబడింది. 1952వ సంవత్సరంలో తి.తి.దే క్షురకర్మ కోసం ఒక విశాలమైన భవనాన్ని నిర్మించింది. అప్పట్లో మంగలికట్టగా పిలువబడే ఆ భవనం కాలక్రమంలో 'కళ్యాణకట్ట'గా నామాంతరం చెందింది. 1974వ సంవత్సరంలో తిరుమల క్షేత్రంలో దేవస్థానం వారి కళ్యాణకట్ట మాత్రమే ఉండాలని నిర్ణయించి, భక్తుల నుంచి వసూలు చేసే రుసుము తి.తి.దేకు, క్షురకులకు చెరిసగం చెందేట్లుగా ఒప్పందం సవరించబడింది. క్షురకుల సంఖ్యను 200 కు పెంచి అప్పట్లో శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న సువిశాలమైన 'వెయ్యికాళ్ళ మండపం'లో కేశఖండనకు ఏర్పాటు చేశారు. నాలుగైదు దశాబ్దాల క్రితం తిరుమలను దర్శించుకున్న వారికి దేవాలయం ఎదురుగా ఉన్న విశాలమైన దినమంతా భక్తులతో సందడిగా ఉండే 'వెయ్యికాళ్ళ మండపం'లో తలనీలాలు సమర్పించుకోవడం ఇంకా మదిలో మెదులుతూనే ఉంటుంది. ఆ పాత జ్ఞాపకాలు అత్యంత మధురాలు.

1975వ సంవత్సరంలో క్షురకులు మరియు తి.తి.దే యాజమాన్యం మధ్య జరిగిన మరో ఒప్పందం ప్రకారం తలనీలాల అమ్మకంపై వచ్చే ఆదాయం మరియు క్షవరం నిమిత్తం భక్తులు





చెల్లించుకున్న రుసుము మొత్తంగా తితిదేకు మాత్రమే చెందాలి. దానికి ప్రతిఫలంగా క్షురకులందరినీ దేవాలయ సిబ్బందిగా పరిగణించి, వారికి నిర్ణీత జీతభత్యాలు ఇవ్వాలని నిర్ణయించారు.

అనంతరం అలిపిరి మార్గంలో కూడా భక్తుల రద్దీ పెరగడంతో ప్రస్తుతం ఉన్న ప్రథమ కళ్యాణకట్ట ప్రాంతంలో ఒక పూరిపాక ఏర్పరచుకుని క్షురకులు తలనీలాలు తీసేవారు. అప్పట్లో ఆ ప్రాంతాన్ని 'ఏనుగుల మిట్ట'గా పిలిచేవారు.

ఈవిధంగా మొత్తం కళ్యాణ కట్టలన్నీ తి.తి.దే పరం అయిన తరువాత 1985వ సంవత్సరంలో ప్రస్తుతం ప్రథమ 'కళ్యాణకట్ట'గా పిలువబడే అధునాతన భవనాన్ని అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు ప్రారంభించారు. తరువాత 2002 వ సంవత్సరంలో రెండవ కళ్యాణకట్ట భవనం ప్రారంభించబడింది.

కాలక్రమేణా భక్తులకు తలనీలాలు తీసే కార్యక్రమం పూర్తి ఉచితంగానే చేపట్టబడుతోంది. క్షురకులు అతిథి గృహానికి వచ్చి తలనీలాలు తీయాలంటే మాత్రం స్వల్ప రుసుము చెల్లించాలి.

ప్రస్తుతం ఈ కళ్యాణ కట్టలలో యాత్రికుల సౌకర్యార్థం అనేక అధునాతన సదుపాయాలు కల్పించబడ్డాయి. గాలి, వెలుతురు వచ్చే విశాలమైన హాలు, పరిశుభ్రమైన వాతావరణం, వేడినీళ్ళ సరఫరాతో బాటుగా, ప్రతి భక్తునికి ఒక సరికొత్త బ్లేడు ఉపయోగించబడుతుంది.

ఈమధ్య కాలంలో మహిళా భక్తుల నిమిత్తం మహిళా క్షురకులను కూడా నియమించి దేశంలోనే ఒక వినూత్నమైన సంప్రదాయానికి తి.తి.దే శ్రీకారం చుట్టింది. తద్వారా మహిళా భక్తులకు వెసులుబాటు కలగడమే కాకుండా, ఎంతోకాలంగా శ్రీవారినే నమ్ముకున్న నాయీ బ్రాహ్మణ కుటుంబాలలోని స్త్రీలకు కూడా కొంత ఉపాధి లభిస్తోంది.

## కేశాలు కాదు – కాసుల రాశులు :

భక్తులు సమర్పించుకున్న శిరోజాలకు జాతీయ, అంతర్జాతీయ విపణుల్లో విపరీతమైన గిరాకీ ఉంది. సౌందర్య సాధనాలు తయారు చేసే సంస్థలు, బొమ్మలు ఉత్పత్తి చేసే పరిశ్రమల్లో శిరోజాల వినియోగం అధికంగా ఉంటుంది. చైనా, కొరియా వంటి ఆసియా దేశాలకు, యూరప్, అమెరికా వంటి ఇతర ఖండాలకు కూడా జుట్టు ఎగుమతి అవుతుంది. దేశం మొత్తం మీద లభ్యమయ్యే శిరోజాలలో 80 శాతం పైగా తిరుమల నుంచే సరఫరా అవుతోంది. శిరోజాల అమ్మకాల ద్వారా ప్రతి సంవత్సరం వంద కోట్లకు పైగా ఆదాయం సమకూరడంతో దేవస్థానం వారు జుట్టు కత్తిరించే విధానంలోనూ, శుభ్రపరిచే ప్రక్రియలోనూ, కత్తిరించిన జుట్టును పొడవును బట్టి ఐదు గ్రేడులుగా విభజించే విధానంలోనూ, జుట్టును ఆరబెట్టి ఒక్కొక్కటి ముప్పై కిలోల బరువున్న మూటగా కట్టి గిడ్డంగుల్లో భద్రపరచడం లోనూ ఎప్పటికప్పుడు అధునాతన పద్ధతులను అవలంబిస్తున్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న జుట్టును అంతర్జాలం ద్వారా టెండర్లను ఆహ్వానించి పూర్తి పారదర్శకతతో విక్రయిస్తున్నారు.

## క్షౌర కౌశలం :

గుండు గీయడం నైపుణ్యంతో కూడుకున్న విద్య. నెత్తిమీద ఒక్క గాటు కూడా పడకుండా గుండు చేయగలిగిన వారిని అత్యంత నైపుణ్యం కలిగిన వారిగా గుర్తిస్తారు. భక్తుల రద్దీ విపరీతంగా ఉన్న తిరుమల క్షేత్రంలో ఆ పని చేయడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఒక్కో క్షురకుడు రోజుకు 60 నుంచి 70 మందికి గుండు గీస్తారంటే వారు ఎంత వేగంగా, ఎంత చాకచక్యంతో ఈ విధిని నిర్వహిస్తారో అర్థమవుతుంది.

ఈ మొత్తం వ్యవహారాలన్నింటిని పర్యవేక్షించడానికి తితిదేలో ఒక అత్యున్నత అధికారి నేతృత్వం వహించే ప్రత్యేక విభాగమే ఉందంటే దీనికి దేవస్థానం వారు ఎంతటి ప్రాముఖ్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అలా తిరుమలలో తలనీలాల సమర్పణకు ఎనలేని పౌరాణిక, చారిత్రాత్మక, వాణిజ్యపరమైన ప్రాముఖ్యం ఉంది.

# శ్రీకృష్ణ లీలలలోని వేదాంత తత్త్వాలు



శ్రీకృష్ణుడు బాలుడుగా వ్రేపల్లెలో రహస్యంగా పెరిగే కాలంలో, ఆ స్వామిని చంపడం కోసం కంసుడు చాలామంది అసురులను పంపాడు. వారిని అందరినీ శ్రీకృష్ణుడు వధించాడు. వాటిలో ఇపుడు తృణావర్తుని కథను, అందులోని రహస్యాన్ని గమనిద్దాం.

ఒకనాడు యశోదాదేవి తన ఒడిలో బాలుడైన శ్రీకృష్ణుణ్ణి కూర్చోబెట్టుకుని ముద్దులాడుతున్నది. ఉన్నట్లుండి శ్రీకృష్ణుడు క్రమ క్రమంగా చాలా బరువు అయ్యాడు. దానికి కారణమేమో తెలియని యశోదాదేవి ఆశ్చర్యపడి అతని బరువును మోయలేక అతనిని కింద కూర్చుండబెట్టింది. అప్పటికే కంసుడు పంపించిన తృణావర్తుడు అనే ఒక అసురుడు శ్రీకృష్ణుణ్ణి చంపడానికి అనువైన అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. యశోదాదేవి తన ఒడిలో నుండి శ్రీకృష్ణుని కింద కూర్చోబెట్టగానే ఆ అసురుడు సుడిగాలి రూపంలో వచ్చాడు. వ్రేపల్లెలో అంతటా దుమ్ము ఆవరించేటట్లు చేసి అంతా చీకటిని చేశాడు. శ్రీకృష్ణుని ఆకాశంలోకి వేగంగా తీసుకొని పోయాడు. ఆ సుడిగాలి వేగం వల్ల అంతటా దుమ్మురేగి చీకటి ఆవరించినందువల్ల శ్రీకృష్ణుని చూడలేని యశోదాదేవి అతడు ఏమైనాడో తెలుసుకోలేకపోయింది.

శ్రీకృష్ణుని తీసుకుని ఆకాశంలోకి వెళ్ళిన తృణావర్తుడు క్రమ క్రమంగా బరువు అధికమవుతున్న శ్రీకృష్ణుని మోయలేకపోయాడు. బాలకృష్ణుడు తృణావర్తుని కంఠాన్ని తన చేతులతో గట్టిగా పట్టుకున్నాడు. శ్రీకృష్ణుని చేతుల పట్టు నుండి బయట పడటం కోసం ఆ అసురుడు ఎంత పెనుగులాడినా అతనికి సాధ్యం కాలేదు. పైగా శ్రీకృష్ణుని బరువు మరింత అధికం అయింది. దానితో ఆ అసురుడు బాధను భరించలేక గట్టిగా కేకలు పెడుతూ వ్రేపల్లెలోని ఒక రాతిపై శ్రీకృష్ణునితో పాటు పడిపోయాడు. అతని అవయవాలు అన్నీ చూర్ణం అయ్యాయి. అతడు ప్రాణాలను వదిలిపెట్టాడు. శ్రీకృష్ణ బాలునకు మాత్రం ఎటువంటి ఆపద కలగలేదు. ఎటువంటి అపాయం లేకుండా కిందకు వచ్చిన శ్రీకృష్ణుని చూచి ఆ స్వామి విషయంలో ప్రీతిని కలిగిన యశోద, నందగోపాలుడు, వ్రేపల్లెలోని గోప గోపీజనం అంతా ఆశ్చర్యంతో పాటు ఆనందాన్ని పొందారు.

ఈ వృత్తాంతంలో వ్యక్తమవుతున్న వేదాంత తత్త్వాలను గమనిద్దాం. జీవునిలో అహంకార మమకారాలు అధికమైనప్పుడు ఈ లోకంలో ఉండే వస్తువులు అన్నీ భగవంతునకు చెందినప్పటికీ వాటిని తనవిగా భావించి వాటిని పొందాలనే ఆశను పొందుతాడు. అవి భగవంతుని సొత్తు అని అతడికి తెలియలేదు. అప్పుడు అతనికి లౌకిక విషయాలపై తృష్ణ కలుగుతుంది. ఈ తృష్ణయే ఒక సుడిగాలి. సుడిగాలి తనలో పడిన గడ్డిపోచను ఏవిధంగా వేగంగా పైపైకి తీసుకొని పోతుందో ఆ విధంగానే తగని ఆశ అనేది జీవుని మనసు భ్రమించేటట్లు చేస్తుంది. తృణావర్తుడు సుడిగాలి రూపంలో వేగంగా వచ్చినప్పుడు వ్రేపల్లెలో అంతటా దుమ్ము ఆవరించింది. దానివల్ల అంతటా చీకటి అయిపోయింది. ఇటువంటి స్థితిలో వ్రేపల్లెలో ఉండేవారు ఏమీ చూడలేకపోయారు. ఈవిధంగానే జీవుని మనసులో ఆశ అధికమయ్యే కొద్దీ, అతనిలో ఉండే వివేక జ్ఞానం నశిస్తుంది. ఏమీ గమనించలేరు. మంచి చెడ్డలు తెలియవు. తమో గుణం పూర్తిగా అతనిని మనసును ఆవరిస్తుంది. ఆత్మ పరమాత్మల వివేకజ్ఞానం అతనికి కలుగదు.


శ్రీకృష్ణుడు తృణావర్తుని వధించి, తనను ప్రాణంగా అభిమానించే యశోదానందుల వ్రేపల్లెలోని గోప గోపీ జనాల ఆర్తిని చూసి మళ్ళీ తాను వారికి లభించేటట్లుగా చేశాడు. ఆ విధంగానే జీవుడు తనలో ఉండే లౌకికమైన ఆశను భగవంతునిపై భక్తిని పెంపొందించుకోవడం ద్వారా పోగొట్టుకోవాలి. మనసులో లౌకికమైన ఆశ ఎక్కువయ్యే కొద్దీ భగవంతుడు దూరం అవుతాడు. భగవంతునిపై భక్తి పెరిగినట్లయితే అతడు దగ్గర అవుతాడు. గడ్డిపోచను సుడిగాలి దూరంగా తీసుకు పోయినట్లే జీవుని మనసు అనే తృణాన్ని సుడిగాలి అనే లౌకిక విషయాలలోని తృష్ణ దూరంగా తీసుకుని పోతుంది. భగవంతునిపై భక్తిని, ప్రీతిని పెంపొందించుకోవడం ద్వారా లౌకిక తృష్ణను నశింప చేసుకోవచ్చు అనే తత్త్వమే తృణావర్త నిరసన వృత్తాంతంలో వ్యక్తమవుతున్నది – అని పెద్దల అభిప్రాయం.

**శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః**

# కృష్ణ నామం

– పి.ఎల్.నరసింహాచార్య దాసన్

కృష్ణనామం పరమ ఔషధం. కృష్ణనామ స్మరణం కలిదోష నాశనం. శ్రీకృష్ణనామం ఎంతో మధురాతి మధురమైనది. కృష్ణ నామాన్ని ఏ తీరుగా తరించినప్పటికీ మన మనసులలోని మాలిన్యాన్ని కడిగేస్తుంది. కృష్ణా అనే నామ సంకీర్తనం వల్ల కోటి చంద్రగ్రహణ, సూర్యగ్రహణ స్నానాలను చేయడం వల్ల కలిగే ఫలితం పొందుతారు. కృష్ణ నామం ఎన్ని పాతకాలను దహించగలదంటే అసలన్ని పాపాలను మానవులు ఎన్నటికీ చేయలేరు. పాప రూపాగ్నిలో దహనమై, చేసిన సత్కర్మలన్నీ శూన్యమైన వారికి కృష్ణనామం పరమ ఔషధం వంటిది. మృత్యు సమయంలో కూడా కృష్ణ నామాన్ని స్మరిస్తే యమపురికి పోకుండా పరంధామానికి చేరుకుంటారట. కలియుగములో నామ సంకీర్తనమే ముక్తికి సాధనం అని చెప్పబడింది. కలి వల్ల కలిగే దుష్ఫలితాలను పోగొట్టుకోవడం ఎట్లా అని ఒకసారి నారదుడు బ్రహ్మదేవుని అడుగగా ''సత్యయుగంలో ధ్యానం వల్ల, త్రేతాయుగంలో యజ్ఞాల వల్ల, ద్వాపర యుగంలో పూజలు, వ్రతాల వల్ల పొందే ఫలితాలన్నీ కలియుగంలో కేవలం నామస్మరణ వలన పొందుతారని, 'హరే రామ హరే రామ రామ రామ హరే హరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే'' అనే నామ మంత్రం ఉపదేశించాడు. ఈ మంత్రం లోని రామ శబ్దం, హరి శబ్దం పరబ్రహ్మ వాచకమైన శ్రీకృష్ణుణ్ణే సూచిస్తాయి. 'కృష్ణ' అంటే పాపాలు పోగొట్టేవాడు. కృష్ణ అన్న పదంలోని 'క' కారం బ్రహ్మ వాచకం. 'ఋ' కారం అనంత వాచకం. 'ష' కారం శివ సూచకం. 'ణ' కారం ధర్మబోధకం. చివర ఉన్న అ కారం శ్వేతద్వీప వాసియైన విష్ణు వాచకం. 'విసర్గ' నర నారాయణార్థకం. కనుక కృష్ణుడు సమస్త దేవతల తేజోరాశి. 'కృష్ణస్తు భగవాన్ స్వయమ్' అని కృష్ణ భగవానుని నామాన్ని నిత్యం స్మరించినంత మాత్రానికే పదివేల యజ్ఞాలు, కోటితీర్థ స్నాన పుణ్యం లభిస్తుందని, వ్రతాల వలన కూడా నశించని పాపాలు కృష్ణ అని నామోచ్చారణ చేయడంతో తొలగిపోతాయని, 'కృష్ణ' అంటూ కీర్తించే వారి శరీరం ఎన్నటికీ అపవిత్రం కాజాలదని, జన్మ జన్మల పాపాలన్నీ తొలగి కృష్ణునిపై మనసు లగ్నమవుతుంది. శ్రీకృష్ణ నామ మహిమ గురించి సాక్షాత్తు శ్రీమహావిష్ణువే బ్రహ్మకు చెప్పే సందర్భం స్కంద పురాణంలో ఉంది. కృష్ణ నామోచ్చారణ చేయడం వల్ల నాకెంత ప్రీతి కలుగుతుందంటే, ఇతర నామాలు కోటిసార్లు చేసినా నాకు అంత సంతోషం కలగదు అన్నాడు. నామ స్మరణకే ప్రభావమున్నదని గ్రహించి, శ్రీకృష్ణ నామమునే సదా స్మరించి నారదాదులు ఆయన కృపకు పాత్రులయ్యారు. కనుక కలియుగంలో జీవిస్తున్న మానవులందరికీ నామ మహిమను,



లోక ధర్మాలని చెప్పిన కారణంగా శ్రీకృష్ణావతారము కలియుగ ప్రజలందరికీ గొప్పది. ఆచరణానికి అనువైనది. భక్త దుఃఖ కర్షిం కృష్ణః అంటే భక్తుల దుఃఖాన్ని పోగొట్టేవాడు శ్రీకృష్ణుడు అని అర్థం. మానవ జీవితంలోని పాపాల్ని పోగొట్టుకోవడానికి శాస్త్రాలలో అనేక ప్రాయశ్చిత్తాలు చెప్పారు. చాంద్రాయణాది వ్రతాలు ఎన్నో చేయాల్సి ఉంటుంది. కాని ఎన్ని చేసినా ఆ పాపం పోదు. కాని శ్రీకృష్ణ నామం జపిస్తే క్షోభం వల్ల కలిగిన పాపం కూడా నశిస్తుంది. అందుకు కారణం శ్రీకృష్ణ నామంలో క్లేశఘ్ని – పాపఘ్ని అనే బలవత్తరమైన శక్తులుండటమేనని – ఈ జగత్తులో పరమాత్ముడు ఎన్ని రూపాలతో విరాజిల్లుతున్నాడో అన్ని నామాలతో ఆయన పేర్కొనబడుతుంటాడు. కృష్ణ నామం పాపాన్ని నాశనం చేసి, పుణ్యాన్ని ఉత్పాదించి, భక్తిని తత్వజ్ఞానాన్ని, భగవత్తృప్తిని కలిగిస్తుంది. కృష్ణ నామ జపం చేసేవారికి విపత్తియే సంపత్తిగా పరిణమిస్తుంది. పురుషోత్తముడు, స్థితప్రజ్ఞుడైన శ్రీకృష్ణుడు విష్ణుమూర్తి యొక్క మహోన్నతావతారం, పదారు కళల్లో మూర్తీభవించిన పూర్ణావతారం. జీవులు తరించుటకు ఉపనిషత్సారమైన గీతామృతాన్ని పంచిపెట్టిన ప్రేమమూర్తి. ద్వాపర యుగంలో రోహిణీ నక్షత్ర యుక్త శ్రావణ బహుళ అష్టమి నాడు శ్రీమన్నారాయణుడు శ్రీకృష్ణునిగా అవతరించాడు. అష్టమి యొక్క అర్ధరాత్రి సమయంలో ఆకాశమందు అర్ధచంద్రుడు ప్రకాశించగా, పృథ్వి యందు పూర్ణచంద్రుడు ఉదయించినట్లు శరణాగత వత్సలుడు దేవకీదేవికి జననం. శ్రీకృష్ణావతారం సంపూర్ణావతారమనీ, శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగంతుడేనని భాగవతం మనకు వెల్లడిస్తోంది. ఆ శ్రీకృష్ణ పరబ్రహ్మకు భక్తి ప్రపుల్లాత్ములమై ప్రణమిల్లి మన జీవితాలను ధన్యం చేసుకుందాం.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఓర్పునేర్పుతో లౌకిక భావన కలిగి ప్రతివిషయంలో చాకచక్యంగా మసలుకొనగలరు. గృహ అవసరమైనవి సమకూర్చుకొనగలరు. గృహములో వారికి అనారోగ్య సూచనలు. సత్యనారాయణ స్వామి వ్రతం చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు గ్రహానుకూలత వలన తెలియని సంతృప్తి ఆకస్మిక ధనలాభం. బంధుమిత్రుల కలయిక. వృత్తివ్యాపార లాభములు. వస్తు వాహన లాభం. విద్యార్థులకు మంచి మార్కులు. ఉదర సంబంధమైన అనారోగ్యములు కలిగి ఉన్నారు. నవగ్రహ ప్రదక్షిణలు రోజుకి 45 సార్లు చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని ఇబ్బందికరమైన సమస్యలు రాగలవు. నాలికను అదుపులో ఉంచుకోవలెను. ఉద్యోగములో ప్రమోషన్ ఉంటుంది. ఆకస్మిక ధనాదాయం కలిగి ఉన్నారు. మీరు ఇంట్లో నుండి తరచూ ఏదో ఒకటి ఆలోచన చేయగలరు మంచిది కాదు.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో తొందరపాటు తనం లేకుండా ఉండాలి. చెడు స్నేహాలు వదలండి. చాలా చలాకిగా యాక్టివ్గా ఉండగలరు. హామీ ఉండరాదు. ఉన్నారో మీరు సంపాదించింది పోతుంది. మీ వృత్తి వ్యాపారములలో అనుకూలత. విష్ణు సహస్ర నామపారాయణ తప్పునిసరిగా చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు వివాహ ప్రయత్నములు ఫలించగలవు. బంధుమిత్రుల అభినందనలు. ప్రతి విషయంలో అనుకూలత. ఆర్థికపరమైన సమస్యలు ఉండగలవు. తొందరపాటు వలన కలవరపాటు ఉంటుంది. సరస్వతిదేవి కవచం, లక్ష్మీదేవి కవచం, కనకధార స్తోత్రములు చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రయాణాలలో అజాగ్రత్త వలన దొంగతనములు. గృహములో కూడా నిర్లక్ష్యముగా ఉండరాదు. అనవసర ఖర్చులు వాయిదా వేయండి. ఆర్భాటమునకు సమయం కాదు. తొందరపాటు తనం వలన అనేక సమస్యలు రాగలవు. అరసవెల్లి సూర్య దర్శనం ప్రదక్షిణం, ఆదిత్య పారాయణ చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనేక విధములుగా అభివృద్ధి ఉంటుంది. ప్రతి విషయంలో ముందంజలో ఉంటారు. కొన్ని పాత బాకీలు తీర్చాలి లేక ఏదైనా ఖరీదు చేయాలి అనే తపన కలిగి ఉండగలరు. ఎదుగుదలకు సరైన సమయం. చాలా జాగ్రత్తగా గమనించండి. జరిగిపోయిన సమయం తిరిగిరాదు. గురు ప్రార్థన, ఆరాధనలు చేయండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్య లాభము. ప్రతి విషయంలో ఆదాయం కన్నా ఖర్చులు అధికంగా ఉండగలవు. వాహన యోగం కోర్కె తీర్చుకొనగలరు. విలాసవంతమైన జీవన విధానం ఉండాలి అనే కోరిక ఉంటుంది. సత్యదేవుని వ్రతం చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనుకూలంగా ఉంటుంది. భూములు, గృహము ఖరీదు చేయగలరు. ఉద్యోగములో ప్రమోషన్. వ్యక్తిగతంగా ఎన్నడు లేనంత సమర్ధవంతంగా అభివృద్ధిలో ఉండగలరు. సంఘంలో గౌరవ మర్యాదలకు ఎదురుండదు. సత్యదేవుని వ్రతము చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు మీరు చాకచక్యంగా మాట్లాడగలిగినప్పుడు మీకు లాభము ఉంటుంది. తొందరపాటు, ఏమరుపాటు మిమ్మలను వెనక్కి పంపును. ప్రతిసారి నాలుకను అదుపులో పెట్టుకొనగలరు. సూర్య ఆరాధన, దుర్గాదేవి పూజలు, శివనామ స్మరణ చేయండి.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంత ఊరట కలిగి ఉండగలరు. ప్రతి విషయం కత్తిమీద సాములాగ ఉంటుంది. కాని ఎలాంటి భయములకు లోనుకాకుండా ప్రయత్నములను సరిదిద్దుకొని గ్రామదేవతలకు పూజలు, అన్నవరం సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఏకాగ్రత కలిగి మీరు ఆ పరమేశ్వరుని ధ్యాన దీక్షలో విజయం అనేది ఉంటుంది. ప్రతి విషయంలో ఆటంకములు తొలగును. ప్రోత్సాహము ఉంటుంది. వృత్తి వ్యాపారములందు అనుకూలంగా ఉంటుంది. గ్రామదేవతా అనుగ్రహం పొంది ఆనందంగా ఉంటారు.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. మరుత్తుని తండ్రి ఎవరు?
2. అన్నం పెట్టినవాడు ఎవరితో సముడు?
3. దేవతల గురువు ఎవరు?
4. తన శవాన్ని తానే భుజించినదెవరు?
5. బృహస్పతి తమ్ముడు ఎవరు?
6. వ్యాసపూర్ణిమ కథ ఎక్కడుంది?
7. శ్వేతుని తమ్ముడు ఎవరు?
8. స్వయంప్రభాదేవి ఎవరి కూతురు?
9. కన్వోపాత్ర ఏ చెట్టుగా వెలసింది?
10. వ్యాసుని అనుగ్రహం పొందినదెవరు?
11. వసిష్ఠుని నిరంతరం ధ్యానించిందెవరు?
12. గురువుకు మోక్షాన్ని ఇప్పించిన శిష్యుడెవరు?
13. తులసి మొక్కగా అవతరించిందెవరు?
14. భక్తుని కోసం జ్వరం తెచ్చుకున్నదెవరు?
15. ఏకాదశి ఎవరు?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. హంస ధ్యానం, 2. కువలాశ్వుడు, 3. కాలడి, 4. సుషేణుడు, 5.మధు కైటభులు, 6. పూర్ణా నది, 7. నారాయణ సూర్యాజీ, 8. వాయవ్యంలో, 9. అగస్త్యుడు, 10. రజోగుణం, 11. కుంభుడు, 12. ఆదిశంకరులు, 13. మధు కైటభులు, 14. భీమస్వామి, 15. తొండమానునికి

## సరైన సమాధానాలు రాసినవారు

1. కావూరి కనకదుర్గ, 2. చింతలపాటి శివశంకర శాస్త్రి, 3. వి. వసుంధర, 4. బులుసు బాబూరావు, 5. వేలూరి భానుమతి (టీచర్) 6. లావణ్య

పేరు: ______

చిరునామా: ______

______

______


______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**వేలూరి భానుమతి**



Postel Registration No: HSE/879/2022-2024
Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month
RNI No.: APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక



If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**
H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq